సోమవారం
2•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 247
• పేజీలు : 12+16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE





# సూపర్ పోలీస్

- నేరంచేసి దొరికారో.. శిక్ష తప్పదు
- పక్కా దర్యాప్తుతో పెరుగుతున్న శిక్షల సంఖ్య
- సాంకేతికత సాయంతో కీలక సాక్ష్యాల సేకరణ
- గతేడాది 2,074 కేసుల్లో శిక్షలు ఖరారు
- కోర్టు వర్టికల్ విధానంతో చేకూరుతున్న మేలు

పారా హుషార్.. రాష్ట్రంలో నేరంచేస్తే శిక్ష తప్పదు. ఏదో ఒకటి చేసి తప్పించుకుందామంటే కుదరదు. బెయిల్‌పై విడుదలైతే చాలు.. బిందాస్‌గా ఉండొచ్చనుకుంటే సాధ్యంకాదు. రాష్ట్రంలో పోలీస్ విచారణ తీరు సమూలంగా మారింది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న పోలీస్‌శాఖ నేరం జరిగిన వెంటనే వేగంగా దర్యాప్తు పూర్తిచేస్తున్నది. కోర్టు ముందు దోషులను నిలబెట్టి బాధితులకు న్యాయమందించడంలో తెలంగాణ పోలీసుశాఖ దేశంలోనే అగ్రగామిగా ఉన్నది. గత కొన్నేండ్లలో నేరాల పరిష్కారంలో పోలీసులు చూపిన చొరవతో దోషులకు శిక్షల శాతం గణనీయంగా పెరిగింది.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ప్రభుత్వపరంగా అందుతున్న మౌలిక సదుపాయాలు.. అందిపుచ్చుకొన్న సాంకేతికత.. అన్నింటా ఉన్నతాధికారుల ప్రోత్సాహం.. వెరసి తెలంగాణ రాష్ట్రంలో పోలీసు దర్యాప్తు పక్కాగా, వేగంగా సాగుతున్నది. ఎలాంటి తప్పు చేసినా తెలంగాణ పోలీసుల కండ్ల నుంచి తప్పించుకోవడం అసాధ్యం అన్న సందేశాన్ని పంపేలా శాస్త్రీయ పద్ధతిలో కేసుల దర్యాప్తు చేపడుతూ.. ఎక్కువ కేసుల్లో శిక్షలు పడేలా చేస్తున్నారు. గతేడాదిలో తెలంగాణ పోలీసుల పకడ్బందీ దర్యాప్తును పరిశీలిస్తే.. దర్యాప్తులో శాస్త్రీయ విధానం, వేగం ఎలా ఉన్నదో అర్థమవుతుంది. గత ఏడాది మొత్తం 2,074 మందికి శిక్షలు ఖరారు కాగా, వీరిలో 140 మందికి యావజ్జీవశిక్షలు పడటం గమనార్హం. అత్యధికంగా హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 16 మందికి యావజ్జీవశిక్ష విధిస్తూ తీర్పులు వచ్చాయి. తాజాగా గత జనవరి నెలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కలిపి 125 మంది నిందితులకు శిక్ష పడింది. ఇందులో తొమ్మిది




**గతేడాదిలో పలు కేసుల్లో విధించిన శిక్షలు**

| శిక్షకాలం | నేరస్థులు |
|---|---|
| 0-3 ఏండ్లు | 1749 |
| 4-7 ఏండ్లు | 124 |
| ఏడేండ్లు, ఆపైన | 61 |
| యావజ్జీవ ఖైదు | 140 |

మొత్తం నేరస్థుల సంఖ్య **2074**

**125** తాజాగా జనవరి నెలలో శిక్ష పడిన వారి సంఖ్య. ఇందులో తొమ్మిది మందికి జీవితఖైదు.

మిగతా 4వ పేజీలో



పట్టణప్రగతి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు ప్రాంతంలో ఓ పూల వ్యాపారితో ముచ్చటిస్తున్న పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ కూడా ఉన్నారు.

# టీఎస్‌బీపాస్ ముహూర్తం ఖరారు

# ఏప్రిల్ 2

## 21 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు

- మెరుగైన సేవలందించేందుకే కొత్త మున్సిపల్ చట్టం
- పనిచేయకపోతే కార్పొరేటర్లు ఇంటికి పోవుడే.. ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాభివృద్ధి
- ఖమ్మం, ఇల్లెందు పట్టణప్రగతి కార్యక్రమాల్లో ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్

'పల్లెలు, పట్టణాల అభివృద్ధితోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుంది. ప్రజల భాగస్వామ్యంతోనే అది సాధ్యమవుతుంది. 21 రోజుల్లోనే ఇంటి అనుమతులు మంజూరుచేసే టీఎస్ బీపాస్ ఏప్రిల్2వ తేదీ నుంచి అమల్లోకి రానున్నది. అంతా ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చుకుందాం. పారిశుద్ధ్యంతోపాటు మొక్కలునాటి సంరక్షించే బాధ్యతను కార్పొరేటర్లు తీసుకోవాలి' అని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు.

**ఖమ్మం ప్రధాన ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, వారికి మెరుగైన సులభతరమైన సేవలు అందించేందుకే కొత్త మున్సిపల్ చట్టాన్ని రూపొందించామని రాష్ట్ర పురపాలక, ఐటీశాఖమంత్రి కే తారకరామారావు అన్నారు. 21 రోజుల్లోనే భవన నిర్మాణ అనుమతులు మంజూరుచేసే టీఎస్‌బీపాస్ చట్టం ఏప్రిల్ 2వ తేదీనుంచి అమల్లోకి రానున్నదని తెలిపారు. పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందనేది సీఎం కేసీఆర్ ప్రగాఢ విశ్వాసమన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయమని.. అనంతరం ఎలాంటి వివక్ష లేకుండా అన్నిప్రాంతాలను అభివృద్ధి చేసేందుకే ఎల్లప్పుడూ ఆలోచిస్తుంటారని చెప్పారు. డివిజన్ పరిధిలో నాటిన మొక్కల్లో 80 శాతానికి తక్కువగా నమోదైతే

మిగతా 2వ పేజీలో

భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోనే అనుమతి మంజూరవుతుంది. గడువు దాటితే అనుమతిపత్రం ఇంటికే బట్వాడా అవుతుంది. తప్పుడు సమాచారమిస్తే నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయడమూ జరుగుతుంది.

ముందుగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందరం మారుదాం. తర్వాత ప్రజల్లో మార్పును ఆశిద్దాం. మనఇల్లు ఒక్కటే బాగుంటే సరిపోదు.. ఆవాసం ఉంటున్న కాలనీఅంతా ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలి. అలా అనుకుంటే స్వచ్ఛ నగరాన్ని నిర్మించటం గొప్ప విషయమేమీ కాదు.

పరిశుభ్రత, పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలి. అపరిశుభ్రత కారణంగానే ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. చెత్తను అనేక ప్రాంతాల్లో కాల్చివేస్తున్నారు. దీనివల్ల విషవాయువులు గాలిలో కలిసి క్యాన్సర్ కారకాలుగా మారుతాయి.

\- మంత్రి కేటీఆర్

సామాజిక న్యాయానికి పెద్దపీట 2

# ఎండ దడ

- ఈసారి పెరుగనున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 1 డిగ్రీ సెల్సియస్ వరకు ఎక్కువ నమోదయ్యే అవకాశం
- రాష్ట్రంలో వడగాడ్పులూ అధికమే
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా

ఈ సీజన్‌లో ఎండలు దడ పుట్టించబోతున్నాయి. ఇప్పటికే ప్రారంభమైన వడగాలులు రాబోయే సమ్మర్ సీజన్‌లో నేలను భగభగ మండించబోతున్నాయి. ఉత్తర తెలంగాణ, ఈశాన్య తెలంగాణకు వడగాలుల తీవ్రత అధికంగా ఉండబోతున్నది. తెలంగాణ హీట్ వేవ్ జోన్‌లో ఉన్నట్టు భారత వాతావరణశాఖ ప్రకటించింది. మార్చి నుంచి మే చివరి వారం వరకు తెలంగాణతోపాటు దేశంలోని పలు రాష్ట్రాలు ఎండకాలానికి విలవిల్లాడి పోతాయని హెచ్చరిస్తున్నది.

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో ఈ ఎండాకాలం భయపెట్టనున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.5 డిగ్రీల నుంచి 1 డిగ్రీ సెల్సియస్ వరకు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న అంచనావేశారు. గత ఏడాది కంటే ఈ సారి వడగాడ్పులు కూడా ఎక్కువ రోజులు ఉండొచ్చని తెలిపారు. ప్రధానంగా ఉత్తర తెలంగాణ, ఈశాన్య తెలంగాణలో ఈ పరిస్థితి ఉంటుందని 'నమస్తే తెలంగాణ'తో పేర్కొన్నారు. ప్రస్తుతం కొన్నిచోట్ల ఉదయం వేళ ఇప్పటికీ చలిగాలుల ప్రభావం ఉన్నా.. పగటి పూట ఎండలు మండుతున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా మార్చి నుంచి మే వరకు ఎండల తీవ్రతను భారత వాతావరణ విభా గం అంచనావేసింది. దీనిప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్య మహారాష్ట్రలు హీట్ వేవ్ జోన్ (హెచ్‌డబ్ల్యూ జోన్) పరిధిలో ఉన్నాయని, ఇక్కడ



మిగతా 4వ పేజీలో

## తక్కువ అంచనాలు.. ఎక్కువ ఫలితాలు

- పక్కా లెక్కలతో పకడ్బందీ బడ్జెట్
- ఆర్థికమాంద్యం, కేంద్ర విధానాలతో అంచనాల్లో సవరణ

2

## గిరిజనుల ఆత్మగౌరవానికి సంక్షేమ భవన్లు

- రూ.66.40 కోట్లతో నిర్మాణం
- తుదిదశలో బంజారా, కుమ్రంభీం భవన్లు

3

## ఎలక్ట్రానిక్ లావాదేవీల్లో మనమే నం.1

**'ఈ-గవర్నెన్స్'తో సేవల్లో పారదర్శకత**

- డిజిటల్ తెలంగాణ సాకారం కోసం ఐటీశాఖ కృషి
- ఈసేవ ద్వారా 50 శాఖల్లో 500కుపైగా సేవలు
- ఐదేండ్లలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు

8



**తాటి చెట్టూ చిన్నబోయే..**

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలో నిర్మించిన కొండపోచమ్మ సాగర్ కట్ట తాటిని తలదన్నుతున్నది. 15 టీఎంసీల సామర్థ్యంతో, 15.8 కిలోమీటర్ల వలయాకారంలో నిర్మించిన ఈ రిజర్వాయర్ కట్ట అటుగా వెళ్లేవారిని అమితంగా ఆకర్షిస్తున్నది. ఈ ఎత్తయిన కట్ట పక్కనే ఉన్న తాటి చెట్లు సైతం దాని ముందు చిన్నబోతున్నాయి.

## ప్రభుత్వ భూములూ దురాక్రమణ

**ఎంపీ రేవంత్‌రెడ్డి అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి**

- సర్వే నం.34లోని 1.11 ఎకరాల ఆక్రమణ
- వాల్టాచట్టం ఉల్లంఘన, బండ్లబాట కబ్జా
- అక్రమ నిర్మాణాల కూల్చివేతకు రంగంసిద్ధం!

**హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి, అతని అనుచరగణం చేసిన భూ దందాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రూ.కోట్ల విలువైన భూములను హస్తగతం చేసుకొనేందుకు చేసిన మరిన్ని కుట్రలు అధికారుల దర్యాప్తులో బయటపడుతున్నాయి. రాజకీయ అండదండలతో ప్రభుత్వ భూములనూ ఆక్రమించుకున్న రేవంతుడు.. చెరువులు, కుంటలనూ వదల్లేదు. బండ్ల బాటలనూ కబ్జాచేసినట్టు తెలుస్తున్నది. ఇటీవల రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 127లో 10.21 ఎకరాలు రేవంత్‌రెడ్డి, టీం కొనుగోలు చేసింది. అదంతా వివాదాల్లోనే ఉండటం విశేషం. పట్టాదారులెవరో తెలియదు. హక్కుదారుల లెక్క తేలలేదు. రెవెన్యూ పరిభాషలో 'టైటిల్' లేనే లేదు. అయినా పలుకుబడే పెట్టుబడిగా అత్యంత ఖరీదైన భూమిని చెరబట్టారు. రెండువర్గాల మధ్య టైటిల్ వివాదం నడుస్తూనే ఉన్నా.. ఓ వర్గంనుంచి కొనుగోలు చేశామంటూ కొందరు అధికారుల సహకారంతో అక్రమంగా మ్యుటేషన్ చేయించుకున్నారు. తామెవరికీ విక్రయించలేదని పట్టాదారులుగా, హక్కుదారులుగా చెప్తున్న రెండువర్గాలూ వాదిస్తున్నాయి. బెదిరించి ఆక్రమించుకున్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్ హరీశ్, రాజేంద్రనగర్ ఆర్డీవో కే చంద్రకళతో మొరపెట్టుకున్నారు. నాలుగురోజులుగా రెవెన్యూ అధికారుల దర్యాప్తులో



గోపన్‌పల్లి ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రహరీపై ఎంపీ రేవంత్, ఆయన సోదరుల పేర్లు

మిగతా 4వ పేజీలో

## మెరిసిన మహేశ్వరి

**ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో రజతం కైవసం**

వరుస విజయాలతో దూసుకెళ్తున్న పాలమూరు ముద్దుబిడ్డ మహేశ్వరి.. ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో రజత పతకం సొంతం చేసుకున్నది. మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో 10 నిమిషాల 40.30 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచింది.

వివరాలు ఆటలో



## ఈ శాంతి మాకొద్దు!

- తాలిబన్లు అధికారంలోకి వస్తే మా హక్కులు హరిస్తారు
- చదువుకు తావుండదు.. పనికి వీలుండదు
- శాంతి కోసం భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది
- ఆఫ్ఘనిస్థాన్ మహిళల భయాందోళన

**శాంతిపై** ఆశ, తాలిబన్ల మీద భయం నడుమ ఆఫ్ఘనిస్థాన్ ప్రజలు నలిగిపోతున్నారు. అమెరికా-తాలిబన్ శాంతి ఒప్పందం ఆ దేశంలో శాంతి వీచికలపై కొత్త ఆశలు చిగురింపజేయగా, అక్కడి మహిళల్లో మాత్రం భయాందోళనలను రేకెత్తిస్తున్నది. అమెరికా సేనలు దేశాన్ని వీడనున్న నేపథ్యంలో ఆఫ్ఘన్‌లో తిరిగి తాలిబన్లు రాజ్యమేలుతారని, తాము పోరాడి సాధించుకున్న హక్కులను కోల్పోవాల్సి వస్తుందని వారు భయపడుతున్నారు. ప్రతి ఒక్కరూ శాంతిని కోరుకుంటారని, అయితే స్వేచ్ఛను హరించే శాంతి తమకు అవసరం లేదని వారు చెప్తున్నారు. మరోవైపు శాంతి ఒప్పందానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. తాలిబన్ ఖైదీలను విడుదల చేయబోమని ఆఫ్ఘన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ ఆదివారం ప్రకటించారు.

వివరాలు 5వ పేజీలో

**చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 57.00 | రిటైల్ లైవ్ | 79.00 |
| డ్రెస్డ్ | 115.00 | స్కిన్‌లెస్ | 130.00 |

**గుడ్ల ధరలు** (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 316.00 | రంగారెడ్డి | 316.00 |
| మెదక్ | 316.00 | కరీంనగర్ | 319.00 |
| వరంగల్ | 319.00 | డజన్ ధర | 60.00 |





• సాగర సోయగం

ఈ ఏడాది సమృద్ధి వర్షాలతో కృష్ణాబేసిన్ పచ్చనిపొలాలతో కళకళలాడుతున్నది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పుష్కలంగా యాసంగి పంటలు సాగు చేశారు. అధికారులు వరుస తడులుగా పంటలకు నీరందిస్తున్నారు. ఈ నేపథ్యంలో జోన్-1లోని తూములను బంద్‌చేసి వారంరోజులుగా ఖమ్మం జిల్లాకు నీటిని తరలిస్తుండటంతో జోన్-2 పరిధిలో కాల్వ నిండుకుండను తలపిస్తున్నది. ఆదివారం ఖమ్మం పర్యటనకు వెళ్లిన మంత్రి కేటీఆర్ హెలికాప్టర్ నుంచి నిండుగా పారుతున్న ఎడమకాల్వను, ఇరువైపులా ఉన్న పచ్చనిపొలాలను చూసి ముగ్ధులయ్యారు.

ఫొటో: తిరుపతి బండారి

# వచ్చే ఏడాదికి చంద్రయాన్-3 రెడీ

- గగన్‌యాన్‌తో అంతరిక్షంలోకి వ్యోమగాములు
- ఇస్రో విశ్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ కమలాకర్

**ఖైరతాబాద్:** చంద్రుడిపై కాలుమోపడంతోపాటు అక్కడి నీటి, ఖనిజ నిక్షేపాలను గుర్తించడానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రయాన్-3 ప్రయోగానికి రంగం సిద్ధం చేస్తుందని ఆ సంస్థ విశ్రాంత డైరెక్టర్, సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ బెంగళూరు ప్రొఫెసర్ జేఏ కమలాకర్ తెలిపారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో 'స్పేస్ అండ్ పానిటరీ ఎక్స్‌ప్లోరేషన్ బై ఇస్రో అండ్ బియాండ్' అనే అంశంపై డాక్టర్ జే పురుషోత్తం 15వ స్మారక ఉపన్యాసమిస్తూ తొలిసారి భారత్ నిర్మించిన వ్యోమనౌక ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే ప్రయత్నం జరుగుతున్నదన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపుతున్నామన్నారు. చంద్రయాన్-3కి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. వచ్చే ఏడాది రోవర్‌ను చంద్రుడిపై దించుతామని వెల్లడించారు. సూర్యుడిపై



అధ్యయనానికి త్వరలోనే ఆదిత్య-1 ఉపగ్రహాన్ని పంపుతున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో భూగోళంపై ఖనిజాలు అంతరించిపోతే ఇతర గ్రహాల నుంచి తీసుకురావడానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఐఈఐ తెలంగాణ చైర్మన్ రామేశ్వర్‌రావు, కార్యదర్శి అంజయ్య, సహాయ కార్యదర్శులు జీ రాధాకృష్ణ, ప్రొఫెసర్ రమణా నాయక్, పీఎల్ పాండా తదితరులు పాల్గొన్నారు.



# టీఎస్‌బీపాస్ ముహూర్తం ఖరారు
# ఏప్రిల్ 2

మొదటిపేజీ తరువాయి...

కార్పొరేటర్ పదవి ఊడిపోతుందని హెచ్చరించారు. ఇది తమాషాకోసం తాను చెప్పడం లేదని వందకు వందశాతం అమలుచేసి తీరుతామని అన్నారు. ఆదివారం ఖమ్మం, ఇల్లెందు పట్టణప్రగతి కార్యక్రమాల్లో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ.. పట్టణాలు సర్వాంగసుందరంగా, పరిశుభ్రంగా తయారు కావాలంటే ఒక్కో కార్పొరేటర్ ఒక్కో కేసీఆర్ కావాలని అన్నారు. పట్టణప్రగతిలో పారిశుద్ధ్యంతోపాటు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలో మొత్తం గృహాల సంఖ్య, వాటిల్లో పెరుగుతున్న మొక్కలను లెక్కించి అందుకనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. ఇకనుంచి అధికారులు, కార్పొరేటర్లు కలిసి మొక్కల పెంపకంపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే ఎవరుచెప్పినా వినబోనని.. సీఎం వద్దకు వెళ్లినా.. కోర్టు మెట్లెక్కినా పదవిని కాపాడుకోలేరని హెచ్చరించారు. మన పట్టణాన్ని మనమే బాగుచేసుకోవాలనే సామాజిక స్పృహ ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు. ఆదర్శ పట్టణమంటే నాలుగు లైట్లు, రెండు పుట్‌పాత్‌లు, లకారం ట్యాంక్ కాదన్న మంత్రి పారిశుధ్య సమస్య లేకుండా ప్రజలకు అన్నిరకాల వసతులు కల్పించినప్పుడే నాగరిక నగరంగా ఆవిర్భవిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ బృహత్తరమైన ఆలోచన మేరకే పట్టణప్రగతి, పల్లెప్రగతి చేపట్టి, ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నామని తెలిపారు. పారదర్శకమైన పాలన, పౌరసేవలు, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి, హరితహారం కార్యక్రమం వందశాతం అమలుపర్చడమే ప్రధాన ధ్యేయంగా పట్టణప్రగతి కొనసాగుతున్నదన్నారు. విదేశాలలో పచ్చదనం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తారని, అతిక్రమిస్తే జరిమానాలు తీవ్రస్థాయిలో ఉంటాయని చెప్పారు. మనం నాగరిక సమాజంలో బతుకుతున్నామని, అటువంటి సమాజంలో ప్రతి పౌరుడు బాధ్యతగా ఉండి తమ పట్టణాన్ని ఆదర్శపట్టణంగా తీర్చిదిద్దుకోవాలని హితవుపలికారు.

### మనం మారుదాం..

పట్టణప్రగతి ప్రణాళికలో భాగంగా తొలుత ప్రజాప్రతినిధులం, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మారుదామని, తర్వాత ప్రజల్లో మార్పును ఆశిద్దామని మంత్రి కేటీఆర్ అన్నారు. మన ఇల్లు బాగుంటే సరిపోదు ఆవాసం ఉంటున్న కాలనీ అంతా ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు. అన్ని డివిజన్లలో ఉన్నవారంతా ఈ విధంగా ప్రయత్నిస్తే పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చటం గొప్ప విషయమే కాదన్నారు. పొరుగునే ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో వెతికినా చెత్తా, చెదారం, ప్లాస్టిక్ కంటికి కనిపించదన్నారు. అక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ప్రమాణం చేసుకుని ముందుకు సాగుతున్నారని, అదేతరహాలో మనం కూడా మారాలని ఆకాంక్షించారు. ఎక్కడ ఖాళీ స్థలం కనబడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపాలిటీ వారు ఇచ్చిన తడిపొడి చెత్తను ప్రత్యేక డబ్బాల్లో వేసి సిబ్బంది వచ్చినప్పుడు వారికి ఇవ్వాలని అన్నారు. చెత్తను అనేక ప్రాంతాలలో కాల్చివేస్తున్నారని, దీనివల్ల అనేక విషవాయువులు గాలిలో కలిసి క్యాన్సర్ కారకాలుగా మారుతాయని తెలిపారు.

### తప్పుడు సమాచారమిస్తే కూల్చివేతే..

కొత్త మున్సిపల్‌చట్టాన్ని సీఎం కేసీఆర్ పౌరులు కేంద్రంగానే రూపొందించారని మంత్రి కేటీఆర్ తెలిపారు. కొత్తచట్టం ప్రకారం ఉదయం 5 గంటలకే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది డివిజన్లలో ఉండాలని.. ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తామంటే కుదరదని స్పష్టంచేశారు. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం భవననిర్మాణానికి నయాపైసా లంచం ఇవ్వకుండా 600 చదరపు గజాలలోపువారు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 75 గజాలలోపు స్థలం ఉన్నవారు ఎలాంటి అనుమతి లేకుండానే ఇల్లు నిర్మించుకోవచ్చని అన్నారు. భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో అనుమతి ఇవ్వాలని, గడువు దాటితే కమిషనర్ లేదా టౌన్‌ప్లానింగ్ అధికారి సంతకం పెట్టి పత్రాన్ని బట్వాడా చేస్తారని వెల్లడించారు. ఎవ్వరైనా అధికారి లేదా ఉద్యోగి లంచం అడిగితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తప్పుడు సమాచారం ఇచ్చి భవన నిర్మాణాలు చేపడితే కొత్తచట్టం ప్రకారం ముందుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయనున్నట్టు తెలిపారు. ఇంటి పన్నుల చెల్లింపు విషయంలో కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఎక్కువ స్థలాన్ని తక్కువగా చూపించి ఇంటినిర్మాణం జరిపితే ఆకస్మిక తనిఖీలు జరిపి 25రెట్లు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. లంచాలు లేని పురపాలక పాలనను అందించేందుకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని అన్నారు. ప్రతినెలా నగరపాలక కౌన్సిల్ సమావేశాలు జరుగాలన్నారు. రెణ్నెళ్లకోసారి డివిజన్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి కార్యాచరణ రూపొందించుకోవాలని చట్టం చెప్తున్నదన్నారు. కొత్త మున్సిపల్ చట్టంలోని అంశాలను కరపత్రాలుగా ముద్రించి ఇంటింటికీ విధిగా అందించి అవగాహన కల్పించాలని సూచించారు. నిధులకు ఢోకాలేదని.. విధుల్లో ఉద్యోగులు అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

### ప్లాస్టిక్ నిషేధంపై ప్రధాన దృష్టి

పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించాలని మంత్రి కేటీఆర్ సూచించారు. ఇంటింటికీ జూట్ బ్యాగులు అందించాలని చెప్పారు. వరంగల్ నగరంలో ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలవుతున్నదని పేర్కొన్నారు. ఇంటింటికీ సురక్షితమైన మంచినీరు అందించాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టారని తెలిపారు. డివిజన్ల పరిధిలో సంబంధిత కార్పొరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ ఒక్కరూపాయికే నల్లాను ఏర్పాటుచేసి నీటిసరఫరా సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### గర్భిణిగా ఉన్న నాటినుంచి..

గతంలో ఎన్నికల సమయంలోనే రాజకీయ నాయకులు కనిపించేవారని, నేడు సీఎం కేసీఆర్ పాలనలో అటువంటి పరిస్థితి లేదన్నారు. ఇదే సీఎం కేసీఆర్ దార్శనికతకు నిదర్శనమన్నారు. కులం, మతం తేడా లేకుండా తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరికీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేదింటి ఆడపడుచు పెండ్లికి రూ.లక్ష నూటాపదహారు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. మహిళ గర్భిణిగా ఉన్న నాటినుంచి ప్రసూతి వరకు ప్రభుత్వమే సంరక్షణ బాధ్యతలు తీసుకుంటున్నదని, ప్రసవం తర్వాత రూ.13 వేలతోపాటు కేసీఆర్ కిట్‌ను కూడా అందిస్తున్నామని అన్నారు. బాలింతకు, పుట్టిన శిశువుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్లు, పాలు బాలామృతం సరఫరాచేస్తున్నట్టు తెలిపారు. పుట్టిన బిడ్డ పెరిగి పాఠశాలకు వెళ్లాక.. సీఎం మనమడు, మనుమరాలు తినే సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటురంగంలో యువతకు ఉపాధి కల్పించేందుకు టీఎస్‌ఐపాస్ ద్వారా అనేక పరిశ్రమలను నెలకొల్పామని అన్నారు. రైతుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకుసాగుతూ వారికి సాగునీరు అందిస్తూ, రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రవేశపెట్టామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జెడ్పీ చైర్మన్లు కోరం కనకయ్య, ఆంగోత్ బిందు, లింగాల కమల్‌రాజ్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, రాములునాయక్, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియానాయక్, డీఎస్ రెడ్యానాయక్, శంకర్‌నాయక్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, టీఆర్‌ఎస్ రాష్ట్రకార్యదర్శి తాతా మధు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం నగరంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, రైతు సమన్వయసమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

### ఫ్లెక్సీలు కట్టినందుకు రూ.లక్ష జరిమానా

తన పర్యటన సందర్భంగా పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేసినవారిపై మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకవైపు ప్లాస్టిక్ నిషేధానికి కృషిచేస్తుంటే ఫ్లెక్సీలు కట్టడమేమిటని ప్రశ్నించారు. ఖమ్మంలో శాంతినగర్ జూనియర్ కళాశాల భవన ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతూ టీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు, 16వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి ఫ్లెక్సీలు కట్టారు. ఇల్లెందులో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కూడా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. వారిద్దరిపై అసహనం వ్యక్తంచేసిన కేటీఆర్.. రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తున్నట్టు తెలిపారు. వారినుంచి జరిమానా వసూలు చేయాలని అధికారులకు సూచించారు. ఖమ్మంలో కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా కార్పొరేటర్ మురళి బొకే ఇవ్వబోగా మంత్రి కేటీఆర్ నిరాకరించారు. ఫ్లెక్సీలు వద్దని చెప్పినా ఏర్పాటు చేసినందుకు మీరు అందజేసే గిఫ్ట్‌ను నిరాకరిస్తున్నట్టు వేదికపైనే ప్రకటించారు.



ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో నిర్మించిన ఇండోర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ ఆడుతున్న మంత్రి కేటీఆర్



ఆదివారం రఘునాథపాలెం మండలంలోని వైఎస్‌ఎస్ నగర్‌లో డబుల్ బెడ్‌రూంలను ప్రారంభించి లబ్ధిదారులతో కరచాలనం చేస్తున్న మంత్రి కేటీఆర్

### బస్సుదిగి.. బాధలు విని

- చిన్నారి గొంతు చికిత్సకు కేటీఆర్ హామీ

**మయూరిసెంటర్:** ఖమ్మంలో బాస్కెట్‌బాల్ ఇండోర్‌స్టేడియం ప్రారంభోత్సవం అనంతరం ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బస్సుఎక్కిన మంత్రి కేటీఆర్.. జనం మధ్యలో ఓ చిన్నారిని ఎత్తుకున్న తండ్రిని చూసి కిందకు దిగారు. ఆయనను దగ్గరకు పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన కూతురు ప్రీతి (7) గొంతు సమస్యతో బాధపడుతున్నదని.. డబ్బులు లేక అపరేషన్ చేయించలేకోతున్నామని ముదిగొండ మండలం మాధాపురంకు చెందిన మల్లెల ఉపేందర్ దంపతులు మంత్రికి వివరించారు. దీంతో చలించిన కేటీఆర్.. తక్షణ వైద్యసేవల కింద రూ.10వేలు అందించారు. మెరుగైన వైద్యసేవలు, సీఎం రిలీఫ్‌ఫండ్ కింద శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. చిన్నారికి వైద్యసేవల అంశాన్ని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌కు అప్పగించారు. దీంతో చిన్నారి, తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఎంపీ నామా నాగేశ్వర్‌రావు చిన్నారి తండ్రికి ఫోన్‌చేసి తన కార్యాలయానికి రావాల్సిందిగా సూచించారు.

# సామాజిక న్యాయానికి కేసీఆర్ పెద్దపీట

- ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రిజర్వేషన్లు లేకున్నా అన్ని సామాజికవర్గాలకు న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్దేశమని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి కే తారకరామారావు అన్నారు. ఈ క్రమంలోనే డీసీసీబీ, డీసీఎంఎస్ పదవుల్లో దాదాపు 50శాతం బడుగు, బలహీనవర్గాలకు అవకాశం కల్పించామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే పనిచేయడంతోపాటు సమాజంలోని అన్నివర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం దక్కేలా చేయాలనేది తమ పార్టీ లక్ష్యమని వివరించారు. ఇప్పటికే తాము మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లోనూ రిజర్వేషన్ల కన్నా ఎక్కువగా పదవుల్లో అవకాశం ఇచ్చామని చెప్పారు. పాలనలో, పదవుల్లో బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట వేస్తున్న పార్టీగా టీఆర్‌ఎస్ నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికలోనూ టీఆర్‌ఎస్‌ను ఆశీర్వదిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



# సహకారంలో బీసీలకు ప్రాధాన్యం

- రిజర్వేషన్లు లేకున్నా చైర్మన్, వైస్‌చైర్మన్ పదవుల్లో 50శాతం
- సామాజిక న్యాయంపై సకలజనుల హర్షం
- సీఎం కేసీఆర్‌కు పలువురు ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

టీఆర్‌ఎస్ మరోసారి పదవుల పంపకాల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది. ఇప్పటికే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీవర్గాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నది. దీంతోపాటు టీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఆయా వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యంలోనూ ప్రాధాన్యం కల్పించేలా పార్టీ నిర్ణయాలు తీసుకొంటున్నది. తాజాగా జరిగిన డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవుల ఎంపికలోనూ సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చారు. చట్టం ప్రకారం ఎలాంటి రిజర్వేషన్లు లేకపోవడంతో ఇన్నాళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కచ్చితంగా ఎన్ని పదవులు దక్కుతాయన్న స్పష్టతలేదు. రిజర్వేషన్లు లేని సహకార బ్యాంకుల పదవుల్లోనూ సామాజిక న్యాయం పాటించి బడుగు, బలహీనవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించి సీఎం కేసీఆర్ ఆయా వర్గాల పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకొన్నారు. స్వరాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన ఆయా వర్గాల సంక్షేమంతోపాటు రాజ్యసభ, శాసనమండలి, మున్సిపల్ వంటి ప్రతిష్ఠాత్మక స్థానాల్లోనూ సామాజిక సమతూకాన్ని పాటించింది. శనివారం జరిగిన డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ మొత్తం 36 పదవుల్లో 17 (దాదాపు 50 శాతం) బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీవర్గాలకు కేటాయించారు. దీంతో రాష్ట్రంలోని సకలజనులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

### బీసీలకు సముచిత స్థానం: మంత్రి తలసాని



డీసీసీబీల చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీవర్గాలకు టీఆర్‌ఎస్ సముచితస్థానం కల్పించిందని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. సామాజిక న్యాయం పాటించిన ఘనత టీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లకు అభినందనలు తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నమ్మకంతోనే ప్రజలు పార్టీకి బ్రహ్మరథం పట్టారని అన్నారు.

### సామాజిక సమతూకం: విప్ బాల్క సుమన్



డీసీసీబీ, డీసీఎంఎస్ అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ సామాజిక సమతూకాన్ని పాటించిందని బాల్క సుమన్ చెప్పారు. అన్ని సామాజిక వర్గాలకు అవకాశాలు వచ్చేలా సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారన్నారు. సామాజిక సమతూకం విషయంలో ఇతర రాష్ట్రాలకు, రాజకీయ పార్టీలకు టీఆర్‌ఎస్ ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, పెరిక, మున్నూరుకాపు, యాదవ, లింగాయత్‌లకు పదవులు దక్కాయని తెలిపారు.

### ఇది కొత్త చరిత్ర: మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సహకార పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం పెంచి ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త చరిత్ర లిఖించారని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు నిర్విరామంగా కృషిచేస్తున్న సీఎం కేసీఆర్.. అన్ని కులాలు, వర్గాలవారికి న్యాయంచేస్తూ సామాజిక తెలంగాణను సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీల జీవితాల్లో మహాత్ముడు జ్యోతిబా పూలే ఎలా వెలుగులు నింపారో.. ఇప్పుడు కేసీఆర్ కూడా పూలే ఆదర్శాలను కొనసాగిస్తూ వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. అందుకే తెలంగాణ జ్యోతిబా పూలేగా కేసీఆర్ నిలిచిపోతారన్నారు.

### బీసీ సంఘాల జేఏసీ హర్షం

సహకార ఎన్నికల్లో వెనుకబడినవర్గాలకు పెద్దపీట వేయడం పట్ల తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ హర్షం వ్యక్తంచేసింది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల జితేందర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు యాద శంకర్, యూత్ అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన నాటినుంచి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ బీసీలకు పెద్దపీట వేస్తున్నదని వారు కొనియాడారు.

### లోకం పోకడ




### ముహూర్తం



సూర్యోదయం: 6.33 గంటలకు

సూర్యాస్తమయం: 6.17 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం సప్తమి మధ్యాహ్నం 12.53 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: కృత్తిక ఉదయం 8.56 వరకు, తదుపరి రోహిణి, అమృతఘడియలు: ఉదయ 6.19 నుంచి 8.03 వరకు, తిరిగి రాత్రి 7.36 నుంచి 9.18 వరకు, రాహు కాలం: ఉదయం 8.01 నుంచి 9.29 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.02 నుంచి 12.49 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.09 నుంచి 3. 56 వరకు, వర్జ్యం: అర్ధ రాత్రి 2.00 నుంచి తె. ఝూ 3.43 వరకు.

# తక్కువ అంచనాలు.. ఎక్కువ ఫలితాలు

- పక్కా లెక్కలతో పకడ్బందీ బడ్జెట్
- ఆర్థికమాంద్యం, కేంద్ర విధానాలతో అంచనాల్లో సవరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పైసా పైసాను లెక్కించి.. ఆదాయ, వ్యయాలను కచ్చితంగా అంచనావేసి ప్రభుత్వం పూర్తి వాస్తవిక దృక్పథంతో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నది. 2020-21వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షికబడ్జెట్‌కు తుదిమెరుగులు దిద్దే ప్రక్రియను పూర్తిచేసింది. ఎక్కడా భారీ అంచనాలకు వెళ్లకుండామార్కెట్‌లో ఒడిదుడుకులను, ఆర్థికమాంద్యాన్ని పరిగణనలోకి తీసుకుని పకడ్బందీగా బడ్జెట్‌ను రూపొందించినట్టు తెలుస్తున్నది. 'తక్కువ అంచనాలు.. ఎక్కువ ఫలితాలు' అన్నసూత్రంతో సీఎం కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో బడ్జెట్‌కు పూర్తి రూపమిచ్చారు. ఈసారి కూడా సంక్షేమరంగానికి, నీటి పారుదల, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు సమాచారం. గత సెప్టెంబర్‌లో ఆరునెలల కాలానికి ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ తరహాలోనే ఈసారికూడా వాస్తవ లెక్కలకు అద్దం పడుతుందని అభిప్రాయపడుతున్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.1,46,492.30 కోట్లుగా ప్రతిపాదించారు. ప్రగతి పద్దు రూ. 75,283.24కోట్లు కాగా.. నిర్వహణ పద్దు రూ.71,229.06 కోట్లుగా ఉన్నది. ఈసారి కూడా కొంత అటుఇటుగా బడ్జెట్ ఉంటుందని అంటున్నారు. ఆర్థికమాంద్యంతోపాటు కేంద్రంలో చోటుచేసుకున్న ఆర్థికపరిణామాలు రాష్ట్ర బడ్జెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. కేంద్రం ఈసారి రాష్ట్రాల పన్నుల వాటాను 41 శాతానికి తగ్గించింది. ఇప్పటివరకు కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి 2.48 శాతం నిధులు వస్తున్నాయి. తాజా నిర్ణయం వల్ల రాష్ట్రానికి వచ్చే పన్నుల వాటా 2.13కు తగ్గింది. పన్నులవాటాలో తేడాతోపాటు ఈసారి పన్నుల రాబడి బాగా తగ్గుతున్నందున కేంద్రం నుంచి రావాల్సిన మొత్తంలో గండిపడుతున్నది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా రూ. 20వేల కోట్లు వస్తాయని అంచనా వేయగా.. కేంద్రప్రభుత్వ వైఖరితో రూ. 16 వేల కోట్లకే పరిమితమవుతున్నది. గతేడాది రూ.18,500 కోట్ల వరకు పన్నుల వాటా రాగా.. ఈసారి అంచనా కంటే దాదాపు రూ. 4వేల కోట్లు గండిపడటం వల్ల బడ్జెట్ అంచనాలను కుదించుకోవాల్సి వచ్చింది. కేంద్రప్రభుత్వ వైఖరి వల్ల దాదాపు 18 శాతం నిధులకు కోత పడింది.

### ప్రతికూల పరిస్థితులను ముందే పసిగట్టి..

ఇక సొంత రాబడులు స్థిరంగా ఉన్నా అంచనాలకు అనుగుణంగా వృద్ధిరేటు నమోదు కాలేదు. ప్రతీ ఏడాది కనీసం 15 నుంచి 17 శాతంగా ఉన్న వృద్ధిరేటు ఈసారి మొత్తంగా 5 నుంచి 6 శాతం లోపుగానే ఉన్నది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆర్థికమాంద్యాన్ని, మార్కెట్ ప్రతికూల పరిస్థితులను తట్టుకుని గట్టిగా నిలబడిన రాష్ట్రంగా తెలంగాణ ముందువరుసలో ఉన్నది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయాలు దేశవ్యాప్తంగా శాఖలవారీగా నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించినట్టు తెలుస్తున్నది. ఆర్థికమాంద్యం, జాతీయ స్థాయిలో ప్రతికూల పరిణామాలను ముందే పసిగట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ఉన్నతాధికారులను నాలుగు నెలల కిందటే అప్రమత్తం చేశారు. అన్నిరంగాల్లో ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థికపరిస్థితిని మెరుగుపరిచి.. సంక్షేమం, అభివృద్ధిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్దిష్టంగా ఆదేశాలు జారీచేశారు. ఇందుకు అనుగుణంగానేబడ్జెట్ రూపకల్పన జరిగింది.



ఖమ్మం నగరంలోని ఎస్సార్ గార్డెన్‌లో జరిగిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమారుడి వివాహవిందుకు హాజరై వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మంత్రులు పువ్వాడ అజయ్, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మేయర్ పాపాలాల్ కూడా ఉన్నారు.

# సంక్షేమభవన్లు.. ఆత్మగౌరవ ప్రతీకలు

**రూ.66.40 కోట్లతో గిరిజనభవన్ల నిర్మాణం**

**తుదిదశలో బంజారా, కుమ్రంభీం భవన్లు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గిరిజన తెగల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. బంజారాలు, ఆదివాసీల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా గిరిజనభవన్లను నిర్మిస్తున్నది. ఇందుకు రూ.66.40 కోట్ల నిధులను ప్రత్యేకంగా మంజూరుచేసింది. గిరిజనుల సంస్కృతిని కాపాడి భవిష్యత్ తరాలకు చాటిచెప్పే విధంగా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో చేపట్టిన బంజారాభవన్, కుమ్రంభీంభవన్ నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. త్వరలోనే ఈ భవనాలను అందుబాటులోకి తెచ్చేందుకు గిరిజన సంక్షేమశాఖ చర్యలు చేపట్టింది. ఒక్కో భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 కోట్ల చొప్పున మంజూరుచేసింది.

## జిల్లాల పరిధిలో 24 భవనాలు

గిరిజనులు అధికసంఖ్యలో నివాసం ఉండే ప్రాంతాల ఆధారంగా ఆయా జిల్లాల్లోని ముఖ్యమైన ప్రాంతాల్లో 24 గిరిజనభవన్లను నిర్మిస్తున్నారు. మరికొన్నింటిని నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే అనుమతించినవాటిలో ఒక్కో గిరిజనభవన్ నిర్మాణానికి రూ.1.10 కోట్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా నిర్మించతలపెట్టిన 24 గిరిజనభవన్ల కోసం ప్రభుత్వం రూ.26.40 కోట్లు మంజూరుచేసింది. ఖమ్మం, భద్రాచలం, పినపాక, ఇల్లందు, వైరా, అశ్వారావుపేట, వరంగల్, ఏటూరునాగారం, డోర్నకల్, మహబూబాబాద్, ములుగు, ఆదిలాబాద్, ఉట్నూరు, ఆసిఫాబాద్, ఖానాపూర్, బోథ్, మహబూబ్‌నగర్, మన్ననూరు, రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, దేవరకొండ, నిజామాబాద్, కరీంనగర్‌లో మొదలైన గిరిజనభవన్ల నిర్మాణపనులు తుదిదశకు చేరాయి.



రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌ఇండియా చాలెంజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ జోరుగా కొనసాగుతున్నది. ఆదివారం తన జన్మదినం సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ మూడు మొక్కలునాటి మరో ముగ్గురిని నామినేట్ చేశారు. - నమస్తే తెలంగాణ, హైదరాబాద్


"జిల్లా జిల్లాలో సెంట్రల్ జిఎస్‌టీ మీ వద్దకు'
NATION TAX MARKET
పన్ను చెల్లింపుదారులు మరియు జిఎస్‌టీ వృత్తి నిపుణులకు
సెంట్రల్ జిఎస్‌టీ, హైదరాబాద్ జోన్ వారి ఆహ్వానము
శ్రీమతి మల్లికా ఆర్య గారు, చీఫ్ కమీషనర్, హైదరాబాద్ జోన్
మరియు అధికారుల బృందం జిఎస్‌టి చట్టంపై స్పష్టత, అవగాహన పెంపొందించుటకు మీ జిల్లాకు విచ్చేయుచున్నారు. కావున పన్ను చెల్లింపుదారులు మరియు జిఎస్‌టీ వృత్తి నిపుణులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకొని సమావేశాన్ని జయప్రదం చేయవలసినదిగా కోరుచున్నాము.
తేదీ మరియు సమయం : ది. 02-03-2020
సోమవారం, మ. 3 గం. నుండి సా. 6 గంటల వరకు
వేదిక : హోటల్ శ్వేత బంక్వెట్ హాల్, RTC బస్‌స్టాండ్ ప్రక్కన, కరీంనగర్.
సంప్రదించవలసిన అధికారులు :
P.V. రామారావు, సూపరింటెండెంట్ (జిఎస్‌టి)
మొబైల్ నెం. : 98487 52139
T.A. నరసింహం, సూపరింటెండెంట్ (జిఎస్‌టి)
మొబైల్ నెం. : 9290432115
ఆర్థిక మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వము
జారీచేయువారు : మేడ్చల్ జిఎస్‌టి కమీషనరేట్, హైదరాబాద్




# కొండపోచమ్మ మట్టిపనిలో రికార్డు

- ఏడు నెలల్లో 3.88 కోట్ల క్యూబిక్ మీటర్ల పని పూర్తి
- తక్కువ వ్యవధిలోనే 12.17 కోట్ల క్యూ.మీ. రివిట్‌మెంట్ పనులు
- ఏడాదిలో అందుబాటులోకి వచ్చిన రెండు పంపుహౌజ్‌లు
- కాళేశ్వరం నాలుగో లింకులోనూ రికార్డుల మోత



**రూ.1695.33 కోట్ల అంచనాతో చేపట్టిన కొండపోచమ్మ నిర్మాణ పనుల తీరిది**

| పని రకం | కొలత ప్రమాణం | చేయాల్సిన పని | చేసిన పని |
|---|---|---|---|
| రిజర్వాయర్ గట్టు రీచ్-1 | లక్షల క్యూ.మీ.ల్లో | 244.50 | 244.50 |
| రిజర్వాయర్ గట్టు రీచ్-2 | లక్షల క్యూ.మీ.ల్లో | 143.735 | 143.735 |
| రివిట్‌మెంట్ | లక్షల క్యూ.మీ.ల్లో | 12.17 | 2.17 |

నిర్మాణం పనులు పూర్తిచేసుకొన్న కొండపోచమ్మ రిజర్వాయర్

**కాళేశ్వరం లింక్-4**
**(ఎస్సారార్- కొండపోచమ్మ వరకు)**

| | |
|---|---|
| ఆయకట్టు | - 5,89,280 ఎకరాలు |
| రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం | - 71.5 టీఎంసీలు అన్నపూర్ణ (3.5), రంగనాయక (3), మల్లన్న (50), కొండపోచమ్మ (15 టీఎంసీలు) |
| టన్నెల్ పొడవు | - 32.421 కిలోమీటర్లు |
| గ్రావిటీ కాల్వలు | - 76.265 కిలోమీటర్లు |
| పంప్‌హౌజ్‌లు | - ఐదు |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టు రికార్డులపై రికార్డులను నమోదుచేస్తున్నది. ఇప్పటి వరకు అందుబాటులోకి వచ్చిన ప్రాజెక్టులోని రెండు లింకులతోపాటు తాజాగా అందుబాటులోకి రానున్న శ్రీరాజరాజేశ్వర జలాశయం- కొండపోచమ్మ సాగర్ వరకు పనుల్లో కూడా మరికొన్ని రికార్డులు నమోదయ్యాయి. ఈ నెల 15 లోగా కొండపోచమ్మలోకి గోదావరి జలాలను తరలించాలనే లక్ష్యంతో పనులు చేపట్టడంతో ఏడు నెలల వ్యవధిలోనే 3.88 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి పనిని పూర్తిచేయడమనేది అరుదైన అంశం. కొండపోచమ్మ పూర్తి నిల్వసామర్థ్యం 15 టీఎంసీలు. ఈ జలాశయ నిర్మాణం ఏడు నెలల్లోనే పూర్తవడమంటే మాటలు కాదు. భూసేకరణకే దశాబ్దాల సమయం గడిపిన అనుభవాల నుంచి నెలల వ్యవధిలో ఏకంగా నీటినిల్వకు జలాశయాలు సిద్ధం కావడమనేది సీఎం కేసీఆర్ కార్యదక్షతకు నిదర్శనం.

## ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్

సాధారణంగా సాగునీటి ప్రాజెక్టుల్లో ఒకచోట విజయవంతమైన నిర్మాణాలను మరోచోట చేపట్టడం సులువు. కానీ ఆసియాలోనే తొలిసారిగా ఒక వినూత్న నిర్మాణాన్ని చేపట్టడమనే సవాళ్లను అధిగమించిన కాళేశ్వరం.. లింక్-4లోనూ మరో రికార్డును నమోదుచేసింది. ఎస్సారార్ నుంచి జలాలను అప్రోచ్ చానెల్ ఆపై 9.5 మీటర్ల వ్యాసంతో 7.651 కిలోమీటర్ల టన్నెల్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా అనంతగిరి సర్జ్‌పూల్‌కి తరలిస్తారు. ఆ తర్వాత అక్కడి 106 మెగావాట్ల నాలుగు మోటర్ల ద్వారా సుమారు 11వేల క్యూసెక్కులకు పైగా నీటిని అన్నపూర్ణ జలాశయంలో పోస్తారు. ఇందులో భాగంగా సర్జ్‌పూల్‌ను దేశంలోనే తొలిసారిగా వృత్తాకారంలో నిర్మించారు. దీని డయా 56 మీటర్లు.. లోతు ఏకంగా 92 మీటర్లు. ఇప్పటివరకు దేశంలో ఉత్తరాఖండ్ తెహ్రీ ప్రాజెక్టులో 38 మీటర్ల డయా, హిమాచల్‌ప్రదేశ్‌లోని ఓ ప్రాజెక్టులో 32 మీటర్ల డయా సర్జ్‌పూల్స్ పెద్దవి అని అధికారులు తెలిపారు.

## తక్కువ సమయంలో ఎత్తిపోతకు సిద్ధం

ఎస్సారార్ నుంచి కొండపోచమ్మకు ఒక్క టీఎంసీ జలాల తరలింపునకు ఐదుదశల్లో నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. మొదటగా అన్నపూర్ణ పంపుహౌజ్ (తిప్పాపూర్)లో 106 మెగావాట్ల నాలుగు మోటర్లను సిద్ధంచేశారు. అన్నపూర్ణ జలాశయం నుంచి రంగసాయకసాగర్‌లోకి తరలించేందుకు చంద్లాపూర్ వద్ద నిర్మించిన పంప్‌హౌజ్‌లో 134 మెగావాట్ల నాలుగు మోటర్లు, ఆ తర్వాత మల్లన్నసాగర్‌లోకి జలాలను తరలించేందుకు తుక్కాపూర్ వద్ద పంప్‌హౌజ్‌లో 43 మెగావాట్లతో ఎనిమిది మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం మల్లన్నసాగర్ పూర్తి కానందున ఫీడర్ చానెల్ ద్వారా అక్కా రం పంప్‌హౌజ్‌కు తరలిస్తారు. ఇక్కడినుంచి 27 మెగావాట్ల సామర్థ్యం గల ఆరు మోటర్ల ద్వారా మర్కూక్ పంప్‌హౌజ్‌లోకి జలాలను తరలిస్తారు. కొండపోచమ్మలోకి ఎత్తిపోసేందుకు ఇక్కడ 34 మెగావాట్ల సామర్థ్యంతో ఆరు మోటర్లను సిద్ధంచేశారు.

## ముందుచూపుతో ఫీడర్ చానెల్

ఇంతకుముందు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఏదైనా ఆలస్యమైతే ప్రాజెక్టు పని మొత్తం నత్తనడకన సాగేది. కానీ సీఎం కేసీఆర్ మాత్రం అనుక్షణం ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తుండటంతో మధ్యలో ఏదైనా నిర్మాణం ఆలస్యమైతదనుకొంటే వెంటనే ప్రత్యామ్నాయ మార్గంలో జలాలను ముందుకు తీసుకుపోయి రైతులకు ఫలాలను అందించాలనే తపన ప్రదర్శించారు. ఇందులో భాగంగా భారీస్థాయిలో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న మల్లన్నసాగర్ అందుబాటులోకి వచ్చేందుకు కొంత సమయం పడుతున్నది. అనంతరం ఉన్న కీలకమైన కొండపోచమ్మ సాగర్ నిర్మాణం పూర్తయింది. అందుకే మల్లన్నసాగర్ పూర్తయ్యే వరకు రైతులు ఎదురుచూడకుండా దానిని బైపాస్‌చేసి గోదావరి జలాలను తరలించేందుకు ముందుచూపుతో ఫీడర్ చానెల్ నిర్మాణానికి ఆదేశించారు. 18.5 కిలోమీటర్ల మేర అందుబాటులో ఉండటంతో గోదారమ్మ కొండపోచమ్మను చేరనున్నది.

### కాలంతో పరుగులు పెట్టాం

ఎస్సారార్ నుంచి కొండపోచమ్మ సాగర్‌వరకు గోదావరి జలాల తరలింపునకు చేపట్టిన పనుల పూర్తికి కాలంతో పరుగులు పెడుతున్నాం. సీఎం కేసీఆర్ ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తుండటంతో రికార్డు సమయంలో కొన్ని నిర్మాణాలను అందుబాటులోకి తేగలిగాం. ఈ నెల 15లోగా కొండపోచమ్మ సాగర్‌లోకి జలాలను తరలించాలనే లక్ష్యంతో ఉన్నాం.

**- హరిరాం, కాళేశ్వరం ఈఎన్సీ**


నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం
ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
40 Years of TRUSTED SERVICES
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం






హైదరాబాద్ - గోవా - హైదరాబాద్
విమాన ప్రయాణం
• బ్రేక్‌ఫాస్ట్ - రాత్రిభోజనం • లగ్జరీ హోటల్ - ట్విన్ షేరింగ్
• ఏయిర్‌పోర్ట్ పికప్ & డ్రాప్
గమనిక: ఆర్.వి. టూర్స్ & ట్రావెల్స్ ఆప్ డౌన్‌లోడు చేసుకొండి
రూ. 1000/- క్యాష్ బ్యాక్ పొందండి
వెబ్‌సైట్ సందర్శించండి అద్భుతమైన అతి తక్కువ దరకు దేశీయ అంతర్జాతీయ ప్యాకేజీలు పొందండి
ప్యాకేజీ పూర్తి వివరముల కొరకు క్రింది సంబర్లను సంప్రదించండి
R.V. TOURS AND TRAVELS PVT. LTD.
Hyderabad | Vijayawada | Visakhapatnam | Tirupati | Nellore | Proddatur
31-15-186/1, 2nd Floor, Opp: Hotel KEYS, Dolphin Road, Daba Gardens, Visakhapatnam - 530020.
91211 43959 : 91211 43960 : 91000 90295
పర్యాటకులకు / వినియోగదారులకు హృదయ పూర్వక స్వాగతం


# కేంద్రానికి చట్టాలంటే అగౌరవం

- డీలిమిటేషన్ విషయంలో మాటతప్పడం సరికాదు
- పట్టణ ప్రగతిపై విమర్శల్లో అర్థం లేదు
- మీడియా సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**నల్లగొండ, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో డీలిమిటేషన్‌కు సంబంధించి బీజేపీ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడటం విభజన చట్టాలను అగౌరవపర్చడమేనని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్ కేవలం జమ్ముకశ్మీర్‌కే వర్తిస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడటంలో అర్థంలేదని చెప్పారు. విభజన విషయంలో రాత్రిళ్లు ఒప్పందం చేసుకున్నారని కిషన్‌రెడ్డి అనడం విడ్డూరంగా ఉన్నదన్నారు. పునర్విభజన చట్టాన్ని గౌరవించి తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలను పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం కేంద్రంపై ఉన్నదన్నారు. అప్పట్లో లోక్‌సభ, రాజ్యసభలోనూ డీలిమిటేషన్‌పై తీర్మానం చేశారని.. ప్రస్తుతం బీజేపీ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. పల్లె-పట్టణ ప్రగతి కార్యక్రమాలు రాజకీయాలకతీతంగా జరుగుతున్నాయని, వీటిపైనా పలువురు అర్థంలేని విమర్శలు చేస్తున్నారని అన్నారు. డీసీసీబీ, డీసీఎంఎస్ ఎన్నికల్లో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులందరి సహకారంతో రాష్ట్రంలోని అన్నిప్రాంతాల్లో ఏకగ్రీవమవ్వడం మంచి పరిణామంగా అభివర్ణించారు.



# ఎస్సీఏ రీజినల్ డైరెక్టర్‌గా రామకృష్ణన్

**పటాన్‌చెరు, నమస్తే తెలంగాణ:** వరల్డ్ వెజిటేబుల్ సెంటర్ (డబ్ల్యూవీసీ).. దక్షిణ మధ్య ఆసియా (ఎస్సీఏ) ప్రాంతీయ సంచాలకుడిగా డాక్టర్ రామకృష్ణన్ ఎం నాయర్ నియమితులయ్యారు. దక్షిణ మధ్య ఆసియాలో కూరగాయల సాగు విస్తరణ, మార్కెటింగ్ దిశగా రైతులను ప్రోత్సహిస్తూ పరిశోధనలు రైతులకు అందుబాటులో ఉంచుతారు. ప్రపంచానికి ఆహార భద్రతను కల్పించేందుకు డబ్ల్యూవీసీ తీవ్రంగా కృషిచేస్తున్నది. ఎలాంటి లాభాపేక్షలేకుండా కూరగాయల సాగుపై పరిశోధనలు సాగిస్తున్నది. తైవాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థకు.. బ్యాంకాక్, థాయ్‌లాండ్, టంజానియా, మాలిలతోపాటు హైదరాబాద్‌లో ప్రాంతీయ కేంద్రాలున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ప్రాంతీయ కేంద్రంలో కూరగాయల పంటల సాగుపై, కొత్త వంగడాలపై పరిశోధనలు జరుగుతాయి. నాయర్ నియామకంతో కూరగాయల సాగుపై పరిశోధనలు మరింతగా ఊపందుకుంటాయని శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తంచేశారు.




తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్. చిత్రంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు కూడా ఉన్నారు.

# వ్యవసాయాన్ని పండుగచేశాం

- కాళేశ్వరం నీళ్లతో రైతుల కాళ్లు కడుగుతున్నం
- రైతుల పట్ల కాంగ్రెస్‌ది మొసలి కన్నీరు
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మండిపాటు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయాన్ని కాంగ్రెస్ దండుగలాగా మారిస్తే.. పండుగలాగా చేసిన ఘనచరిత్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను ఇతర ప్రభుత్వాలు ఎప్పుడూ చేయలేదని అన్నారు. తెలంగాణ రైతుల కన్నీళ్లు తుడిచి, కాళేశ్వరం నీళ్లతో వారి కాళ్లు కడుగుతున్న చరిత్ర టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని చెప్పారు. ఆదివారం తెలంగాణభవన్‌లో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావుతో కలిసి బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరిగాయని గుర్తుచేశారు. గోదావరి, కృష్ణా నదులనుంచి నీళ్లు సముద్రంలో వృథాగా కలుస్తుంటే పట్టించుకోని చరిత్ర కాంగ్రెస్ పార్టీది అయితే.. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించి గోదావరి జలాలను రైతుల పొలాలకు మళ్లించిన చరిత్ర టీఆర్‌ఎస్‌ది ప్రభుత్వానిదని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు లభించక ఇబ్బందులు పడ్డారని, ప్రభుత్వపరంగా గోదాములు కట్టివ్వకుండా కాంగ్రెస్ నాయకులు నిధులు మింగేశారని ఆరోపించారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నదని దుయ్యబట్టారు. నిజమైన రైతు నేస్తం, రైతు పక్షపాతి కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు రైతుల పట్ల రాబందుల్లా వ్యవహరిస్తే.. రైతుబంధు, రైతుబీమా పెట్టి అన్నదాతలను ఆదుకున్న చరిత్ర సీఎం కేసీఆర్‌ది అని అన్నారు. పాలమూరు, డిండి, సీతారామా ప్రాజెక్టులను చేపట్టామని వివరించారు. రైతుల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదని స్పష్టంచేశారు.

## రేవంత్‌పై కఠినచర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి వైఖరి నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్నట్టుగా ఉంటుందని బాల్క సుమన్ ఆరోపించారు. రేవంత్ భూదందాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. చేసిన తప్పునకు ఆయన క్షమాపణలు చెప్పాలని, బలవంతంగా తీసుకొన్న భూములను బాధితులకు వెనక్కి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఇందులో ఇంకా వాస్తవాలు బయటికి రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. దళితులు, పేదవారిని భయపెట్టి, బెదిరించినవారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ మాట్లాడుతూ.. అన్ని ఎన్నికల్లో ప్రజలు టీఆర్‌ఎస్ పార్టీని గెలిపించారని, తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు.

# సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలొద్దు

**అసత్య ప్రచారాలతోనే ఢిల్లీలో అల్లర్లు**

**ఐఎస్బీ కాన్‌క్లేవ్ ప్రారంభంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలే ఢిల్లీ అల్లర్లకు కారణమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఐఎస్బీలో 'ఐడియాస్ ఫర్ ఇండియా-2020' ఐఎస్బీ పాలసీ కాన్‌క్లేవ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలు తప్పుడు సమాచారానికి సాధనాలు కాకూడదని అన్నారు. పుకార్ల ప్రచారానికి సామాజిక మాధ్యమాన్ని వాడుతున్నారని, బాధ్యతాయుతంగా ఉపయోగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజలు రాజకీయాల గురించి కాకుండా ప్రాధాన్యం గల విషయాలపై చర్చించాలని తెలిపారు. దేశ భవిష్యత్తును మార్చేలా, శాంతిభద్రతలను రక్షించేలా, పేదరికాన్ని నిర్మూలించడానికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించేలా కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని యువతను కోరారు. ఐదున్నరేండ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాలపై, విధానాలపై చర్చించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కొత్త ఆలోచనలు దేశ ముఖాన్ని మార్చాయని మంత్రి తెలిపారు. సీఏఏతో ఎవరి పౌరసత్వాన్నీ హరించరని, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లో హింసకుగురైన అక్కడి మైనారిటీలకు పౌరసత్వం ఇవ్వడమే సీఏఏ లక్ష్యమని చెప్పారు.


NATION TAX MARKET
"జిల్లా జిల్లాలో సెంట్రల్ జిఎస్‌టీ మీ వద్దకు"
పన్ను చెల్లింపుదారులు మరియు జిఎస్‌టీ వృత్తి నిపుణులకు
సెంట్రల్ జిఎస్‌టీ, హైదరాబాద్ జోన్ వారి ఆహ్వానము
శ్రీమతి మల్లికా ఆర్య
చీఫ్ కమీషనర్, హైదరాబాద్ జోన్
మరియు అధికారుల బృందం జిఎస్‌టి చట్టంపై స్పష్టత, అవగాహన పెంపొందించుటకు మీ జిల్లాకు విచ్చేయుచున్నారు.
కావున పన్ను చెల్లింపుదారులు మరియు జిఎస్‌టి వృత్తి నిపుణులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకొని సమావేశాన్ని జయప్రదం చేయవలసినదిగా కోరుచున్నాము.
తేదీ మరియు సమయం :
ది. 03-03-2020 మంగళవారం, ఉ. 10 గం. నుండి మ. 1 గంట వరకు
వేదిక : హోటల్ స్పైసీ కిచెన్, బస్‌డిపో ఎదురుగా, జగిత్యాల.
జిల్లా : జగిత్యాల
సంప్రదించండి : T. సూర్య ప్రకాష్, సూపరింటెండెంట్ (జిఎస్‌టి)
మొబైల్ నెం. : 79012 43284, 90594 63366
తేదీ మరియు సమయం :
ది. 03-03-2020 మంగళవారం, మ. 3 గం. నుండి సా. 6 గంటల వరకు
వేదిక : EDC మిలీనియం హాల్, NTPC టౌన్‌షిప్, రామగుండం
జిల్లా : పెద్దపల్లి
సంప్రదించండి : K. అమర్ కుమార్, సూపరింటెండెంట్ (జిఎస్‌టి)
మొబైల్ నెం. : 92904 59815
ఆర్థిక మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వము
జారీచేయువారు : మేడ్చల్ జిఎస్‌టి కమీషనరేట్, హైదరాబాద్

# ఉద్యోగులకు శాపం సీపీఎస్

**కేంద్రంపై టీఈఏ, ఎన్పీఆర్‌యూఎఫ్ మండిపాటు - పాత పెన్షన్ విధానం సాధనకు ఒకరోజు నిరాహార దీక్ష**


సీపీఎస్‌ను రద్దుచేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు చేపట్టిన నిరాహార దీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) కొత్త ఉద్యోగులకు శాపమని ప్రభుత్వ ఉద్యోగులు అన్నారు.పాత పెన్షన్ విధానం సాధనకు తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ), నేషనల్ ఓల్డ్ పెన్షన్ రిస్టోరేషన్ యునైటెడ్ ఫ్రంట్ (ఎన్పీఆర్‌యూఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద ఒకరోజు నిరాహార దీక్షకు దిగారు. కార్యక్రమంలో టీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు చిలగాని సంపత్ కుమారస్వామి, ఎన్పీఆర్‌యూఎఫ్ జాతీయ అధ్యక్షుడు బీపీసింగ్ రావత్, టీఈఏ రాష్ట్ర కార్యదర్శి గడ్డం బాలస్వామి, గౌరవ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ పురుషోత్తం, కన్వీనర్ బత్తిని సుదర్శన్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు నిర్మల, కోశాధికారి లక్ష్మి, అసోసియేట్ ప్రెసిడెంట్ బొడ్డు ప్రసాద్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ ప్రతినిధులు పరమశివం, వీరేంద్ర పాల్గొన్నారు.

### సీపీఎస్ రద్దుకు ఐక్యవేదిక డిమాండ్

**హిమాయత్‌నగర్:** సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, పబ్లిక్ సెక్టార్, కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది. ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్‌నగర్‌లోని బీసీభవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జీ సదానందంగౌడ్ (ఎస్టీయూ), జంగయ్య (టీఎస్‌యూటీఎఫ్), కే రమణ (టీపీటీఎఫ్), టీ లింగారెడ్డి (డీటీఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఎస్సై వాట్సాప్ మెసేజ్ కలకలం

**కడపలో ఉన్నట్టు డీఎస్పీకి ఫోన్లో చెప్పిన ఎస్సై విష్ణునారాయణ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆత్మహత్య చేసుకొంటున్నట్టు పోలీసుల వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టి కనిపించకుండాపోయిన కర్నూలు జిల్లా రుద్రవరం పోలీస్‌స్టేషన్ ఎస్సై విష్ణునారాయణ ఉదంతం కలకలం రేపింది. తాను క్షేమంగానే ఉన్నట్టు ఆయన నుంచి సమాచారం రావడంతో పోలీసులు ఊపిరిపీల్చుకొన్నారు. శనివారం ఉదయం 4 గంటల సమయంలో ఇంట్లో నుంచి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయిన ఎస్సై ఆచూకీ లభించడంతో ఆయన కుటుంబీకులు ఆనందం వ్యక్తంచేశారు. పోలీసుల అధికారిక వాట్సాప్ గ్రూప్‌లో 'ఈ మెసేజ్ చదివే సమయానికి నేను బతుకవచ్చు.. లేక చనిపోవచ్చు. నన్ను అందరూ చెడుగా అనుకోవద్దు' అంటూ మెసేజ్ పెట్టి ఎస్సై విష్ణునారాయణ అదృశ్యమయ్యాడు. ఆదివారం మధ్యాహ్నానికి తాను కడప జిల్లాలో ఉన్నట్టు ఆళ్లగడ్డ డీఎస్పీకి ఫోన్ ద్వారా విష్ణునారాయణ తెలియజేడయంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.




ఆదివారం నాందేడ్‌లో జరిగిన యాదవసభలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్

# గొల్ల, కురుమలకు 'మహా' సహకారం

**నాందేడ్ గొల్లగోల్వార్స్ యాదవసభలో మంత్రి తలసాని విజ్ఞప్తి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాందేడ్‌లోని గొల్ల, కురుమల అభివృద్ధికి మహారాష్ట్ర సర్కార్ కృషిచేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. ఆదివారం మహారాష్ట్ర నాందేడ్‌లోని న్యూమోండా మైదానంలో జరిగిన గొల్లగోల్వార్స్ యాదవసభలో మంత్రి తలసాని ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. తెలంగాణలో గొల్ల, కురుమల సంక్షేమానికి సర్కార్ ప్రాధాన్యం కల్పిస్తూ సబ్సిడీపై గొర్రెలను పంపిణీచేసినట్టు వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా యాదవ విద్యార్థులకు వసతి, సంక్షేమ భవనాల కోసం ఐదెకరాల భూమి, రూ.5 కోట్ల నిధులు కేటాయించినట్టు తెలిపారు. జీవాల సంరక్షణకు, వాటివద్దకు వెళ్లి వైద్యసేవలు అందించేలా సంచార పశువైద్యశాలలను ఏర్పాటుచేశామని చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా గొల్ల, కురుమల సంక్షేమానికి కృషిచేయాలని ఆ రాష్ట్ర మంత్రి అశోక్‌రావ్ జీ చౌహాన్‌ను మంత్రి తలసాని కోరారు. తెలంగాణ సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో యాదవులు స్వయంసమృద్ధి సాధిస్తున్నారని ఆల్ యాదవ ఉమెన్స్ చైర్‌పర్సన్ బొంతు శ్రీదేవి అన్నారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు.

# చెత్తతో కాసులవర్షం

- సిరిసిల్ల మున్సిపాలిటీకి ఏటా రూ.60 లక్షల ఆదాయం
- నెలకు 46 టన్నుల తడి, పొడి చెత్త సేకరణ
- సేకరణతో మహిళలకు స్వయం ఉపాధి
- కేటీఆర్ చొరవతో ఎరువుల తయారీ యూనిట్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

చెత్త సేకరణతో సిరిసిల్ల మున్సిపాలిటీలో కాసులవర్షం కురుస్తున్నది. మున్సిపాలిటీ పరిధిలో నెలకు 46 టన్నుల తడి, పొడి చెత్త వ్యర్థాలు సేకరించి విక్రయిస్తుండటంతో ఏటా రూ.60 లక్షల ఆదాయం సమకూరుతున్నది. ఇందులో 18 టన్నుల తడిచెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేస్తుండగా, 6 టన్నుల పొడిచెత్తను పరిశ్రమలకు విక్రయిన్నారు. మున్సిపల్, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ చొరవతో నేషనల్ అర్బన్ శానిటేషన్ పాలసీ పథకం కింద తెలంగాణలోనే తొలివిడతగా సిరిసిల్ల మున్సిపాలిటీ ఎంపికవ్వగా, చెత్తతో ఎరువుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించి ఏటా రూ.60 లక్షల ఆదాయం గడిస్తూ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నది.

### దేవనహళ్లీ స్ఫూర్తిగా..

కర్ణాటక రాష్ట్రంలోని దేవనహళ్లీ మున్సిపాలిటీ స్ఫూర్తితో సిరిసిల్లలో చెత్తతో ఎరువుల తయారీకి శ్రీకారంచుట్టారు. పట్టణంలో 39 వార్డుల్లో 18,055 గృహాలుండగా.. 30,257 మంది నివసిస్తున్నారు. ఇక్కడ నెలకు 46 టన్నుల చెత్తను మున్సిపాలిటీ సిబ్బంది సేకరిస్తున్నారు. ఇందులో 18 టన్నుల తడిచెత్త, 6 టన్నుల పొడిచెత్త, 17 టన్నుల గృహనిర్మాణాల సంబంధిత వ్యర్థాలు, 3 టన్నుల మురుగు కాల్వల వ్యర్థాలు, 2 టన్నుల వరకు రహదారులపై ఉండే వ్యర్థాలను సేకరిస్తున్నారు. తడిచెత్తతో నెలకు ఐదు టన్నుల సేంద్రియ ఎరువును తయారుచేస్తూ కిలోకు రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. కాగా, టూత్‌బ్రష్‌లు, ప్లాస్టిక్ సీసాలు, పాదరక్షలు, పెన్నులు, డబ్బాలు, అట్టపెట్టెలు, కాగితాలు తదితర పొడిచెత్తను పరిశ్రమలకు చేరవేస్తు ఆదాయాన్ని పొందుతున్నారు.

### మహిళలకు స్వయం ఉపాధి

చెత్త సేకరణ బాధ్యత తీసుకున్న స్వయంసహాయక మహిళా బృందాలకు పని లభిస్తున్నది. 20 మంది మహిళలు, 125 మంది అవుట్ సోర్సింగ్, 42 మంది రెగ్యులర్ కార్మికులు దీని ద్వారా ఉపాధి పొందుతున్నారు. వ్యర్థాల సేకరణతో స్వయం సహాయక మహిళలు నెలకు రూ.15 వేల నుంచి రూ. 20 వేలవరకు సంపాదిస్తున్నారు.


సిరిసిల్లలోని రగుడు వద్ద ఏర్పాటు చేసిన పొడి వ్యర్థ వనరుల సేకరణ కేంద్రం

### మున్సిపాలిటీకి మంచి ఆదాయం

నిత్యం సేకరిస్తున్న చెత్త ద్వారా మున్సిపాలిటీకి మంచి ఆదాయం వస్తున్నది. రాష్ట్రంలో తొలిసారిగా మంత్రి కేటీఆర్ చొరవతో ఇక్కడ రూ.65 లక్షలతో యూనిట్ ఏర్పాటు చేశాం. దీనిద్వారా నెలకు రూ.3.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతున్నది. తడిచెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేస్తూ.. ఎరువుల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.



**– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల**

# మేఘాలయలో ఘర్షణలు

**ముగ్గురు మృతి**

**ఇంటర్నెట్ సేవల నిలిపివేత**

**షిల్లాంగ్, మార్చి 1:** మేఘాలయలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య జరిగిన ఘర్షణల్లో ముగ్గురు మరణించారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులోని తూర్పు ఖాసి హిల్స్ జిల్లాలో ఇచామాటి ప్రాంతంలో శుక్రవారం సీఏఏకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన జరిగింది. ఐఎల్పీను అమలు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఖాసి విద్యార్థి సంఘం (కేఎస్‌యూ), గిరిజనేతరుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మరణించాడు. ఈ ఘటనకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ క్లాడియా లింగ్వా తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో జరిగిన వేర్వేరు దాడుల్లో ఇద్దరు హత్యకు గురైనట్లు ఆయన వెల్లడించారు. శనివారం కంటోన్మెంట్ బీట్ హౌస్ ప్రాంతంలోని లెడుహ్ మార్కెట్ వద్ద ఉన్నవారిపై ఓ గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేయగా ఓ వ్యక్తి మరణించాడని, పలువురు తీవ్రంగా గాయపడ్డారని ఆయన తెలిపారు. శనివారం రాత్రి మావ్తాబా వద్ద మేఘాలయా బేసిన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఉద్యోగిపై దాడి జరిగింది.

# సూపర్ పోలీస్

మొదటిపేజీ తరువాయి...

మందికి జీవితఖైదు పడింది. ఫిబ్రవరి నెలలో 101 మందికి శిక్షపడగా.. ఇందులో ఆరుగురికి యావజ్జీవశిక్షలు ఉన్నాయి.

### ఫలిస్తున్న పని విభజన విధానం

పోలీసుల విధులను విభజిస్తూ డీజీపీ మహేందర్‌రెడ్డి నూతనంగా అంశాలవారీగా పని విభజన (వర్టికల్స్ విధానం) అమల్లోకి తెచ్చారు. దీనిలో భాగంగా ఏర్పాటుచేసిన కోర్టు వర్టికల్‌తో మరింత పర్యవేక్షణ పెరిగి సత్ఫలితాలు వస్తున్నాయి. ప్రతి స్టేషన్ పరిధిలో కోర్టు కానిస్టేబుల్‌ను ఒక వర్టికల్‌గా విభజించి.. రాష్ట్రవ్యాప్తంగా బ్యాచులుగా డీజీపీ కార్యాలయంలోని లెర్నింగ్ సెంటర్‌లో శిక్షణ ఇచ్చారు. ఒక కేసు కోర్టు ట్రయల్‌కు సంబంధించి ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి. సాక్ష్యాలతో మనోధైర్యాన్ని నింపుతూ, తుది తీర్పు వచ్చేవరకు మాట మార్చకుండా, నిజాయితీగా సాక్ష్యం చెప్పేలా తీసుకోవాల్సిన చర్యలు, కేసుల నిరంతర పర్యవేక్షణ, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు కోర్టు అంశాలను వివరించడం.. ఇలా కోర్టు కానిస్టేబుల్ విధులన్నింటిపైనా స్పష్టత ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుల్ మధ్య సమన్వయం పెరిగేలా చర్యలు తీసుకొన్నారు. దాంతో ఆశించిన ఫలితాలు సాధించగలుగుతున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఉత్తమ పనితీరు కనబర్చిన సిబ్బందికి ప్రత్యేకంగా గుర్తింపు ఇస్తుండటంతో సిబ్బంది మధ్య ఆరోగ్యకరమైన పోటీ పెరిగింది. కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కోర్టు విధుల్లో శక్తివంచన లేకుండా కష్టపడిన సిబ్బందికి కానిస్టేబుల్ నుంచి యూనిట్ అధికారి వరకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు.

### సాంకేతికతతో పక్కాగా ఆధారాల సేకరణ

కోర్టులో నేరం నిరూపించాలంటే ప్రధానంగా సాక్షాలు పక్కాగా ఉండాలి. నిందితుడు నేరం చేశాడు అనడానికి తగిన శాస్త్రీయ, సాంకేతిక ఆధారాల సేకరణలో తెలంగాణ పోలీసులు చూపుతున్న పనితీరుతోనూ నేరస్థుడు శిక్ష నుంచి తప్పించుకోలేకపోతున్నారు. ఇటీవల సంచలనంగా మారిన హాజీపూర్ సైకోకిల్లర్ శ్రీనివాస్‌రెడ్డి కేసు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన సమత లైంగికదాడి, హత్య కేసు రికార్డు సమయంలోనే దర్యాప్తు పూర్తిచేశారు. పలు శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలు సేకరించి తెలంగాణ పోలీసుల సామర్థ్యం ఏమిటో నిరూపించారు. దీంతో రెండు కేసుల్లో నిందితులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఉరిశిక్ష విధించిన విషయం తెలిసిందే. అత్తాపూర్‌లో సంచలనంగా మారిన హత్య కేసులోనూ రెండురోజుల క్రితమే ముగ్గురు నిందితులకు జీవితఖైదు పడింది.

### వర్టికల్ విధానంలో తొలి ఫలితాలివి



పోలీస్ సిబ్బంది రోజువారీ పనులను విభజిస్తూ తీసుకొచ్చిన వర్టికల్ విధానంలో వస్తున్న తొలి ఫలితాలు ఇవి. నిందితులకు శిక్షపడేలా శ్రమిస్తున్న కోర్టు వర్టికల్ సిబ్బందికి ప్రోత్సాహకాలు ఇవ్వడం, శభాష్ అంటూ మెచ్చుకోవడం ద్వారా వారిలో సానుకూల దృక్పథం పెరిగింది. దీంతో చాలా వరకు కేసుల్లో శిక్షలు పడుతున్నాయి.

**- ఎం మహేందర్‌రెడ్డి, డీజీపీ, తెలంగాణ**

### నిరంతర ఫాలోఅప్‌తో శిక్షల ఖరారు




హాజీపూర్‌లో వరుస హత్యల కేసు తీవ్రత దృష్ట్యా దర్యాప్తును ముమ్మరంగా చేపట్టాం. పూర్తి స్థాయిలో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలు సేకరించాం. ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేయడం, రికార్డు సమయంలో ఆధారాలు కోర్టు ముందుంచడంతో నేరస్థుడికి శిక్ష ఖరారైంది. ప్రజల్లో తెలంగాణ పోలీసులపై నమ్మకం పెరిగింది.

**- మహేశ్‌భగవత్, పోలీస్ కమిషనర్, రాచకొండ**

# ప్రభుత్వ భూములూ దురాక్రమణ

మొదటిపేజీ తరువాయి...

రేవంత్‌రెడ్డి టీం సాగించిన దందాలో కొత్త కోణం వెలుగులోకి వచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సర్వేనంబర్ 127లో తాము కొనుగోలు చేశామంటూ పక్కనున్న ప్రభుత్వ భూములను, చెరువులను, బండ్లబాటనూ ఆక్రమించుకున్నట్టు క్షేత్రస్థాయి విచారణలో వెల్లడయింది. అక్రమ నిర్మాణాలు, కుంటల ఆక్రమణ, నీటి వనరుల ధ్వంసం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినచోట నిర్మించిన ప్రహరీ పైన, గేటుపై ఎంపీ రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుల పేర్లు కూడా రాసి ఉండటం గమనార్హం. ఇప్పటికే ఫిర్యాదుల పరంపర కొనసాగుతుండగా, ఇంకెంత మంది బాధితులు ముందుకొస్తారో వేచిచూడాలి. ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూములనూ ఆక్రమించుకున్నారని తేలింది.


గోపన్‌పల్లిలో రేవంత్‌రెడ్డి, ఆయన అనుచరగణం కొనుగోలుచేశామంటున్న సర్వే నంబరు 127 లేఅవుట్ చిత్రం

### ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయిన అంశాలు

- సర్వేనంబర్ 127లో కొనుగోలు చేసినట్టుగా చెప్తున్నది 10.21 ఎకరాలు. దానికి ఉత్తరం దిక్కున సర్వేనంబర్ 34, 35లోని భూములు ప్రభుత్వానివి. అందులోనే టీఎన్జీవోలకు, యూనివర్సిటీకి కేటాయించారు. అయితే, రేవంత్ టీం సర్వేనంబర్ 127 చూపించి సర్వేనంబర్ 34లోని 1.11 ఎకరాలను కబ్జా పెట్టినట్టు తేలింది. ఇక్కడ ఎకరా విలువ రూ.25 కోట్లపైమాటే కావడం విశేషం.
- సర్వేనంబర్ 126లో కోమటికుంట ఉన్నది. ఇది చాలా ఏండ్ల నాటిది. దాన్నీ వదల్లేదు. సర్వేనంబర్ 126లోని 1.14 ఎకరాల చెరువు విస్తీర్ణాన్ని 127 సర్వేనంబర్‌లోని భూమి అంటూ కలిపేశారు. బఫర్ జోన్‌కింద 22 గుంటలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో 32 గుంటలుగా లెక్క తేలింది. చెరువులను రక్షించాల్సిన ప్రజాప్రతినిధి వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి దాన్ని భక్షించేందుకు యత్నిస్తున్నారు. సుప్రీంకోర్టు సూచనలను పట్టించుకోలేదు. ఆక్రమణదారులపై రెవెన్యూ ఫస్లీ యాక్టులో సెక్షన్ 24 ప్రకారం క్రిమినల్ చర్యలు తప్పవు. ఈ చెరువును కాపాడకపోతే భావితరాలకు ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు అంటున్నారు. నగరానికి దగ్గరలో ఉండే ప్రతి నీటి వనరును పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న దరిమిలా కోమటికుంట రక్షణకు చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.
- ఏ ఊరిలోనైనా ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లేందుకు మార్గాలు ఉండేవి. గోపన్‌పల్లి రెవెన్యూ మ్యాపులోనూ సర్వే నంబర్ 127 నుంచి ఓ వైపు 126, మరో వైపు 34లోకి వెళ్లేందుకు బండ్లబాట స్పష్టంగా ఉన్నది. దాన్ని పూర్తిగా మూసేశారు. అలా 10 గుంటలకు పైగానే స్వాహా చేసినట్టు తేలింది. వందల ఏండ్లనాటి బండ్లబాటను పునరుద్ధరించడం ద్వారా ఎంతోమందికి ప్రయోజనం కలుగుతుందని స్థానికులు అంటున్నారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.
- మరోవైపు సర్వేనంబర్ 127గా చెప్పుకొంటూ సర్వేనంబర్ 128లోని 10 గుంటలకు పైగానే క్లెయిమ్ చేస్తున్నారు. ఎవరైనా భూమి కొనుగోలు చేసేటప్పుడే హద్దురాళ్లను పెట్టించుకుంటారు. అందు కోసం సర్వే చేయించుకుంటారు. ఇక్కడేమో అధికార బలం ఉన్నదని అన్నింటినీ ఉల్లంఘించి దందాను సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఎంపీ రేవంత్‌రెడ్డి, ఆయన అనుచరవర్గం కొనుగోలు చేసినట్టు చెప్తున్న సర్వేనంబర్ 127లోనూ 5.21 ఎకరాలు కూడా టైటిల్ ఫేక్ అని తేలింది.
- తాజాగా రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయిలో ప్రాథమికంగా చేపట్టిన దర్యాప్తులో ఈ అక్రమాలన్నీ వెలుగులోకి వచ్చాయి. వాల్టా చట్టం ఉల్లంఘన, ప్రభుత్వ భూమి ఆక్రమణ, నీటి వనరుల ఆక్రమణ వంటి అంశాలపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది. నేడో రేపో నిర్మాణాల కూల్చివేత మొదలుకానున్నట్టు సమాచారం.
- త్వరలోనే గోపన్‌పల్లిలో వివాదాస్పద సర్వే నంబర్ 127పై నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు ఓ రెవెన్యూ అధికారి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఉల్లంఘనలు నిజమేనని విచారణలో తేలిందని, అక్రమార్కులపై చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# ఎండ దడ

మొదటిపేజీ తరువాయి...

సాధారణస్థాయి కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని విశ్లేషించింది. గతంలో కంటే వడగాడ్పులు ఎక్కువ రోజులు వీచే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. మార్చినుంచి మే నెలల మధ్య ఎండలు బాగా ముదురుతాయని తెలిపింది.

### గత ఏడాది ఎండ తీవ్రత తక్కువే

గత ఏడాది తెలంగాణలో ఎండల తీవ్రత అంత ఎక్కువేం లేదు. వడగాడ్పులు కూడా తక్కువే. గతేడాది ఎండాకాలంలో జగిత్యాల జిల్లాలోని వెలగటూరులో అత్యధికంగా 47.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, చాలా జిల్లాల్లో మే నెలలో 47 డిగ్రీలుగా నమోదయ్యాయి. 2017, 2018 సంవత్సరాల్లో పగటి ఉష్ణోగ్రతలు ఓ మోస్తరుగా ఉన్నాయి. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ విశ్లేషణ ప్రకారం.. 2013 నుంచి ఇప్పటివరకు పగటి ఉష్ణోగ్రత అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా జన్నారంలో, జగిత్యాల జిల్లా రాయికల్‌లో, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాలలో 48.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. హైదరాబాద్‌లో అత్యధికంగా 47.6 డిగ్రీలలోపే నమోదైనట్టు రికార్డులు చెప్తున్నాయి.

# నేడు తేలికపాటి వానలు

**హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నైరుతి మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల నుంచి మధ్య మహారాష్ట్ర మీదుగా కోస్తా కర్ణాటక, దాని పరిసర ప్రాంతాల వరకు సముద్రమట్టానికి 0.9 కి.మీ. ఎత్తువద్ద ఉపరితల ద్రోణి ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో 24 గంటల్లో ఉత్తర తెలంగాణలోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆగ్నేయ, దక్షిణ దిశల నుంచి గాలులు వీస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే మూడ్రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని అంచనావేశారు. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ సమాచారం ప్రకారం.. ఆదివారం ఖమ్మం జిల్లా పెనుబాలిలో అత్యధికంగా 37.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, కామారెడ్డిలో 36.4 డిగ్రీలు, భద్రాచలంలో 35.2 డిగ్రీలు, హైదరాబాద్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెంలో 36.2 డిగ్రీల చొప్పున నమోదైంది.

### గ్రేటర్ హైదరాబాద్‌లో సెం.మీ. వర్షం

గ్రేటర్ హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉన్నా.. రాత్రి 7 గంటల నుంచి వాతావరణం చల్లగా మారింది. సికింద్రాబాద్, ఖైరతాబాద్, బేగంపేట, బంజారాహిల్స్, అబిడ్స్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. రాత్రి 10 గంటల వరకు నగరంలో ఒక సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది. వచ్చే రెండ్రోజుల్లో గ్రేటర్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

# రిజర్వేషన్ల ఎత్తివేతకు కేంద్రం కుట్ర

**ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సమావేశాల్లో కన్వీనర్ జితిన్‌చౌదరి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రిజర్వేషన్ల ఎత్తివేతకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కన్వీనర్ జితిన్ చౌదరి అన్నారు. ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లపై బీజేపీ తన వైఖరిని ప్రకటించాలని డిమాండ్‌చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రెండోరోజు కొనసాగిన మంచ్ జాతీయ సమావేశాల్లో జితిన్‌చౌదరి మాట్లాడారు. రిజర్వేషన్ల అమలు ప్రాథమిక హక్కుల్లో భాగంకాదని చెప్పడం అన్యాయమన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని జబల్‌పూర్ జిల్లాలో ఆదివాసీ సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చిన యువ జర్నలిస్ట్ సంతోష్‌యాదవ్‌ను సెంటర్ ఆఫ్ ఆదివాసీ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థకు చెందిన గమణికా గుప్తా ఫౌండేషన్ తరఫున సన్మానించారు. రూ.25 వేల నగదు పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య, తొడనం భీంరావు, బండారు రవి కుమార్, ధర్మానాయక్, రవినాయక్, 16 రాష్ట్రాలకు చెందిన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# గుంటూరులో రోడ్డుప్రమాదం

**ఆరుగురు దుర్మరణం, నలుగురికి గాయాలు ● అదుపుతప్పి కాలువలో పడిన టవేరా**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గుంటూరు జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకొన్నది. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట వద్ద (ఐదో మైలు వద్ద) టవేరా వాహనం అదుపుతప్పి వాగులో పడిపోవడంతో ఆరుగురు దుర్మరణం చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. మృతులు కాకుమానుకు చెందిన శ్రీను (50), వీరలక్ష్మి (48), ప్రసాదం (55), సీతమ్మ (65), రమణ (48), సుబ్బులుగా గుర్తించారు. క్షతగాత్రులను గుంటూరులోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానిక పోలీసులు చెప్తున్నారు. కాకుమానుకు చెందిన వీరంతా గుంటూరు రూరల్ మండలం ఏటుకూరులో జరిగిన ఒక శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా, గుంటూరు ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఏపీ రాష్ట్ర హోంమంత్రి మేకతోటి సుచరిత పరామర్శించారు. హోంమంత్రి వెంట జిల్లా కలెక్టర్, ఎస్పీ కూడా ఉన్నారు.

**మిర్చి లారీ బోల్తా: నలుగురు రైతులు మృతి**

గుంటూరు జిల్లాలోని వెల్దుర్తి మండలం శ్రీరాంపురం తండా వద్ద ఆదివారం సాయంత్రం మరో రోడ్డు ప్రమాదం జరిగింది. మిర్చిలోడుతో వెళ్తున్న లారీ క్వారీ గుంతలో బోల్తా పడటంతో నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. బోధిలవీడుకు చెందిన రైతులు మిర్చి పంటను మార్కెట్‌కు తీసుకెళ్తుండగా ఈ ఘటన జరిగినట్టు పోలీసులు తెలిపారు.

# సోలార్‌వెలుగుల్లో అండర్‌పాస్‌లు

- 158 కిలోమీటర్ల ఓఆర్‌ఆర్‌లో 165 అండర్‌పాస్‌మార్గాలు
- మంత్రి కేటీఆర్ ఆదేశాలతో రూ.1.90 కోట్లతో విద్యుదీకరణ
- రేపు అర్ధరాత్రివేళ పట్టపగలును తలపించేలా ఎల్ ఈడీ లైటింగ్

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**


ఓఆర్ఆర్ అండర్‌పాస్ వద్ద ఎల్ ఈడీ లైట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

రాష్ట్ర రాజధానికి మణిహారమైన ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) అండర్‌పాస్‌మార్గాలు సోలార్ వెలుగులు సంతరించుకోనున్నాయి. 158 కిలోమీటర్ల ఓఆర్ఆర్‌లో 165 అండర్‌పాస్‌లున్నాయి. మంగళవారం రాత్రి నుంచి అవి దేదీప్యమానంగా ధగధగలాడనున్నాయి. జన సంచార ప్రదేశాలు, బ్రిడ్జిలు, అండర్‌పాస్ మార్గాల్లో సోలార్ లైటింగ్ ఏర్పాటుచేయాలని మంత్రి కేటీఆర్.. హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్‌కు ఆదేశాలు జారీచేశారు. సుమారు రూ.1.90 కోట్లతో విద్యుదీకరణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే 62 అండర్‌పాస్‌దారుల్లో ఎల్ఈడీ లైటింగ్ పూర్తయింది. ఈ నెల మూడోతేదీ నుంచి లైటింగ్ వ్యవస్థ పనిచేస్తుందని అధికారులు తెలిపారు.

### సోలార్ ఆధారిత ఎల్ఈడీ వ్యవస్థ

ఔటర్ అండర్‌పాస్‌మార్గాలు రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వాటిని నివారించేందుకు అధికారులు సోలార్ ఆధారిత ఎల్ఈడీ లైటింగ్‌వ్యవస్థ ఏర్పాటుచేస్తున్నారు. పెద్ద గోల్కొండ నుంచి శంషాబాద్, కోకాపేట నుంచి కొల్లూరు, పటాన్‌చెరు నుంచి గౌడవల్లి మార్గాల మధ్య అండర్‌పాస్‌లో (వీయూపీ/పీయూపీ) ఎల్ఈడీ పనులకు రూ.68.60 లక్షలు, మేడ్చల్ నుంచి పెద్ద అంబర్‌పేట స్ట్రెచ్ పనులకు రూ.68.60 లక్షలు, పటాన్‌చెరు నుంచి పెద్దఅంబర్‌పేటమార్గంలో రూ.71.50 లక్షలతో ఎల్ఈడీ లైటింగ్ పనులను చేపడుతున్నారు. త్వరలోనే టోల్‌ప్లాజా పాయింట్లలో సీసీ కెమెరాలను బిగించనున్నారు. వాహనదారుడి కదలికలను నానక్‌రాంగూడలోని ఎంటీసీసీ భవనం నుంచి పర్యవేక్షించనున్నారు.

### త్వరలో పూర్తిగా వెలుగులమయం

ఇప్పటికే ఔటర్‌లో తొలివిడుతగా రూ.30 కోట్ల జైకా నిధులతో గచ్చిబౌలి-శంషాబాద్ 22 కి.మీ మార్గంలో ఎనిమిది లేన్ల మెయిన్ కారిడార్‌లోని సెంట్రల్ మీడియన్‌లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుచేశారు. నగరం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని తొలుత ఈ మార్గాన్ని ఎంపికచేశారు. దీనికి అనూహ్య స్పందన రావడంతో మిగిలిన 136 కిలోమీటర్ల మార్గంలో ఎల్ఈడీ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు టెండర్‌దశలో ఉన్నది. ఇది కూడా పూర్తయితే 158 కిలోమీటర్ల ఓఆర్ఆర్ వెలుగులమయం కానున్నది.

## అద్భుతంగా అండర్‌పాస్‌లు

**అధికారుల పనితీరును మెచ్చుకున్న మంత్రి కేటీఆర్**

'165 అండర్ పాస్‌మార్గాల్లో లైటింగ్ ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం నుంచి లైట్లు పనిచేస్తాయి' అని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ ట్వీట్‌చేశారు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా పోస్టుచేశారు. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందించారు. 'ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని అండర్‌పాస్‌లను అధికారులు ఎల్ఈడీ లైటింగ్‌తో అద్భుతంగా తీర్చిదిద్దారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ చీకటి ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటుచేయాలి' అని అధికారుల పనితీరును మెచ్చుకుంటూ రీ ట్వీట్‌చేశారు.



## స్టాటిస్టికల్ ఆఫీసర్ పరీక్షకు 63 మంది హాజరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీలోని ఒక స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టు కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకొన్న 146 మందిలో 63 మంది అభ్యర్థులు హాజరైనట్టు తెలిపింది. పటిష్ఠ నిఘా మధ్య పరీక్ష నిర్వహించినట్టు పేర్కొన్నది.

## 6, 7 తేదీల్లో అగ్రి మహిళల సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మార్చి 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వ్యవసాయ మహిళల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రైతు సంఘం నాయకులు చెప్పారు. ఈ సదస్సుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, వ్యవసాయ నిపుణులు హాజరవుతారని తెలిపారు. ఆదివారం ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సదస్సు కరపత్రాలను విడుదలచేశారు. సమావేశంలో అఖిల భారత కిసాన్ సంఘ్ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరిబండి ప్రసాద్‌రావు, సహాయ కార్యదర్శి లక్ష్మిలు పాల్గొన్నారు.



ట్రంప్ కుమార్తె ఇవాంక ఇటీవల భారత్‌లో పర్యటించినప్పుడు దిగిన ఫొటోలను కొందరు ఇలా మార్ఫింగ్ చేశారు. ఇవి ట్విటర్‌లో కనిపించడంతో ఇవాంక రీట్వీట్ చేశారు. భారత్ తనకు అద్భుతమైన స్నేహితులను అందించిందంటూ ఉబ్బి తబ్బిబ్బయ్యారు.

## వాహ్.. భారత్

### కొనసాగుతున్న ట్రంప్ ప్రశంసలు

**దక్షిణ కరోలినా:** భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. ఇటీవల భారత్ పర్యటనకు వెళ్లిన తనకు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రజలు పలికిన ఘన స్వాగతం ఉల్లాసపరిచిందని కొనియాడారు. శనివారం దక్షిణ కరోలినాలో జరిగిన సభలో ట్రంప్ మాట్లాడారు. భారత్ పర్యటనలో తనకు స్వాగతం పలికిన ప్రజలను చూసిన తర్వాత మళ్లీ ఆ స్థాయిలో సంతోషానికి గురికాలేదన్నారు. భారత పర్యటన తనకు ఎంతో విలువైనదని చెప్పారు.

## లెఫ్టినెంట్ జనరల్‌గా మాధురి



**న్యూఢిల్లీ:** సైనికాధికారి డాక్టర్ మాధురి కనిత్కర్ శనివారం లెఫ్టినెంట్ జనరల్‌గా పదోన్నతి పొందారు. తద్వారా భారత సైన్యంలో ఈ ఘనత సాధించిన మూడో మహిళగా, తొలి మహిళా శిశువైద్యురాలిగా రికార్డు సాధించారు. ఆమె త్రివిధ దళాల అధిపతి (సీడీఎస్) ప్రధాన కార్యాలయంలో పనిచేయనున్నారు. రక్షణ దళాలకు కేటాయించిన బడ్జెట్ నిధుల సద్వినియోగం, ఆయుధాల సమీకరణ, దళాలకు శిక్షణ, చేపట్టే ఆపరేషన్ల సంయుక్త ప్రణాళిక, అనుసంధానంలో ఆమె కీలకపాత్ర వహించనున్నారు. పుణెలోని రక్షణ దళ వైద్య కళాశాల అధిపతిగా పనిచేసిన డాక్టర్ కనిత్కర్‌కు సైన్యంలో 37 ఏండ్లు పనిచేసిన అనుభవం ఉన్నది. ఆమె భర్త రాజీవ్ కూడా లెఫ్టినెంట్ జనరల్‌గా సైన్యంలో సేవలు అందిస్తున్నారు.

## 'ఈబీ-5' వీసా మరింత ప్రియం

**వాషింగ్టన్:** అమెరికా దేశానికి వలస రావాలనుకొంటున్న భారతీయులు పొందే 'ఈబీ-5' వీసాలు మరింత ప్రియం కానున్నాయి. అమెరికా గ్రీన్‌కార్డ్ పొందడానికి ఈ వీసాను ఒక రాజమార్గంగా భావిస్తుంటారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 'ఈబీ-5' వీసా పొందేందుకు భారతీయులు 5 శాతం ఎక్కువ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే దీని కింద పెట్టుబడి మొత్తాన్ని పెంచినట్టు అమెరికా గత నవంబర్ నెలలోనే ప్రకటించింది. అమెరికా లీగల్ ఇమ్మిగ్రేషన్ ఏజెన్సీ 'ఈబీ-5' ఇన్వెస్ట్‌మెంట్ వీసా ప్రోగ్రాంలో పెట్టుబడి మొత్తాన్ని గత ఏడాది 9 లక్షల డాలర్లకు (దాదాపు రూ.6.50 కోట్లు) పెంచింది. 1990 తర్వాత పెంచడం ఇదే తొలిసారి. మరోవైపు భారత్‌లో రెమిటన్స్‌పై 5 శాతం అదనపు పన్ను పడనుండటంతో భారతీయులు మరో 50 వేల డాలర్ల వరకు (దాదాపు రూ.36.08లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. వ్యాపారవేత్తల వీసాగా భావించే ఈ వీసాకు దరఖాస్తు చేసే సమయంలో అమెరికాలో పెట్టే పెట్టుబడి మొత్తాన్ని వివరించాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రోగ్రాంను సాధారణంగా స్టార్టప్ సంస్థలు వినియోగించుకొని అమెరికన్ మార్కెట్లో తమ వ్యాపారాన్ని విస్తరించుకొంటాయి.



# కరోనా గుప్పిట ప్రపంచం

## అగ్రరాజ్యం సహా 70 దేశాల్ని వణికిస్తున్న వైరస్

### అమెరికాలో తొలి మృతి నమోదు.. ఆస్ట్రేలియా, ఐర్లాండ్, థాయిలాండ్‌లో కూడా

### ఇరాన్‌పై కొవిడ్ పంజా.. మృతుల సంఖ్యను తక్కువచేసి చూపెడుతున్నట్టు ఆరోపణలు

**వాషింగ్టన్/సిడ్నీ/ఇస్లామాబాద్/బీజింగ్, మార్చి 1:** కరోనా.. ఈ పేరు వింటేనే ప్రపంచం ఉలిక్కిపడుతున్నది. ప్రభుత్వాలు గడగడలాడుతున్నాయి. చైనాలో మొదలైన ఈ భయంకర మహమ్మారి.. ఇప్పుడు దాదాపు 70 దేశాలకు విస్తరించింది. ఇలా మొత్తంగా ప్రపంచాన్నే తన గుప్పిట్లోకి తీసుకున్నది. దీంతో అన్ని దేశాలు నియంత్రణ చర్యలకు ఉపక్రమిస్తున్నాయి. తాజాగా ఈ వైరస్ సోకి అగ్రరాజ్యం అమెరికా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, థాయిలాండ్‌లో ఒక్కో పౌరుడు చొప్పున మరణించడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటలీలో బాధితుల సంఖ్య ఒక్కసారిగా 40శాతం పెరిగింది.

**ఉలిక్కిపడిన అగ్రరాజ్యం**


అమెరికాలో తొలి కరోనా మరణం నమోదైంది. ఆ దేశ వైద్యాధికారులే ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే మృతుని వివరాలను తెలుపలేదు. వైరస్ సోకిన బాధితుల సంఖ్యపైనా స్పష్టతనివ్వలేదు. మరోవైపు ఇరాన్, దక్షిణ కొరియాకు అవసరమైతేతప్ప ప్రయాణించవద్దని పౌరులకు సూచించింది.

**ఆస్ట్రేలియాలో తొలి మరణం**

కరోనాకు ప్రభావితమైన డైమండ్ ప్రిన్సెస్ నౌక నుంచి ఆస్ట్రేలియా ప్రభుత్వం దాదాపు 160 మందిని స్వదేశానికి తరలించింది. వైద్యుల పర్యవేక్షణలో వారికి చికిత్స అందిస్తున్నది. వారిలో 78 ఏండ్ల వ్యక్తి మరణించినట్టు ఆదివారం అధికారులు ప్రకటించారు. దీంతో ఆస్ట్రేలియాలో తొలి కరోనా మరణం రికార్డైంది. మరోవైపు. ఐర్లాండ్, థాయిలాండ్‌లో సైతం మొదటి కరోనా మరణం నమోదైనట్టు అధికారులు ప్రకటించారు.

**ఇరాన్‌లో విజృంభణ**

కరోనా వైరస్ సోకి ఆదివారం నాటికి 54మంది మరణించారని, వైరస్ సోకిన బాధితుల సంఖ్య 978కు చేరుకుందని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. అయితే, వాస్తవ సంఖ్యను దాచేస్తూ.. ఇరాన్ అబద్ధాలు చెబుతున్నదని ప్రఖ్యాత మీడియా సంస్థ బీబీసీ ఆరోపించింది. ఆ దేశంలో ఇప్పటివరకూ 210 మందికి పైగా కరోనాతో చనిపోయారని చెప్పింది. ఆ దేశ దవాఖాన వర్గాలే తమకు ఈ సమాచారాన్ని ఇచ్చినట్టు పేర్కొంది. మరోవైపు, కరోనాతో ఇరాన్‌లో 300 మందికి పైగా మరణించారని, 15 వేల నుంచి 18 వేల మందికి ఈ వైరస్ సోకిందని మరి కొన్ని సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయుల్ని తీసుకురావడానికి చర్యలు ప్రారంభించినట్టు విదేశాంగ శాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు, చైనాలో ఈ వైరస్‌బారిన పడి మరణించినవారి సంఖ్య 2,870కు చేరగా.. 79,824 మందికి కరోనా సోకినట్టు నిర్ధారణ అయింది.



**తప్పదు మరి!**

కరోనా కేసులు క్రమంగా పెరుగుతుండటంతో దాయాది దేశం పాకిస్థాన్ ముందస్తు చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా పొరుగునున్న ఆఫ్ఘనిస్థాన్ దేశంతో పంచుకుంటున్న సరిహద్దు మార్గాల్ని సోమవారం నుంచి వారంరోజులపాటు మూసేస్తున్నట్టు ఆదివారం ప్రకటించింది. ఇప్పటికే దేశంలో నలుగురికి కరోనా వ్యాధి లక్షణాలున్నట్టు గుర్తించామని, వైరస్ వ్యాప్తిని నియంత్రించాలంటే ఇలాంటి చర్యలు తీసుకోకతప్పదని అధికారులు పేర్కొన్నారు.

**70 దేశాల ఆంక్షలు**

దక్షిణ కొరియాలో కరోనా బాధితుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్నది. ఈ వైరస్ సోకి 17 మంది మరణించగా.. ఆదివారం కొత్తగా 376 మందికి ఈ వైరస్ సోకింది. దీంతో బాధితుల సంఖ్య 3,526కు చేరింది. దక్షిణ కొరియాలో వైరస్ ఉధృతి నేపథ్యంలో ఆ దేశానికి తమ పౌరులు వెళ్లకుండా దాదాపు 70కిపైగా దేశాలు ఆంక్షలు విధించాయి.

## వ్యాక్సిన్‌ను కొనగలమా?



కరోనాను నియంత్రించే వ్యాక్సిన్ మరో 90 రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నదని ఇటీవల ఇజ్రాయెల్ శాస్త్రవేత్తలు ప్రకటించారు. అయితే దీన్ని కొనుగోలు చేసే తాహతు ఎంతమందికి ఉండబోతుందోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై అమెరికా మానవ ఆరోగ్య సేవల విభాగం కార్యదర్శి అలెక్స్ స్పందించారు. ప్రస్తుతం కరోనా వ్యాక్సిన్‌ను కొనుగోలు చేసే సామర్థ్యం అమెరికన్లకు లేదని చెప్పారు. ప్రైవేటు ఫార్మా సంస్థలు దీన్ని అభివృద్ధి చేస్తే టీకా ఖరీదు అంచనాలకు మించి ఉంటుందన్నారు.తలసరి ఆదాయం(అంచనా)57,379డాలర్లు(రూ.42,13,504)గాఉన్న అమెరికన్ పరిస్థితే ఇలా ఉంటే మిగతా వాళ్ల సంగతేంటని పలువురు వాపోతున్నారు.

## ముద్దులతో స్వాగతాలు ఆపేయండి

ఫ్రాన్స్‌లో కరోనా క్రమంగా వ్యాపిస్తున్నది. దీంతో వైరస్‌ను అదుపు చేసేందుకు ఆ దేశం కొన్ని ఆంక్షలు విధించింది. 5వేల కంటే ఎక్కువ మంది పాల్గొనే కార్యక్రమాల్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. అలాగే, మిత్రులు, బంధువులకు చుంబనాలతో(ముద్దులతో)స్వాగతం, శుభాకాంక్షలు తెలిపే విధానానికి కొద్ది రోజుల పాటు స్వస్తి పలకాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది.

## నేను బాగానే ఉన్నాను మిత్రో..



ప్రఖ్యాత నటుడు జాకీచాన్‌కు కరోనా సోకినట్టు వస్తున్న వార్తలపై ఆదివారం ఆయన స్పందించారు. తాను ఆరోగ్యంగా, సురక్షితంగా ఉన్నానని, కరోనా పేరుతో తనను ఎవరూ నిర్బంధించలేదని తెలిపారు. వైరస్ సోకిందన్న కారణంతో తనకు వేలాది మంది అభిమానులు మాస్కులు పంపించారని, వాటిని అవసరమైన వాళ్లకు ఇవ్వాల్సిందిగా తన సిబ్బందికి చెప్పానని ఆయన పేర్కొన్నారు.

---

■ కొంచెం ఊరట

## తగ్గిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు



**రూ.53** తగ్గిన సబ్సిడీయేతర సిలిండర్ ధర
పాత ధర: 862
కొత్త ధర: 809

**రూ.84.5** తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర
పాత ధర: 1542
కొత్త ధర: 1457.50



**17 పైసలు** తగ్గిన పెట్రోల్ ధర
కొత్త ధర: 76.23

**26 పైసలు** తగ్గిన డీజిల్ ధర
కొత్త ధర: 70.01

■ కొత్త ధరలు ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయని చమురుసంస్థలు తెలిపాయి.

## పథకం ప్రకారమే ఢిల్లీ అల్లర్లు

- అమానుష ఘటనలకు ప్రధానిదే బాధ్యత: అసదుద్దీన్ ఒవైసీ
- తెలంగాణలో ఎన్పీఆర్‌ను నిలిపివేయాలని కేసీఆర్‌కు విన్నపం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పక్కా పథకం ప్రకారమే ఢిల్లీలో అల్లర్లు జరిగాయని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పునరుద్ఘాటించారు. ఢిల్లీలో జరిగిన అమానుష ఘటనలకు ప్రధాని నరేంద్రమోదీ బాధ్యత వహించాలని డిమాండ్‌చేశారు. ఎంఐఎం 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం దారుసలాంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసద్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నివాసానికి కూతవేటు దూరంలో జరిగిన అల్లర్లపై ఆయన ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు.ప్రధానికి నిజంగా బాధ్యత ఉంటే వెంటనే అల్లర్ల ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని సవాల్ విసిరారు. ఢిల్లీలో చెలరేగినవి మత కలహాలు కావని, బీజేపీ నాయకులు పథకం ప్రకారం విద్వేషాలు రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించారని ఆరోపించారు. తెలంగాణలో జాతీయ పౌర పట్టిక (ఎన్పీఆర్)ను అమలు చేయకుండా నిలిపివేయాలని ఆయన సీఎం కేసీఆర్‌కు మరోసారి విజ్ఞప్తిచేశారు. మరోవైపు, ఢిల్లీ అల్లర్లలో మరణించినవారి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందించాలని ఎంఐఎం పార్టీ నిర్ణయించింది.

# ఈ శాంతి మాకొద్దు!

- తాలిబన్లు అధికారంలోకి వస్తే మా హక్కులు హరిస్తారు
- చదువుకు తావుండదు.. పనికి వీలుండదు
- శాంతి కోసం భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది
- ఆఫ్ఘనిస్థాన్ మహిళల భయాందోళన



> తాలిబన్లు ప్రజలను చంపడం ఆపేస్తారని, దేశంలో శాంతి నెలకొంటుందంటే నాకు సంతోషమే. అయితే ఆ మిలిటెంట్లు తిరిగి అధికారంలోకి వస్తే పరిస్థితి ఏమిటన్నదే నా ఆందోళన. నువ్వు ఇంట్లోనే కూర్చో.. అని వారు చెప్తే నా పరిస్థితి ఏంటి? నా కుటుంబాన్ని ఎలా పోషించాలి. దేశంలో నాలాంటి వాళ్లు ఎంతో మంది ఉన్నారు. వారందరి భయమూ ఇదే
>
> – అక్రిమి, సేల్స్‌వుమన్

> తాలిబన్లు తిరిగి అధికారంలోకి వస్తే మహిళల హక్కులపై ప్రభావం పడుతుంది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఉండవు. తాలిబన్ల మనస్తత్వంలో ఎలాంటి మార్పు లేదు. వారి చరిత్రను చూస్తే.. నాకైతే ఆశ లేదు. పనిచేసుకునే నాలాంటి మహిళలకు గడ్డు పరిస్థితి ఎదురుకానుంది
>
> – తహెరా రెజాయ్, కాబూల్

**కాబూల్:** అమెరికా, తాలిబన్ల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి వీచికలపై కొత్త ఆశలు చిగురింపజేయగా, అక్కడి మహిళల్లో మాత్రం భయాందోళనలను రేకెత్తిస్తున్నది. ఒప్పందం మేరకు అమెరికా సేనలు ఆఫ్ఘన్‌ను వీడనున్న నేపథ్యంలో దేశంలో మళ్లీ తాలిబన్లు రాజ్యమేలుతారన్న ఆందోళన వారిలో నెలకొన్నది. పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోతామని మహిళలు ఆందోళన చెందుతున్నారు. శాంతి పవనాలను ఆస్వాదించేందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందేమోనన్న అనుమానం వారి మెదళ్లను తొలుస్తున్నది. స్వేచ్ఛను హరించే శాంతి తమకు అవసరం లేదని వారు చెప్తున్నారు.

**తాలిబన్ల అంతంతో మహిళల జీవితాల్లో మార్పు**

నిత్యం బాంబు పేలుళ్లు, తుపాకీ మోతలు, ఆత్మాహుతి దాడులతో ఏండ్లుగా రక్తపుటేర్లు పారుతున్న ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతికి మార్గం సుగమం చేస్తూ తాలిబన్, అమెరికా మధ్య శనివారం చారిత్రాత్మక శాంతి ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. 2001లో అమెరికా దండెత్తే ముందు వరకు ఆఫ్ఘన్‌ను ఐదేండ్ల పాటు తాలిబన్లు ఉక్కుపిడికిలితో పాలించారు. షరియా చట్టాన్ని కఠినంగా అమలు చేశారు. మహిళల పరిస్థితి ఖైదీల మాదిరిగా తయారైంది. తాలిబన్ పాలన అంతం కావడంతో వారి జీవితాలు మారాయి.

**వెంటాడుతున్న భయం**

శాంతి ఒప్పందం కుదుర్చుకునే సమయంలో మహిళల హక్కుల పరిరక్షణపై తాలిబన్లు అస్పష్ట హామీ ఇచ్చారు. ఇస్లామిక్ విలువలకు అనుగుణంగా నడుచుకుంటామని చెప్పారు. దీనిపై భిన్న అర్థాలు వినిపిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌లో చాలా ప్రాంతాలు తాలిబన్ల నియంత్రణలో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో బాలికలను ప్రాథమిక పాఠశాలల్లోకి అనుమతిస్తున్నా.. మహిళలపై కొరడా ఝుళిపించడం, బహిరంగంగా రాళ్లు విసరడం వంటి ఘటనలు జరుగుతుండడంతో తాలిబన్లు మళ్లీ అధికారంలోకి వస్తే పాత కథే పునరావృతమవుతుందనే భయం వెంటాడుతున్నది.

**యువతరం మారింది..**

తాలిబన్‌కు పుట్టినిల్లయిన కాందహార్‌కు చెందిన విద్యార్థిని పర్వానా హుస్సేనీ (17) స్పందిస్తూ.. 'నేనేమీ ఆందోళన చెందడం లేదు. తాలిబన్లు ఎవరు? వాళ్లు మా సోదరులు. మేమంతా ఆఫ్ఘన్ ప్రజలం. మేం శాంతి కోరుకుంటున్నాం. యువతరం మారింది. తాలిబన్లు వారి సిద్ధాంతాలను తమపై రుద్దడాన్ని యువత ఒప్పుకోదు' అని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే తాలిబన్ పాలనను చూసిన వారు మాత్రం.. వారు వస్తే ఆ చీకటి, బాధాకర జ్ఞాపకాలను తిరిగి తేవడం తప్ప మరేమీ జరుగదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి ఒక్కరూ శాంతిని కోరుకుంటున్నారని, అయితే తాలిబన్ల పునరాగమనాన్ని కాదని చెప్తున్నారు. ఈ శాంతి తమకొద్దు అని పేర్కొంటున్నారు.

### తాలిబన్ నాయకులతో త్వరలో సమావేశం: ట్రంప్

తాలిబన్ నేతలతో త్వరలోనే సమావేశం కానున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. తాలిబన్లు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారని భావిస్తున్నానని చెప్పారు. ట్రంప్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఆఫ్ఘన్ నుంచి తమ సైనికులను వెనక్కి రప్పించే సమయం ఆసన్నమైందని చెప్పారు. ఉగ్రవాద ఏరివేత బాధ్యతలను ఇక ఇతరులు చేపట్టే సమయం వచ్చిందని, అది తాలిబన్ కావచ్చు, ఆ చుట్టుపక్కల దేశాలు కావొచ్చని పేర్కొన్నారు. కాగా, శాంతి ఒప్పందానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. వచ్చేవారం ఆఫ్ఘన్ ప్రభుత్వం, తాలిబన్ మధ్య చర్చలు ప్రారంభం కావాల్సి ఉండగా, తాలిబన్ ఖైదీలను తాము విడుదల చేయబోమని ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ ఆదివారం ప్రకటించారు. ఖైదీల విడుదల అన్నది చర్చల్లో భాగంగా ఉండాలి కానీ, ముందస్తు షరతుగా ఉండకూడదన్నారు. అమెరికా ఆ హామీ ఇవ్వాల్సింది కాదన్నారు.

## మలేషియా కొత్త ప్రధాని ముహియుద్దీన్

**కౌలాలంపూర్:** మలేషియా ఎనిమిదవ ప్రధానిగా ముహియుద్దీన్ యాసిన్ (72) ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కౌలాలంపూర్‌లోని రాజసౌధంలో రాజు సుల్తాన్ అబ్దుల్లా సుల్తాన్ అహ్మద్ షా సమక్షంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. కాగా, అవినీతి కుంభకోణంతో ప్రమేయమున్న యూఎంఎన్‌వో కూటమి తిరిగి అధికారంలోకి రావడంపై మలేషియాలో నిరసనలు వెల్లువెత్తాయి. ప్రధాని పదవికి రాజీనామా చేసి రాజకీయ సంక్షోభానికి కారణమైన మహతీర్ మహ్మద్, పార్లమెంట్‌లో బలనిరూపణ కోరతానని, ముహియుద్దీన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతానన్నారు.



గోటబయ

## శ్రీలంక పార్లమెంట్ రద్దు!

**కొలంబో:** శ్రీలంక పార్లమెంట్ రద్దుకానున్నది. అధ్యక్షుడు గోటబయ రాజపక్స ముందస్తు ఎన్నికలకు వెళ్లే యోచనలో ఉన్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి దినేశ్ గుణవర్ధన తెలిపారు. శ్రీలంకలో ఈ ఏడాది ఆగస్టులో సాధారణ ఎన్నికలు జరుగాల్సి ఉన్నది. గత ప్రభుత్వం ఆర్టికల్ 19ఏను సవరించి పెద్ద తప్పు చేసిందని రాజపక్స భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా ప్రజాతీర్పును కోరాలని నిర్ణయించినట్లు దినేశ్ చెప్పారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత నిర్ణయం వెలువడే అవకాశమున్నదని రాజకీయ వర్గాలు పేర్కొన్నాయి. ముందస్తు ఎన్నికల నిర్వహణకు ఆ దేశ ఎన్నికల సంఘం సన్నద్ధమవుతున్నది.

## కపిల్ మిశ్రా ఉన్న పార్టీలో నేనుండను

### బీజేపీకి బెంగాలీ నటి సుభద్రా ముఖర్జీ గుడ్‌బై



**కోల్‌కతా:** ప్రముఖ బెంగాల్ నటి సుభద్రా ముఖర్జీ బీజేపీకి గుడ్‌బై చెప్పారు. ఢిల్లీ అల్లర్లలో 40 మందికిపైగా మరణించడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన అనురాగ్ ఠాకూర్, కపిల్ మిశ్రా ఉండే పార్టీలో తాను ఉండలేనన్నారు. ఈ నేపథ్యంలో బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్‌కు శనివారం రాజీనామా లేఖను పంపినట్లు సుభద్రా ముఖర్జీ చెప్పారు. 2013లో తాను బీజేపీలో చేరానని, అయితే ప్రస్తుతం పార్టీ తీరు పట్ల కలత చెందినట్లు ఆమె పేర్కొన్నారు. పార్టీ నేతలు ద్వేషపూరితంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలను మతపరంగా విభజిస్తున్నారని ఆరోపించారు. ద్వేషపూరిత ప్రసంగాలు చేసిన అనురాగ్ ఠాకూర్, కపిల్ మిశ్రాలపై బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సుభద్రా ముఖర్జీ ప్రశ్నించారు.

# ప్రశాంతంగా ఢిల్లీ

- పెరిగిన ప్రజల కదలికలు
- భారీగా పోలీసుల మోహరింపు
- షాహీన్ బాగ్‌లో 144 సెక్షన్




ముస్తాఫాబాద్‌లో ఓ ఎన్జీవో అందిస్తున్న ఆహారపదార్థాల కోసం బారులు తీరిన అల్లర్ల బాధితులు

**న్యూఢిల్లీ, మార్చి 1:** ఈశాన్య ఢిల్లీ కోలుకుంటున్నది. క్రమంగా ప్రశాంత వాతావరణం ఏర్పడుతున్నది. వారం రోజులుగా ఇండ్లకే పరిమితమైన ప్రజలు నిత్యావసర వస్తువులు, ఇతర అవసరాల కోసం బయటకు వస్తున్నారు. వాహనాల రాకపోకలు పెరిగాయి. దాడులు జరిగిన ప్రాంతాల్లో భారీగా పోలీసు, భద్రతా సిబ్బందిని మోహరించారు. షాహీన్‌బాగ్‌లో ముందు జాగ్రత్తగా పోలీసులు ఆదివారం 144 సెక్షన్ విధించారు.

**నాలుగు మృతదేహాల వెలికితీత**

గోకల్‌పురి, శివ్ విహార్ ప్రాంతాల్లోని మురికి కాలువల నుంచి సహాయ సిబ్బంది ఆదివారం మరో నాలుగు మృతదేహాలను వెలికి తీశారు. ముస్తాఫాబాద్ ప్రాంత వాసులు ఆచితూచి బయటకు వస్తున్నారు. ఢిల్లీ నగర పోలీసు కమిషనర్ ఎస్ఎన్ శ్రీవాత్సవ మాట్లాడుతూ ఢిల్లీలో మత సామరస్యం నెలకొల్పడమే తన ప్రాధాన్యమన్నారు. సీనియర్ పోలీసు అధికారులు స్థానికులతో సామూహిక సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటివరకు 254 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 903 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హింసాకాండపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్చార్సీ) రెండు నిజ నిర్ధారణ కమిటీలను నియమించింది. ఈశాన్య ప్రాంత స్కూళ్లలో ఇప్పటికే వార్షిక పరీక్షలను వాయిదా వేశారు. మరోసారి వాయిదా వేయడం వల్ల విద్యార్థులు.. నీట్, ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే అవకాశాలపై ప్రభావం పడుతుందని సీబీఎస్‌ఈ ఆందోళన వ్యక్తంచేసింది. ఈశాన్య, తూర్పు ఢిల్లీ ప్రాంతాల్లో 10వ, 12వ తరగతి పరీక్షలను గత నెల 29 వరకు సీబీఎస్‌ఈ వాయిదా వేసింది. కాగా, వివిధ స్వచ్ఛంద సంస్థల వలంటీర్లు బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్నారు. బాధితులకు అవసరమైన సహాయ సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటానని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

**బాధిత ప్రాంతాల్లో శ్రీశ్రీ రవిశంకర్ పర్యటన**

ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ హింసాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులు తీవ్ర వేదనకు గురయ్యారని, వారికి ఉపశమనం కలిగించాల్సి ఉన్నదన్నారు. మరోవైపు సీఏఏ వ్యతిరేక నిరసనలకు కేంద్రమైన షాహీన్‌బాగ్‌లో పోలీసులు ఆదివారం 144 సెక్షన్ విధించారు. ఆందోళనకారులను ఖాళీ చేయించేందుకు ఆదివారం ప్రదర్శన జరుపుతామన్న 'హిందూసేన'.. శనివారం పోలీసులతో సంప్రదింపుల తర్వాత నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నది. అయినప్పటికీ పోలీసులు భారీగా మోహరించారు.



## ప్రతి శరణార్థికి పౌరసత్వం!

**కోల్‌కతా:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) ద్వారా దేశంలోని శరణార్థులందరికీ పౌరసత్వం ఇచ్చే వరకూ తమ ప్రభుత్వం విశ్రమించబోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని షాహిద్ మినార్ గ్రౌండ్‌లో సీఏఏకు అనుకూలంగా ఆదివారం నిర్వహించిన ఓ సభలో ఆయన మాట్లాడారు. తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)తో పాటు ప్రతిపక్షాలన్నీ సీఏఏపై తప్పుడు ప్రచారం చేస్తూ శరణార్థులను, మైనార్టీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. సీఏఏకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు హింసాత్మకం అయ్యేలా టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అల్లరిమూకల్ని రెచ్చగొట్టారన్నారు. అమిత్ షా వ్యాఖ్యలపై టీఎంసీ ప్రతిదాడికి దిగింది. తమ రాష్ట్రం గురించి పక్కన బెట్టి.. ఢిల్లీలో శాంతి భద్రతలను పరిరక్షించాలని హితవు పలికింది. మరోపైపు, అమిత్‌షా సభ జరిగిన షాహిద్ మినార్ గ్రౌండ్‌కు వెళుతూ కొందరు బీజేపీ కార్యకర్తలు 'గోలీ మారో..' నినాదాలు చేయడం కనిపించింది.

## రెండు గూడ్స్ రైళ్ల ఢీ.. ముగ్గురు మృతి

**సింగ్రౌలి:** మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలి జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. మృతుల్లో ఇద్దరు డ్రైవర్లు, ఒకరు రైల్వే వాచ్‌మన్ ఉన్నారు. ఈ రైల్వేట్రాక్‌ను ఎన్టీపీసీ నిర్వహిస్తున్నది. మధ్యప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు బొగ్గు రవాణా కోసం దీన్ని వినియోగిస్తున్నది. ప్రమాదానికి రైల్వేశాఖకు ఎలాంటి సంబంధం లేదని, ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని తూర్పు మధ్య రైల్వే చీఫ్ పీఆర్వో రాజేశ్‌కుమార్ తెలిపారు.

## కేరళ చర్చి ఫాదర్‌ను బహిష్కరించిన పోప్

**కొచ్చి:** పదహారేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేరళ చర్చి ఫాదర్‌ను పోప్ ఫ్రాన్సిస్ బహిష్కరించారు. చిన్నపిల్లలపై లైంగికదాడులకు పాల్పడేవారిని సహించకూడదనే విధానంలో భాగంగా అతడిని విధుల నుంచి తొలగించినట్టు చర్చి అధికారులు తెలిపారు. బాలిక(16)ను గర్భవతిని చేసిన నేరానికి సైరో మలబార్ క్యాథలిక్ చర్చి ఫాదర్ రాబిన్ వడకుంచెరి (50) ప్రస్తుతం జైల్లో ఉన్నారు.

## టర్కీ సరిహద్దుల్లో శరణార్థుల వెల్లువ

**కస్తనీస్ (గ్రీస్):** ఐరోపాలో ప్రవేశించేందుకు వచ్చే వలసదారులు, శరణార్థులకు పశ్చిమ సరిహద్దులు తెరుస్తామని టర్కీ అధికారికంగా ప్రకటించడంతో గ్రీస్‌ను ఆనుకుని ఉన్న టర్కీ సరిహద్దు వద్ద సుమారు 13,000 మంది వలసదారులు వేచిచూస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి శరణార్థి సంస్థ ఆదివారం తెలిపింది. అయితే శరణార్థులు వెల్లువెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ఐరోపా దేశాలపై ఒత్తిడి పెరుగనుంది.

## సిరియాపై టర్కీ ప్రతీకార దాడి

**బీరుట్:** సిరియాపై టర్కీ శనివారం ప్రతీకార దాడిచేసింది. సిరియా ప్రభుత్వ దళాలు గురువారం జరిపిన వైమానికదాడిలో 33 మంది టర్కీ సైనికులు మరణించారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ హెచ్చరించారు. సిరియా ఇడ్లిబ్‌లోని పాలనాదళాల స్థావరాలను లక్ష్యంగా చేసుకొని టర్కీ డ్రోన్లతో దాడులు జరుపగా 26 మంది సిరియా సైనికులు మరణించారు.



## భగీరథ ప్రస్థానం

శ్రీ కాళేశ్వర పాదమున్ దడిపి లక్ష్మీభారతీ పార్వతీ
ప్రాకట్యంపు బరాజులన్ గదలి, ఎల్లంపల్లి మేడారపున్
వాక ల్దాకుచు పొంగి, రామడుగు పంపౌజున్ కళన్నింపి, వా
ణీ కారుణ్యము వోలె పారి, మరి మానేరున్ భళీ చేరి, బ
ల్వీకన్ మల్లన సాగరమ్ము గనుచున్ శ్రీ కొండ పోచమ్మ గొ
ప్పౌ కొప్పంది, సుచంద్ర శేఖర ధరా పర్వము గల్పించె, గో
దా కూలంకష పెక్కుభంగులు ప్రభుత్వ శ్రీల అభ్యున్నతుల్



డాక్టర్ జి.యం. రామశర్మ, శతావధాని

# సాహిత్యంలో మన సంస్కృతి

**సాహిత్యం వారసత్వ సంపద. ఆయాకాలాల ప్రజల అనుభవాల, భావాల, అభి రుచుల, ఇష్టానిష్టాల, సుఖదుఃఖాల, భౌతిక ఆధ్యాత్మిక విషయాల సంపుటీకరణమే సాహిత్యం. సాహిత్యంలో అంతర్భాగాలైన పదజాలం, సామెతలు, కవిత్వం ప్రతిదానిలోను ఏదో కొంత సాంస్కృతిక విశేషం లభించవచ్చు. కాలపరిణామంలో, ఆచార సంప్రదాయాల్లో, జీవన సరళిలో ఎన్నోరకాల మార్పు లు చోటుచేసుకోవచ్చు. కొన్ని పూర్తిగా పోవచ్చు. పాక్షికంగా మారవచ్చు. కొత్తవి ప్రారంభం కావచ్చు. వీటికి పరిసర ప్రాంతీయ భాషా సాహిత్య మత వ్యాపార సంబంధాల హేతువు కావచ్చు. దాడులు కావచ్చు. పాలకసంస్కృతి ఆచారాల అనుకరణలు కావచ్చు. సాహిత్యం సంస్కృతీపరిణామాల అవగాహనకు ఆధారభూతంగా ఎలా నిలుస్తుందో వైవిధ్యభరితమైన అంశాలు మచ్చుకు కొన్ని..**

ఈ పిల్ల పదహారణాల తెలుగు అమ్మాయి. 'పిల్ల' పదం ఏనాటిది? శాతవాహన కాలంనాటి 'గాథాసప్తశతి'లో తొలిసారి కనిపిస్తుంది. అంతకుముందే జన వ్యవహారంలో నిత్యం వాడుకలో ఉన్న పదం. అంటే ఒక పదం వెనుక వేల ఏళ్ళ చరిత్ర ఉన్నట్లే కదా. మరి 'పదహారణాల తెలుగు అమ్మాయి' అని ఎందుకనాలి? పదిహేడు అనవచ్చు. పద్నాలుగు అనవచ్చు, 20 అణాలు అనవచ్చు కదా!

నిజాం కాలంలో ఉన్న ద్రవ్య మారకం ఇది. 'అణా' అంటే ఆరు పైసలు. 16 అణాలు అంటే 96 పైసలు. నిజాంకాలంలో 96 పైసలే రూపాయి కింద లెక్క. బ్రిటిషాంధ్రలో నూరుపైసలకు రూపాయి. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ ముఖ్యమంత్రి అయినప్పుడు నిజాం 'రుపీ' ని బ్రిటిష్ 'రూపాయి'ని సమానం చేశారు. అయితే జనంలో సెంట్ పర్సెంట్ (నూటికి నూరుశాతం) అనే దగ్గర పదహారణాలు అనే జాతీయమే వాడుకలో ఉంది. మనం 25 పైసలకు చారాణా (4x6= 24 పైసలు) అనీ, 50 పైసలకు (8x6 = 48) ఆఠాణా, 75పైసలకు (12 x 6=72) బారాణా అనీ వ్యవహారానికి వాడుతూ సర్దుకు న్నాం. ఇది చరిత్రలోని ఒక పరిణామానికి సాక్ష్యం.



ఈ రోజు పెళ్ళిలో మాంగల్యధారణ అన్నది ప్రధానాంశం. నిజానికి ముహూర్తం అంటే నిర్దేశిత సమయమేం కాదు. దాదాపు 40 నిమిషాలు ఉంటుంది. పురోహితులు సరిగ్గా మధ్యలో ముహూర్తం పెడతారు. మన సౌకర్యం కోసం కాస్త అటూ ఇటూ అయినా పరవాలేదు. ఆ మూహుర్తంలో కూడా జిలకర బెల్లం పెట్టడమే ముఖ్యం తప్ప మాంగల్యధారణ కాదు. జిలకరబెల్లం, సప్తపది, హోమం ఇవే పెళ్ళికి మూలం. మాంగల్యధారణ తర్వాత కాలంలో వచ్చిన దాక్షిణాత్య ఆచా రం. దీని కాలం ఎప్పటిది అని తెలుసుకోవాలంటే సాహిత్యాధారం తోడ్పడుతుంది. తిక్కన.. ఉత్తరాభిమన్యుల వివాహంలో తలంబ్రాలు పోసుకోవడాన్ని వర్ణించాడే తప్ప మాంగల్యధారణ వర్ణించలేదు. పోతన భాగవతంలో..

*'మ్రింగెడువాడు విభుండని*
*మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్*
*మ్రింగుమనె సర్వమంగళ*
*మంగళ సూత్రంబు నెంతమది నమ్మినదో '(భాగవతం.8-241)*

అని స్పష్టంగా మాంగల్యధారణను చెప్పాడు. అంటే తిక్కన నాటికి లేకుండా పోతనకాలం నాటికి మధ్యలో ఈ ఆచారం వచ్చి స్థిరపడిందని ఊహించాలి. లలితా సహస్రనామం అందరూ పారాయణం చేస్తుంటారు. బ్రహ్మాండ పురాణం ఉత్తరభాగంలో లలితాసహస్రనామం ఉంది. అందులో 'కామేశబద్ధమాంగల్య సూత్రశోభిత కంధరా' అని వస్తుంది. శివుడు పార్వతిమెడలో మంగళసూత్రం కట్టాడని భావం. 'బ్రహ్మాండ పురాణం' గుప్తుల కాలంలో రాయబడిందంటారు. మరి అప్పుడు ఈ ఆచారం ఉందా? ఉన్నట్లు ఆధారాలు లేవు. ఎవరో భక్తాగ్రగణ్యుడు లలితాసహస్ర నామాన్ని బ్రహ్మాండపురాణంలో దూర్చడంలో విజయం సాధించాడు. ఇలా మధ్యలో చేర్చిన వాటిని ప్రక్షిప్తాలని పిలుస్తాం.

*'చేతులారంగ శివుని పూజింపడేని -*
*నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని*
*దయయు సత్యంబు లోనుగా దలపడేని*
*కలుగ నేటికి తల్లుల కడుపు చేటు..'*

అందరికీ తెలిసిన పోతన పద్యం ఇది. సాధారణంగా అర్థం చెప్పేస్తారు. కాని ఇందులో ఒక సంస్కృతీ విశేషాన్ని పోతన నిక్షిప్తం చేశాడని గమనిస్తే మరింత ఆనందం కలుగుతుంది. అభిషేకప్రియుడు శివుడు, కనుక శివాలయానికి వెళ్ళి శివుని నెత్తి మీద నీళ్లు పోయాలి. ఎందుకు గరళతాపహరణార్థం. అది చేతులారంగ చేయాల్సిందే. విష్ణువు సంకీర్తన ప్రియుడు. అందుకే విష్ణువుకు సుప్రభాతాలు, సహస్రనామాదులు ఉంటాయి. అవన్నీ నోరు నొవ్వంగ చేయాల్సిందే. చేతులారంగ హరిని పూజింపడేని నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని.. అంటే ఛందస్సు సరిపోవచ్చు. కాని భావం గంగలో కలుస్తుంది. సంప్రదాయం విచ్ఛిన్నమవుతుంది. అభిషేకప్రియుడు శివుడు. సంకీర్తన ప్రియుడు విష్ణువు. నమస్కారప్రియుడు సూర్యుడు. స్మరణప్రియుడు దత్తాత్రేయుడు. ఆయాదేవతల అభీష్టాల ప్రకారం పూజిస్తేనే మన అభీష్టాలు నెరవేరుతాయి.

*'కార్తికీవేళ భీమశంకరుని నగరం*
*దూఱునెవ్వాడు చిచ్చుఱతోరణంబు*
*వాడు దూఱడు ప్రాణనిర్యాణవేళ*
*ఘోరయమపట్టణద్వారతోరణంబు..'*
*(భీమేశ్వరపురాణం 3-25)*

దక్షారామ భీమేశ్వరునికి కార్తీక పౌర్ణమి నాడు రాత్రి జ్వాలాతోరణం ఏర్పరుస్తారట. దాని గుండా దూరి పోతే భక్తుడు యమలోకంలోకి పోడు. అంటే పుణ్యం వస్తుందని విశ్వాసం. దీన్ని శ్రీనాథుడు 'కాశీఖండం'లో కూడా ప్రస్తావించాడు. ఇది నేటికీ సజీవంగా ఉన్న ఆచారం. శ్రీనాథునికన్నా ముందెప్పటినుంచి ఈ ఆచారం ఉందో నికరంగా తెలియకపోయినా శ్రీనాథునినుం చి నేటిదాక అవిచ్ఛిన్నంగా వస్తున్న ఆచారమని చెప్పటానికి ప్రబల సాక్ష్యం ఇది.

'ఏమి శకునమున చొచ్చితిమో కాశికి' అని అనడం వల్ల శకునాలను నమ్మడం కూడా ఆ సమాజంలో వుందని తెలుస్తుంది. భారతీయ సమాజంలో ఇది సామాన్యాంశమే. వ్యాసుడు అగస్త్యుడు దక్షారామానికి తిరిగి పోతున్నపుడు నగర ప్రవేశానికి శుభముహూర్తం (3-39),(3-56) చూశారు. ఏ ముహూర్తం సరి గా కుదరని పక్షంలో అభిజిన్ముహూర్తం మధ్యా హ్నం 11.45 నుంచి 12.30 వరకు నిస్సంకోచంగా చేయవచ్చు. అది విజయముహూర్తం అన్న విశ్వాసం నేటికీ ప్రబలంగానే ఉంది. యానాదు లు అని పిలువబడే నిరక్షరాస్య సంచారజాతులు గడ్డపారముహూర్తంలో పెళ్ళిచేసుకొంటారు. మిట్టమధ్యాహ్నం గడ్డపారను నిలబెడితే నీడ పడదు. అదే అక్షరాస్యుల అభిజిన్ముహూర్తం. సురవరంప్రతాపరెడ్డిగారు తమ **'ఆంధ్రుల సాంఘికచరిత్ర'** లో తెలుగువారి ఆచారవ్యవహారాలు, విశ్వాసాలు కుప్పలు పోశారు.

దుశ్శాలువలతో సత్కరిస్తామని సభల్లో ప్రకటిస్తుంటారు. దుశ్శాలు వ అంటే రెండు శాలువలని అర్థం. కాని ఒక శాలువాతోనే సత్కరిస్తారు. దీని వెనుక ఉన్న సంస్కృతి కోణం చూడాలి. సన్మానంలో రెండు శాలువలతో సత్కరించాలి. రెండు వస్త్రాలు ఒంటి మీద ఉండాలి. ఒంటిబట్ట అమంగళం. అశుభకార్యాల్లో అంటే దినాలప్పుడు ఒంటిపంచె పెడతారు. శుభకార్యాల్లో బట్టలజత పెడతారు. ఇది మన సంస్కృ తి.

దక్షారామ భీమేశ్వరునికి కార్తీక పౌర్ణమి నాడు రాత్రి జ్వాలాతోరణం ఏర్పరుస్తారట. దాని గుం డా దూరి పోతే భక్తుడు యమలోకంలోకి పోడు. అంటే పుణ్యం వస్తుందని విశ్వాసం. దీన్ని శ్రీనాథుడు 'కాశీఖండం'లో కూడ ప్రస్తావించాడు.

వెనుకటి కాలంలో మనపేరు మనం నేరుగా చెప్పడం సభ్యత కాదు. మనగురించి వేరే వారు చెప్పాలి. 'శృంగారనైషధం'లోని ఈ ఘట్టం చూడండి.. ఇంద్రాగ్నియమ వరుణులలో ఎవరినైన వరింపుమని దమయంతికి మారువేషంలో ఉన్న నలుడు చెప్తాడు. ఆమె **'భవాదృశంబైన నాయక రత్నంబు నే వంశంబు భరించె? నే వర్ణంబులు నీపుణ్యనామంబునకు ప్రకాశంబులైనయవి'** అని పేరు, వివరాలు అడుగుతుంది. అప్పుడు నలుడు తక్కువ వాడినైతే చెప్పడం భావ్యం కాదు. గొప్ప వాడినైతే స్వోత్కర్ష అవుతుంది అంటూ.. నలుడు ఇంకా ఇలా అంటాడు.

*'పేరడుగం దలంచెదవొ?*
*భీమతనూభవ! యావిచారముం*
*దూరము సేయు మెవ్వరికి*
*దోసము తాఁ దనపేరు సెప్పుటా*
*చారపరంపరా స్థితికి శాస్త్రము*
*మూలము, శాస్త్ర చోదితా*
*చార వివేక హీనుఁడగు జాల్మని మెత్తురె*
*పండితోత్తముల్.' (శృంగారనైషధం 4-56)*

తనపేరు తాను చెప్పుకోవడం శాస్త్రవిరుద్ధం, సంప్రదాయ విరుద్ధం. అది ఒక సంస్కృతి. ఒక్క తన పేరు మాత్రమే కాదు, భార్యాభర్తలు ఒకరినొకరు పేర్లు చెప్పుకోరు. అందుకు పెళ్ళయ్యాక అత్తగారింట్లో కాలు పెట్టేవేళ ఒకరినొకరు పేర్లు చెప్పిస్తారు. అదొక వేడుక.

*'అమరపతిన్ వరించెదవొ,*
*హవ్యవహున్ చరణంబు దొక్కెదో*
*శమనునిని జెట్టవట్టెదవొ,*
*సాగరవల్లభుపెండ్లి యాడెదో*
*ప్రమదము కౌతుకంబు*
*ననురాగము పెంపును సొంపు మీరగా*
*కమలదళాక్షి, యొక్కరుని గైకొనుమా,*
*యనుమానుమేటికిన్..'*
*(శృంగారనైషధం 4- 48)*

అని శ్రీనాథుడు వివాహక్రియకు పర్యాయాలుగా వరించు, చరణంబు ద్రొక్కు, చేయి పట్టుకొను, పెండ్లియాడు, నాలుగు పదాలను వాడాడు. కాలు తొక్కుట, చేయిపట్టుకొనుట అనే ఆచారాలు నుడికారాలుగా శ్రీనాథుని నాటికే స్థిరపడ్డాయనడానికి ఈ పద్యం సాక్ష్యం.

రామాయణంలో రావణాసురుడు చనిపోతాడు. శ్రీరాముడు విభీషణునితో చెప్పి అంత్యక్రియలకు ఏర్పాటు చేయిస్తు మరణాంతాని వైరాణి అంటాడు.ఇది మనసంస్కృతి. బతికున్నంత వరకే వైరం. చనిపోయినవాడిని గురించి చెడ్డగా చెప్పకూడదు.

విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలు నవలలో భారతీయ సంస్కృతికి పాశ్చా త్య సంస్కృతికి భేదాలను చెప్తా డు. ఒక ఆధ్యాపకుడు పిల్లలను విహారయాత్రకు తీసుకెళ్తాడు. వారిలో నలుగురు నదిలో పడి చనిపోతారు.దాంతో టీచర్ కూడా తీవ్ర దుఃఖంతో నదిలో దూకి చనిపోతాడు. ఇది విన్న పాశ్చాత్యుడు 'వాట్ ఏ బ్యూటిఫుల్ స్టోరీ' అని స్పందిస్తే, తెలుగు వాడు మాత్రం 'అయ్యోపాపం' అని సహానుభూతి పొందుతాడు. చనిపోవడంలో సౌందర్యాన్ని పాశ్చాత్యుడు చూశాడు. ఆ విషాదం తో సహానుభూతి పొందాడు తెలుగువాడు. ఇది రెండు జాతుల సంస్కృతుల్లో ఉన్న తేడా. ఇలా సాహిత్యం సాంస్కృతిక అంశాలను తర్వాతి తరానికి అందిస్తుంది. వాటిని గమనించే ఓపిక, కోరిక మనకుండాలి. అలవోకగా ఎన్నెన్నో అంశాలు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగిస్తాయి.

**- ఆచార్య వెలుదండ నిత్యానందరావు,**
**94416 66881**



# లోకహిత ముక్తకాలు

**'భూమిలో ఎంత నిస్సహయత / చెట్టులో ఎంత స్వార్థం**
**పుట్టుక భూమిలోంచే అయినా / ఆకాశాన్ని అందుకోవాలనే తపన..'**

నలభైఏళ్ళు దాటినా ఈ వాక్యం తనకు వార్ధక్యం లేదన్న నమ్మకాన్ని ఇచ్చింది. బతుకంతా వాక్యాన్ని పట్టుకుని మానేరు తీరం వెంట, మనిషి లోపలి మర్మాన్ని పొడుకుంటూ, అక్షరాల చెలిమెలు తోడి గొంతుకలను తడుపుతూ సాగుతున్నాడు వారాల ఆనంద్. వాక్యం రసాత్మకం ఎలా అవుతుందో, రసం అనుభూతి లయగా ఎలా ధ్వనిస్తుందో ఆ రహస్యం ఆనంద్‌కు తెలుసు.

ప్రతీకలతో పోహళింపుల నుంచి, అభివ్యక్తుల ఆర్భాటాల నుంచి, ఛందో బందోబస్తుల నుంచి విముక్తమైన విస్పష్ట భావ వ్యక్తీకరణలను స్వాతి చినుకుల్లా రసహృదయాల్లో వదిలి 'ము(త్యాల్లా)క్తకాల్లా 'పొదిగాడు వారాల ఆనంద్.

బతుకు రుచుల ప్రతిఫలనాలు, సున్నితమైన అనుబంధాల ప్రతిబింబాలు, మనసులను ఉల్లాస భరితం చేసే చమత్కారాలు, అధిక్షేపాన్ని దూసే వ్యంగ్యాలు ఈ ముక్తకాల్లో మెరుస్తాయి.

చంచల స్వభావం ఉన్న మనసు గురించి..

**'గాలి కదలికకో ఆకు సవ్వడికో ఏకాగ్రత చెడితే నేరం మనసుదే**
**గాలినో ఆకునో నిందించకు..'** అంటాడు. చాపల్యాన్ని మనసులో దాచుకుని నెపం మరొక దానిపై నెట్టడం స్వభావం అవుతున్న స్థితిని కళ్ళకు కడుతుంది.

**'ప్రేమికుడు అంకెల చిట్టా కాదు జమా ఖర్చు చూడడానికి**
**ప్రేమది ఒకేదారి ఇవ్వడమే తెలిసిన రహదారి..'** అంటూ ప్రేమ అంతర్యాన్ని విప్పి చెబుతాడు. ఊపు కోసం ఒక్కొక్క 'ముక్తకం'లో ప్రాసను ఆశ్రయించినా తూగును ప్రతిపంక్తిలో నిక్షిప్తం చేస్తాడు. కనుకొలకుల్లో తడిని, ఒంటరి తనపు తాత్వికతను, ప్రేమను మరిచిన వెర్రి వెతుకులాటలను లోతుగా తడిమిన వాక్యాలు మనసు ఆలోచింపజేస్తాయి.

తాను స్పందిస్తూ మన హృదయ స్పందనలను తన వాక్యాలతో గణిస్తాడు. ప్రేమ, కన్నీళ్లు, తడి, పలు ముక్తకాలలో ప్రధాన భూమికలు వహిస్తాయి. పోలికలు ఉపమానాలు పదచిత్రాలు రచనకు ఆలంబనగా తీసుకున్నా వాటి సహజమైన అమరిక వల్ల ఆయా పంక్తుల లక్ష్యాలను ప్రతిఫలించడం విశేషంగా కనిపిస్తుంది.

సంక్షిప్తతా నియమాన్ని అనివార్యంగా కొన్నిచోట్ల అతిక్రమించి, విరామచిహ్నాలు లేని ముక్తకాలుగ ప్రదర్శిస్తాడు. అది అటుంచితే.. అంతర్లీనంగా ఒక తాత్విక రహస్యాన్ని, సాత్విక సత్యాన్ని, సామరస్య పరిమళాన్ని చివరిదాకా అందిస్తూ సాగిపోతాడు.

తాను స్పందిస్తూ మన హృదయ స్పందనలను తన వాక్యాలతో గణిస్తాడు.

ప్రేమ, కన్నీళ్లు, తడి, పలు ముక్తకాలలో ప్రధాన భూమికలు వహిస్తాయి. పోలికలు ఉపమానాలు పదచిత్రాలు రచనకు ఆలంబనగా తీసుకున్నా వాటి సహజమైన అమరిక వల్ల ఆయా పంక్తుల లక్ష్యాలను ప్రతిఫలించడం విశేషంగా కనిపిస్తుంది.

**'సముద్రం గాంభీర్యమే, నిశ్శబ్దం కాదు నేనూ అంతే**
**ఇద్దరిలోనూ పడి లేచే గుణమూ, నిరంతర రణమూ ఉన్నాయి..'** అంటూ ఘర్షించే తన స్వభావాన్ని సముద్రంతో పోల్చి చెబుతాడు.


సాలీడు ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసం బలాన్ని గురించి తెలిపినప్పుడు మనసులో నాటుకునేలా ఈ ముక్తకాలు చుట్టుకుంటాయి. ద్వేషం గురించి ప్రేమ గురించి తడి గురించి పేర్చిన ముత్యాలు అడుగడుగునా ఎదురుపడుతయ్.

**'పూలు ముళ్ళు కుప్ప పోసినట్టు ఎన్ని అనుభవాలో**
**నేనేమో ఒక్కొక్క పువ్వు ఏరుకుని దాచుకుంటాను**
**ఎవరైనా అంతే చేదు అనుభవాలను కూడా పాఠాలుగా స్వీకరించాలి కదా !'**

విమర్శను ఆహ్వానించిన అవసరాన్ని, లోపలి ఖాళీలను తెలుసుకోవాల్సిన ఆరాటాన్ని గుర్తెరిగిన కవిగా వారాల ఆనంద్ మనిషి స్థితిని, జీవన తాత్వికతను, అనుబంధగంధాల అవసరాన్ని, స్నేహంలో నిజాయితీని కన్నీళ్ల లోతులను తన అనుభవం లోంచి తోడి మన అనుభవాల ముందు నిలబెడతాడు. ఆలోచింపజేస్తాడు.

ఈ ముక్తకాలు కేవలం రసాత్మకాలుగానే గాక చక్కని సుభాషితాలుగా, లోకహితాలుగా నిలబడతాయి. సద్వర్తనను నిలబెడతాయి. ఆర్భాటంలేని వాక్యాలతో ఆకట్టుకునే అమరికతో, చక్కటి అనువాదంతో కూర్చినవే ఈ **'ముక్తకాలు'**.

**- వర్ధుల శివకుమార్, 94418 83210**



# ఇల్లు

ఇల్లంటే..
గోడలు కాదు
వాటి మధ్యన కదలాడే
మమతల నీడలు

ఇల్లంటే..
పాతేసుకున్న కుర్చీలు కాదు
ప్రవహించే విశ్వవిహారాలు
తలుపులు మూస్తే ఎలా!
రెప్పలకు
చూపులే తోరణాలు

ఇల్లంటే..
జననాలూ, పురుటి కేకలు
మరణాలూ
అవధులు లేని రోదనలు,
మూలమూలలా పాకుతున్న
జ్ఞాపకాలు

ఇల్లంటే..
రోదలూ వ్యథలూ
అలవిగాని నిశ్శబ్దాలు

ఇల్లంటే..
సూర్యుడు
అనుమతి కోరే ప్రదేశాలు
చినుకులు
ఎంత ఉరుకులాడినా
అందని సందేశాలు
ఇల్లంటే..
ప్రేమలూ అనురాగాలు
భావుకతను మేల్కొల్పే
నేపథ్య సంగీతాలు

ఇల్లంటే..
ఉద్వేగాలు
ఉద్యమ మూలాలు
అనుకొని పర్యవసానాలు

ఇల్లంటే..
పుస్తకాలు
నిరంతరం
గాలిలో నిండే జ్ఞాన ప్రసారాలు...

**- డాక్టర్ ఎన్.గోపీ**

# సినిమా!

**ఎందుకో నాత్రి**
ఎండితెర ఎదురుగా వుంది
దాసిపెట్టుకున్న
కొన్ని పాత రీళ్ళలోంచి
రాజనాల నువ్వుతుంటే
లేసి కూసున్నా..

మాసికల లాగు
గుండీలూడిన అంగి అదృశ్యమై
పట్టుబట్టలతో ప్రత్యక్షమైన రాజు
ప్రేమ్‌టాకీస్ నా భువనవిజయం!

బడి ఎగ్గొట్టిన మ్యాట్ని మాటున
తొలి ధిక్కార పతాకం సినిమా
పేడతట్టలు మోసుకొచ్చినా
పొయిలో కట్టెలు కొట్టుకొచ్చినా
దేవకన్య బి సరోజ
మధురవాణి సావిత్రి నవ్వు కోసమే!

దేవకన్యలతో రాజకుమారిలతో
రాత్రిని రాజ్యం చేసుకొని
తెల్లవార్లు పాలించేది!

నాలో నేను ఇంకొకడిగ ఉన్న రోజులు
వాడు బలవంతుడు, ప్రేమికుడు
వాడి ఆశ సీతాకోక చిలుకల ఆశ
కొన్ని చిత్రాలు
వాడు విహరించే పూల తోటలు..

పెదవుల మీన
తేనేటీగల కల కారుతుంటే
స్వర్గద్వారం తెరుచుకునేది..!

మంత్రాలు మహిమలు
నాకు కొత్తేమి కాదు
కాంతారావు దేహంలోకి
పరకాయ ప్రవేశం చేసేవాడ్ని
అప్పుడు నా అంతరం
అల్లావుద్దీన్ అద్భుతదీపం!

గట్కు గంజితో పాటు
జానపద కథలు తాగిన
చెరువో ఆకాశమో తెలియదు
నేనెక్కిన తెప్ప పుష్పకవిమానమే..!

రెండవ ఆట వదిలినంక కూడా
గుర్రం మీన్నే నా కోటకు వచ్చేది..!

**- మునాసు వెంకట్, 998481 58163**

## ప్రకటనలు

### 'వరదగూడు' ఆవిష్కరణ సభ

దక్కన్ సాహిత్య సభ, ఏవీ కళాశాల తెలుగుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో వై. సత్యనారాయణ రచించిన 'వరదగూడు' కవితా సంపుటి ఆవిష్కరణ 2020 మార్చి 5న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఏవీ కళాశాలలో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.గోపి, ఆచార్య కె.రామచంద్రారెడ్డి, డాక్టర్ పత్తిపాక మోహన్, డాక్టర్ కాంచనపల్లి, కె.రఘువీర్‌రెడ్డి, డాక్టర్ కె. గౌతమి, డాక్టర్ సీహెచ్ రాజలింగం, డాక్టర్ ఎస్.గోపీకృష్ణ, డాక్టర్ కె. లక్ష్మీవిజయ తదితరులు పాల్గొంటారు.

**-దక్కన్ సాహిత్య సభ**

### మధునాపంతుల శతజయంతి సదస్సు

కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి శత జయంతి సదస్సు ఆయన స్వగ్రామమైన తూర్పుగోదావరి జిల్లాలోని యానాం దగ్గరలోని పల్లిపాలెంలో 2020 మార్చి 5న జరుగుతుంది. ఈ సదస్సులో కె.శివారెడ్డి, మండలి బుద్ధప్రసాద్, రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, శిఖామణి, అప్పాజోస్యుల, రెంటాల, దేవదానం రాజు, సుధామ, రాపాక, లక్ష్మణ చక్రవర్తి తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా నూరుశరత్తుల మధునాపంతుల శతజయంతి రోజున ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తారు.

**-ఎంవీ చలపతి, మధునాపంతుల ఫౌండేషన్, పల్లిపాలెం**

### 'మాలపల్లె కథలు'ఆవిష్కరణ సభ

కవి, రచయిత భూతం ముత్యాలు రచించిన 'మాలపల్లె కథలు'ఆవిష్కరణ సభ 2020 మార్చి 7న మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్, ఓయూ లోని ఐసీఎస్ఎస్ఆర్ గెస్ట్‌హౌజ్‌లో జరుగుతుంది. డాక్టర్ జి.వి. రత్నాకర్ అధ్యక్షతన జరుగు సభలో అతిథులుగా జూపూడి ప్రభాకర్, సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ ఎండీ జునైద్ జాకీర్, అక్బర్, డాక్టర్ వెంకట్‌రావు, డాక్టర్ సవిన్ సౌడ, డాక్టర్ నిమ్మ బాబురావు, అంగరి ప్రదీప్ హాజరవుతారు. పుస్తకాన్ని డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆవిష్కరిస్తారు. సమన్వయకర్త-మంచాల లింగస్వామి.

**-ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఎంఎస్ఏ), హైదరాబాద్**

### దరఖాస్తులకు ఆహ్వానం

**'అర్పిత'** సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ ఏటా ప్రదానంచేసే జాతీయస్థాయి పురస్కారాలకు ఇరురాష్ర్టాల ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులను కోరుతున్నది. సమాజసేవ, పర్యావరణ పరిరక్షణ, విధినిర్వహణ, విద్య, వైద్యం, కళ, క్రీడ, సాహిత్యం, పరిశ్రమలు, వ్యవసాయం, సంగీతం వంటి పలురంగాల నుంచి ప్రతిభగల వారు దరఖాస్తులు 2020 మార్చి 5లోపు పంపించాలి. పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధారాలకు సంబంధించిన జిరాక్స్ కాపీలు ఉండాలి.
**చిరునామా:** అమృతకోర్ట్ అపార్ట్‌మెంట్, సీహెచ్-2, డోర్ నెం: 30-8-29/25, భాను స్ట్రీట్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం-20. వివరాలకు:9391379903

**-జి.భవాని, అర్పిత, కార్యనిర్వాహక కార్యదర్శి**

### రచనలకు ఆహ్వానం

డాక్టర్ సురభి లక్ష్మీశారద గారు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన కళాకారిణి. నాట్యకళాకారిణిగా ఆమె కృషి, ప్రతిభకు గౌరవ సూచకంగా తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఒక అభినందన సంచికను ప్రచురించాలని భావిస్తున్నది. కాబట్టి సన్నిహితులు, విద్యార్థులు, ఆమె కళాసృజన, ప్రతిభను ఎరిగిన వారి నుంచి, సంస్థల నుంచి వ్యాసాలను ఆహ్వానిస్తున్నది. రచనలను 2020 మార్చి నెలాఖరులోగా పంపించాలి.
**చిరునామా:** డాక్టర్ సురభి లక్ష్మీశారద, ఇంటి నెం:1-4-2/3/2, వీధినెం:4, నాగేశ్వరనగర్ కాలనీ, కొత్తపేట, హైదరాబాద్-35. సెల్: 9441618937

**-కర్నాటి గోవర్ధన్**

### మఖ్దూమ్ అవార్డు ప్రదానోత్సవ సభ

కవి,షాయరే తెలంగాణ మఖ్దూమ్ మొహియుద్దీన్ పేరిట సిటీ కాలేజీ నెలకొల్పిన నేషనల్ అవార్డు ప్రదానోత్సవ సభ 2020 మార్చి 4న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సిటీకాలేజీలోని గ్రేట్‌హాల్‌లో జరుగుతుంది. డాక్టర్ వి.విజయలక్ష్మి అధ్యక్షతన జరుగు సభలో గౌరవఅతిథులుగా డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ పాల్గొంటారు.

**నిర్వహణ-డాక్టర్ విప్లవ్‌దత్ శుక్లా, డాక్టర్ యాకూబ్**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com


నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో పర్యటిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నాగారం మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి


నిర్మల్ బస్టాండ్‌లో ప్రయాణికురాలితో మాట్లాడుతున్న దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


బడంగ్‌పేట పరిధిలోని సీవైఆర్ కాలనీలో పర్యటిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి. చిత్రంలో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

# చకచకా ప్రగతి పనులు

- పట్టణాల్లో విస్తృతంగా మంత్రుల పర్యటన
- సమస్యలు గుర్తించి పరిష్కారం
- పనిచేయని అధికారులపై చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


వరంగల్‌రూరల్ జిల్లా నర్సంపేటలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** పట్టణాలు, నగరాల్లో పట్టణ ప్రగతి పనులు చకచకా జరుగుతున్నాయి. గత ఏడు రోజులుగా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పారిశుద్ధ్య, అభివృద్ధి పనులతో కొత్తందాన్ని సంతరించుకొంటున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు నిత్యం ప్రగతి పనులను పర్యవేక్షిస్తున్నారు. పనిచేయని అధికారులు, ప్రజాప్రతినిధులపై అక్కడికక్కడే చర్యలు తీసుకొంటున్నారు. వెంటవెంటనే సమస్యలు పరిష్కారమవుతుండటంతో స్థానికులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

### పనిచేయకుంటే పదవిపోతది: ఎర్రబెల్లి

పని చేయకుంటే కౌన్సిలర్ల పదవి పోతదని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. ఆదివారం వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్‌తోపాలు వరంగల్ రూరల్ జిల్లా పరకాల, నర్సంపేట మున్సిపాలిటీలో ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పర్యటించారు. పరకాలలో 1, 2, 13, 18వ వార్డుల్లో 3 కిలోమీటర్ల మేర కాలి నడకన తిరిగారు. పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నర్సంపేట పట్టణ ప్రగతి కార్యక్రమానికి హాజరుకాని 1, 3, 6, 14, 15, 18, 19, 20, 22 వార్డుల కౌన్సిలర్లకు నోటీసులు ఇవ్వాలని ప్రత్యేక అధికారి శ్రీనివాసరావును మంత్రి ఆదేశించారు.

### ప్రజల్లో మార్పు రావాలి: నిరంజన్‌రెడ్డి

ప్రజల్లో 'మన ఇల్లు, మన వీధి, మన పట్టణం' అనే భావన వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపాలిటీలోని 11, 22 వార్డుల్లో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుతో మంత్రి పాల్గొన్నారు. 11వ వార్డులో పారిశుధ్య పనులను మంత్రి ప్రారంభించారు.

### అందరూ పాల్గొనాలి: అల్లోల

పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ జిల్లాకేంద్రంలోని జోహ్రానగర్, విశ్వనాథ్‌పేట్ కాలనీల్లో నిర్వహించిన పట్టణ ప్రగతిలో కలెక్టర్ ముషారఫ్‌అలీఫారూఖీతో కలిసి పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ 'ఇల్లు మనది.. వీధి మనది. పట్టణం మనది..' అనే భావనను కలిగి ఉండాలని అన్నారు.

### నిరంతర ప్రక్రియ: సబితాఇంద్రారెడ్డి

పట్టణ ప్రగతి నిరంతర ప్రక్రియ అని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిబాలాజీ, ఆర్‌బీఆర్, సీఎంఆర్, సీవైఆర్, 2, 3, 4, 25వ వార్డుల్లో మంత్రి పర్యటించారు. ప్రజలతో మాట్లాడి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రగతి పనుల పేరుతో చిరు వ్యాపారులను ఎవరు ఇబ్బంది పెట్టకూడదని సీఎంకేసీఆర్ ఆదేశించారని చెప్పారు.

### పట్టణాల సుందరీకరణ: మల్లారెడ్డి

పట్టణ ప్రగతి కార్యక్రమంతో పట్టణాల సుందరీకరణ సాధ్యమవుతుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా ఆదివారం నాగారం మున్సిపాలిటీ శిల్పానగర్ కాలనీలో కార్యాలయం భవన నిర్మాణం రూ.6 లక్షలు, 7వ వార్డులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డులోని భస్తీలో పాదయాత్ర చేపట్టి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.


ఆదివారం మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని ఓ కుంటను ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

## నర్సాపూర్‌కు గోదావరి జలాలు: మంత్రి హరీశ్‌రావు

**నర్సాపూర్** నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.25 కోట్లతో కోమటిబండ నుంచి నర్సాపూర్‌కు గోదావరి జలాలు తీసుకొస్తామని పరిష్కారిస్తామని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ ధర్మారెడ్డి, మాజీ మంత్రి సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌తో పట్టణప్రగతి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆర్టీసీ కుంట, బస్‌డిపో, సంగారెడ్డి రూట్లో ఉన్న పంట కాల్వ, రాయారావు చెరువును సందర్శిం చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద జరుగుతున్న పాత భవనాలతొలగింపు పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక చిల్డ్రన్స్‌పార్కులో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నర్సాపూర్ బస్‌డిపో పనులు 3 నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పాత తాసిల్దార్ కార్యాలయం స్థలంలో రూ.5 కోట్లతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌తోపాటు చేపల విక్రయ కేంద్రం, రైతు బజార్‌ను అత్యాధునిక హంగులతో నిర్మిస్తామని అన్నారు. జూనియర్ కళాశాల పక్కన స్పోర్ట్‌కాంప్లెక్స్ నిర్మిస్తామని.. ఇందులో మినీ స్టేడియంతో పాటు షటిల్, వాలీబాల్, పుట్‌బాల్ కోర్టులతోపాటు ఇండోర్ బాడ్మింటన్ 800 మీటర్ల వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లను నిర్మించ నున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్, ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు.

### ● కిక్కిరిసిన కొమురెల్లి..


సిద్దిపేట జిల్లాలోని కొమురెల్లి మల్లన్న క్షేత్రం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోవారం సందర్భంగా ఆదివారం పలు జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. సుమారు 60 వేలమంది స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు, పట్నాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు.
- చేర్యాల, నమస్తే తెలంగాణ

### ● వటపత్రశాయిగా లక్ష్మీనరసింహుడు


యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు లక్ష్మీనరసింహుడు వటపత్రశాయిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఉదయం లోకరక్షకునిగా మారి వటపత్రశయనునిగా.. రాత్రివేళ కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షమును తన వాహనంగా చేసుకుని బాలాలయంలో నిర్వహించిన సేవలో భక్తులకు కనువిందు చేశారు.
-యాదాద్రిభువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ

### ● కొల్లూరు వెంకన్న సన్నిధిలో వైవీ సుబ్బా రెడ్డి


సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బా రెడ్డి దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. కొల్లూర్ కౌన్సిలర్ మయూరి రాజుగౌడ్ సుబ్బా రెడ్డికి స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులు కేటాయిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు కొండా రాఘవరెడ్డి, కౌన్సిలర్ రాంసింగ్, ఆలయ చైర్మన్ గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు. - రామచంద్రాపురం

## నలుగురు గంజాయి స్మగ్లర్లపై పీడీ యాక్ట్

**రెడ్డికాలనీ (వరంగల్):** గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు నిందితులపై వరంగల్ పోలీస్ కమిషనర్ విశ్వనాథ రవీందర్ శనివారం పీడీ యాక్ట్ నమోదు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వరంగల్ రూరల్ జిల్లా పరకాల మండలానికి చెందిన బొచ్చు భానుచందర్, జయశంకర్ జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామానికి చెందిన గైకోటి శ్రీనివాస్, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెంకు చెందిన గద్దల శ్రీకాంత్, జయశంకర్ జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన చల్లగురుగుల శంకర్‌పై పీడీ యాక్ట్ నమోదైంది. పోలీస్ కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులను ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ వరంగల్ కేంద్ర కారాగారంలో ఉన్న నిందితులకు జైలర్ సమక్షంలో అందజేశారు.


మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న కారం రవీందర్‌రెడ్డి

## వ్యవస్థను కాపాడుకుందాం

**టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి**

**మహబూబాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ వ్యవస్థను ఉద్యోగులు కాపాడితే.. వ్యవస్థ ఉద్యోగులను కాపాడుతుందని తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 2020 డైరీ, నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద ర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం వివిధ శాఖలను విశదీకరించిందన్నారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత టీఎన్జీవో యూనియన్ చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, కోల రాజ్‌కుమార్, వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రెచ్చిపోయిన మృగాళ్లు

- వేర్వేరు చోట్ల వృద్ధురాలు, చిన్నారిపై లైంగికదాడి
- మద్యం మత్తులో అఘాయిత్యం

**నిడమనూరు/మొగుళ్లపల్లి:** వేర్వేరు చోట్ల ఇద్దరు మృగాళ్లు రెచ్చిపోయారు. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి లైంగికదాడికి తెగబడ్డారు. నల్లగొండ జిల్లా అనుముల మండలంలో తొంబై ఏండ్ల వృద్ధురాలిపై ఓ దుర్మార్గుడు లైంగికదాడికి పాల్పడి.. ఆపై హత్యచేశాడు. మరో ఘటనలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో ఆరేండ్ల చిన్నారిపై ఓ వ్యక్తి లైంగికదాడి చేశాడు. రెండు ఘటనల్లోనూ నిందితులు మద్యంమత్తులోనే ఉండటం గమనార్హం. అనుముల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధురాలు తన ఇంట్లో నిద్రిస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి ఆమెపై లైంగికదాడి చేసి హత్యచేశాడు. ఆదివారం ఉదయం పక్కనే మరో ఇంట్లో ఉంటున్న ఆమె కొడుకు తీవ్ర రక్తస్రావమై విగతజీవిగా పడి ఉన్న తల్లిని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. మిర్యాలగూడ డీఎస్పీ వెంకటేశ్వరరావు, హాలియా సీఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వృద్ధురాలిపై లైంగికదాడి చేసి.. ఆపై గొంతునులిమి హత్యచేసినట్టు పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాత్రి మద్యం తాగి వృద్ధురాలు నిద్రిస్తున్న ఇంటి వద్ద కనిపించినట్టు స్థానికులు చెప్పడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

### ఆరేండ్ల చిన్నారిపై...

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో ఓ గ్రామానికి చెందిన ఆరేండ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన జోరుక రమేశ్(38) మద్యంమత్తులో లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు హైదరాబాద్‌లో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. చిన్నారి కొంతకాలంగా నానమ్మ వద్ద ఉంటున్నది. ఆదివారం నానమ్మ కూలి పనులకు వెళ్లడంతో చిన్నారి ఇంట్లో ఒంటరిగా ఉన్నది. మద్యంమత్తులో ఉన్న రమేశ్ చిన్నారిని తన ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తీవ్రరక్తస్రావంతో ఏడుస్తూ అతడి ఇంటి నుంచి బయటకొచ్చింది. గమనించిన గ్రామస్థులు రమేశ్‌కు దేహశుద్ధి చేసి.. బాలికను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపారు.

## మావోయిస్టులకు పేలుడు పదార్థాలు

**ఐదుగురు అరెస్టు**

**వాహనతనిఖీల్లో పట్టుబడ్డ నిందితులు**

**కొత్తగూడెం క్రైం:** మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్తగూడెం ఓఎస్డీ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ రూరల్ పోలీసులు ఆదివారం మండలంలోని జగన్నాథపురం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో రెండు బైక్‌లపై వస్తున్న ఆరుగురిని పోలీసులు తనిఖీ చేసి.. వారి వద్ద ఐడియల్ బూస్టర్లు-27, జిలెటిన్ స్టిక్స్-40, డిటోనేటర్లు-40, ఒక టాటా మ్యాజిక్ వాహనంతోపాటు రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 57,500నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పానెం సారయ్య, కొమరం సమ్మయ్య, జర్పుల మనుమంతు, కుర్సం మురళీ, కాక నాగేశ్వరావుగా గుర్తించారు. రవి అనే వ్యక్తి పరారయ్యాడు. మావోయిస్టు నేతలు ఆజాద్, హరిభూషణ్, లచ్చన్నకు మందుగుండు సామగ్రి అందజేసేందుకు వెళ్తున్నట్టు వెళుతున్నట్లు వారు విచారణలో అంగీకరించారు. క్రషర్ల నిర్వాహకులు బోళ్ల అప్పారావు, నరేశ్, రామకృష్ణ, నవీన్, తాటికొండ అప్పారావు, సాయి, సుధాకర్‌తోపాటు మొత్తం 14 మందిపై కేసు నమోదు చేసినట్టు ఓఎస్డీ తెలిపారు.

## బాబ్లీ గేట్ల ఎత్తివేత


**సుప్రీంకోర్టు ఆదేశం మేరకు 0.6 టీఎంసీల నీరు విడుదల**


బాబ్లీ ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న గోదావరి జలాలు

**బాసర/ మెండోరా:** మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు ఐదుగేట్లను ఆదివారం ఎత్తి నీటిని వదిలారు. ఎస్సారెస్పీ పరిధిలోని ప్రాంత తాగునీటి అవసరాలు తీర్చడానికి ఈ గేట్లను ఎత్తారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏటా మార్చి1న బాబ్లీ ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉన్నది. బాబ్లీ ప్రాజెక్టులో 1.6 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. అందులోంచి 0.6 టీఎంసీల నీటిని వదిలారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన నీటిపారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి పరవళ్లు

**కొనసాగుతున్న ఎత్తిపోతలు**


భూపాలపల్లి జిల్లా లక్ష్మీ పంప్‌హౌజ్‌లో నడుస్తున్న మోటర్లు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ/మహదేవపూర్:** ఎగువకు గోదావరి పరవళ్లుతొక్కుతున్నది. కాళేశ్వరం లింక్1, 2ల్లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మీపంప్‌హౌజ్‌లో 3 మోటర్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీరు సరస్వతీ బరాజ్‌లోకి వెళ్తున్నది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేటలోని సరస్వతీ పంప్‌హౌజ్‌లో ఆదివారం 1, 3, 7 మోటర్ల ద్వారా 8,700 క్యూసెక్కుల నీటిని మంథని మండలం సిరిపురంలోని పార్వతిబరాజ్‌లోకి.. గోలివాడలోని పార్వతి పంప్‌హౌజ్‌లోని 3, 5, 6 మోటర్ల ద్వారా 7,830 క్యూసెక్కుల నీటిని ఎల్లంపల్లి బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నా రు. లింక్-2లో భాగంగా ధర్మా రం మండలం నంది మేడారంలోని నందిపంప్‌హౌజ్‌లో 3, 4 మోటర్ల ద్వారా 6,300 క్యూసెక్కుల జలాలు నంది రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. ఇక్కడినుంచి జంట సొరంగాలద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌజ్‌కు చేరుతున్నాయి. ఇక్కడ 2, 4 పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీరు ఎస్సారార్ వైపు పరుగులు తీస్తున్నది. ప్రస్తుతం ఈ జలాశయంలో 25.297 టీఎంసీల నీరు ఉన్నది. ఎస్సారార్ నుంచి ఎల్ఎండీకి 7,997 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తున్నది. 5,832 క్యూసెక్కులు బయటకు వదులుతున్నారు.ఎల్ఎండీలో ప్రస్తుతం 11.219 టీఎంసీలు నిల్వ ఉన్నది.


గోవర్ధనగిరి బస్టాండ్ సమీపంలో సంచరిస్తున్న గుడ్డెలుగు

## జనావాసాల్లోకి గుడ్డెలుగు

**భయాందోళనలో ప్రజలు**

**రఘునాథపల్లి:** గుడ్డెలుగు జనావాసాల్లోకి వచ్చిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరిలో ఆదివారం కలకలంరేపింది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గోవర్ధనగిరి బస్టాండ్ సమీపంలోని రామలయం వద్ద ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలోకి గుడ్డెలుగు వచ్చింది. దానిని తరిమికొట్టేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో రావడంతో గుడ్డెలుగు అక్కడి నుంచి పారిపోయింది.

## ఈపీఎఫ్ వడ్డీ యథాతథం?

■ ఈ నెల 5న సమావేశం

**న్యూఢిల్లీ, మార్చి 1:** ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును యథాతథంగానే ఉంచాలని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు సమాచారం. ఈ నెల 5న ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశం జరుగనున్నది. ఈ సందర్భంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను ఈపీఎఫ్ డిపాజిట్లపై వడ్డీరేటును పరిశీలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2018-19) వడ్డీరేటు 8.65 శాతంగా ఉన్నది. అయితే దీన్ని 8.5 శాతానికి తగ్గించవచ్చన్న అంచనాలు వినిపిస్తుండగా, కార్మిక మంత్రిత్వ శాఖ మాత్రం యథాతథంగా ఉంచేందుకే ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో సుమారు 6 కోట్ల మంది ఖాతాదారులకు లబ్ధి చేకూరనున్నది.

# ఎలక్ట్రానిక్ లావాదేవీల్లో మనమే నం.1




## 'ఈ-గవర్నెన్స్'తో సేవల్లో పారదర్శకత

- డిజిటల్ తెలంగాణ సాకారం కోసం ఐటీ శాఖ కృషి
- ఈఎస్డీ ద్వారా 50 శాఖల్లో 500లకుపైగా సేవలు
- ఐదేండ్లలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పారదర్శక పాలనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతున్నది. ముఖ్యంగా మంత్రి కేటీఆర్ ఐటీశాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత 'ఈ-గవర్నెన్స్'పై ప్రత్యేక దృష్టి సారించారు. వినియోగదారులకు, పౌరులకు మెరుగైన సేవలందించడంలో జవాబుదారీతనం, పారదర్శకత పెంచేందుకు కృషిచేస్తున్నారు. ప్రభుత్వం-ప్రభుత్వం, ప్రభుత్వం-పౌరులు, ప్రభుత్వం-వ్యాపారస్తులు, వ్యాపారస్తులు-వినియోగదారులు మధ్య సేవల్లో తెలంగాణ ఐటీశాఖ కీలకపాత్ర పోషిస్తున్నది. మంత్రి కేటీఆర్ మార్గనిర్దేశంతో ఇప్పటికే తెలంగాణ ఐటీశాఖ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ప్రజలకు సమర్థవంతమైన సేవలను అందించడంలో తెలంగాణ ఐటీ శాఖ ఇతర రాష్ర్టాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

### నాలుగేండ్లుగా మొదటి స్థానంలోనే..

ఐటీశాఖలోని ఈఎస్డీ (ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ) విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 4,500లకుపైగా మీసేవ కేంద్రాలు ప్రజలకు సమర్థంగా సేవలు అందిస్తున్నాయి. మీసేవ కేంద్రాల ద్వారా ప్రతిరోజు లక్ష నుంచి లక్షన్నర లావాదేవీలు జరుగుతున్నాయి. మొత్తంగా ఇప్పటివరకు 13.68 కోట్ల లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వానికి సంబంధించిన 50 శాఖల్లో 500లకు పైగా సేవలను ఈఎస్డీ అందిస్తున్నది. 4,500లకుపైగా మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలు జరుపుతున్న ఎలక్ట్రానిక్ లావాదేవీల్లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉన్నట్టు ఈతాల్ పోర్టల్ సర్వే తెలిపింది. ఎలక్ట్రానిక్ లావాదేవీల్లో నాలుగేండ్లు తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలోనే నిలుస్తున్నది.


### సాంకేతికతతో స్మార్ట్ గవర్నెన్స్

పౌర సేవలందించడం కోసం ఈఎస్డీ విభాగం ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకొంటున్నది. బిగ్‌డాటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతికతను పౌరసేవల్లో వినియోగించుకుంటున్నది. ఐటీశాఖ ముఖ్యంగా స్మార్ట్ గవర్నెన్స్‌పై దృష్టిసారించింది. పౌరసేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆధార్ స్లాట్ బుక్కింగ్ కోసం టీ-యాప్ ఫోలియో, రియల్ టైం డిజిటల్ అథెంటికేషన్ ఆఫ్ ఐడెంటిటీ, టీ-వ్యాలెట్, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్) వంటి కార్యక్రమాల ద్వారా అత్యుత్తమ సేవలను ప్రజలకు అందిస్తున్నది.

### అనేక అవార్డులు, గుర్తింపులు

దేశంలో ఈ-గవర్నెన్స్ క్యాటగిరీలో అందించే అన్ని అవార్డులను ఐటీశాఖలోని ఈఎస్డీ విభాగం ఇప్పటికే పొందింది. మీసేవల ద్వారా తక్కువ సమయంలో 13.5 కోట్ల లావాదేవీలను జరిపిన రాష్ట్రంగా గుర్తింపు పొందింది. పౌర సేవలను సమర్థంగా అందిస్తున్నందుకుగానూ తెలంగాణ మీసేవ విభాగానికి పలు సదస్సుల్లో ఆరు అవార్డులు, బెస్ట్ మొబైల్ యాప్‌నకు ఐదు అవార్డులు, టీ-వ్యాలెట్‌కు రెండు అవార్డులు దక్కాయి.

### పారదర్శక సేవలే లక్ష్యం



మంత్రి కేటీఆర్ సూచనల మేరకు ప్రజలకు ప్రభుత్వసేవలను అందించడంలో దళారుల వ్యవస్థను తొలిగించి, పారదర్శక సేవలు అందించడమే లక్ష్యం పనిచేస్తున్నాం. సౌకర్యవంతమైన, పారదర్శక సేవలే ఈ-గవర్నెన్స్ ముఖ్య ఉద్దేశం. మీసేవలు, టీ-యాప్ ఫోలియో, టీ-వ్యాలెట్ ద్వారా ప్రజలకు సమర్థంగా సేవలందిస్తున్నాం. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రతి సంవత్సరమూ నాలుగైదు అవార్డులు వస్తున్నాయి. తెలంగాణ ఐటీశాఖ పనితీరుకు ఇది నిదర్శనం.

**- జీటీ వెంకటేశ్వర్‌రావు, ఈఎస్డీ కమిషనర్**

### వివిధ విభాగాల్లో రాష్ట్రానికి దక్కిన అవార్డులు

**'మీసేవ' అవార్డులు**

- 2018లో వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సదస్సులో డబ్ల్యూఐటీఎస్‌ఏ చైర్మన్స్ అవార్డు
- ప్రభుత్వ విభాగాల్లో ఆవిష్కరణలకు 2018లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'నేషనల్ ఈ-గవర్నెన్స్' అవార్డు
- 2018లో బిజినెస్ వరల్డ్-ఈ-గవర్నెన్స్ ఇనిషియేటివ్ ఆఫ్ ద ఇయర్ అవార్డు
- పౌర సేవల్లో అద్భుత పనితీరుకు కేంద్ర ప్రభుత్వం నుంచి 2014లో నేషనల్ ఈ-గవర్నెన్స్ అవార్డు
- 2017లో స్కోచ్ డిజిటల్ ఇన్‌క్లూజన్ అవార్డు
- 2017లోనే జెమ్స్ ఆఫ్ డిజిటల్ ఇండియా అవార్డు

**టీ-యాప్..**

- 2018లో డిజిటల్ ఇండియా అవార్డుల సందర్భంగా బెస్ట్ మొబైల్ యాప్ క్యాటగిరీలో అవార్డు
- 2018లో బెస్ట్ మొబైల్ యాప్ క్యాటగిరీలో బిజినెస్ వరల్డ్ అవార్డు
- 2019లో పౌరసేవల్లో భాగంగా బెస్ట్ మొబైల్ యాప్ క్యాటగిరీలో ఎక్స్‌ప్రెస్ ఐటీ అవార్డు
- 2019లో గవర్నెన్స్ నౌ నుంచి డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అవార్డు
- 2019లో పౌర సమాచారానికి అత్యంత భద్రత కల్పించే యాప్ క్యాటగిరీలో సీఐఎస్వో మాగ్ అవార్డు

**టీ-వ్యాలెట్..**

- అవార్డ్ ఆఫ్ అప్రిసియేషన్ అండర్ స్టేట్ ప్రాజెక్ట్స్ క్యాటగిరీలో సీఎస్ఐ ఈ-గవర్నెన్స్ అవార్డు-2018
- 2017లో ఈ-పేమెంట్స్ క్యాటగిరీలో స్కోచ్ అవార్డు

**డ్యాష్‌బోర్డు..**

2018లో అనలిటిక్స్/బిగ్ డేటా క్యాటగిరీలో టెక్నాలజీ సభ అవార్డు

## లక్ష కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు




ఫిబ్రవరిలో రూ.1.05 లక్షల కోట్లుగా నమోదు

12 శాతం పెరిగిన దేశీయ లావాదేవీల ఆదాయం

**న్యూఢిల్లీ, మార్చి 1:** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు ఆశాజనకంగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది వరుసగా రెండో నెలా లక్ష కోట్ల రూపాయలను దాటాయి. ఫిబ్రవరిలో రూ.1,05,366 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చినట్లు ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలియజేసింది. జనవరిలో రూ.1.10 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లైన విషయం తెలిసిందే. ఇక ఈసారి గతేడాది ఫిబ్రవరితో పోల్చితే 8 శాతం ఆదాయం పెరిగింది. కాగా, జూలై 1, 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చిన దగ్గర్నుంచి నెలసరి వసూళ్లు లక్ష కోట్ల రూపాయలను దాటడం ఇది 11వసారి. నిరుడు డిసెంబర్, నవంబర్ నెలల్లోనూ జీఎస్టీ ఆదాయం రూ.1.03 లక్షల కోట్ల చొప్పున నమోదైన సంగతి విదితమే. దీంతో వరుసగా నాలుగోసారి జీఎస్టీ వసూళ్లు లక్ష కోట్ల రూపాయల మార్కును అధిగమించినట్లైంది. ఇదిలావుంటే ఫిబ్రవరి ఆదాయంలో సీజీఎస్టీ వాటా రూ.20,569 కోట్లుగా, ఎస్‌జీఎస్టీ రూ.27,348 కోట్లు, ఐజీఎస్టీ రూ.48,503 కోట్లు, సెస్సు రూ.8,947 కోట్లుగా ఉన్నాయి. ఫిబ్రవరి 29 నాటికి జనవరికిగాను దాఖలైన మొత్తం జీఎస్టీఆర్ 3బీ రిటర్నులు 83 లక్షలుగా నమోదైయ్యాయి. ఇక రెగ్యులర్ సెటిల్మెంట్‌గా ఐజీఎస్టీ నుంచి సీజీఎస్టీకి రూ.22,586 కోట్లు, ఎస్‌జీఎస్టీకి రూ.16,553 కోట్లను కేంద్ర ప్రభుత్వం సెటిల్ చేసింది. 'రెగ్యులర్ సెటిల్మెంట్ తర్వాత ఫిబ్రవరిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం ఆదాయం సీజీఎస్టీగా రూ.43,155 కోట్లు, ఎస్‌జీఎస్టీగా రూ.43,901 కోట్లుగా ఉన్నది' అని సదరు ప్రకటనలో ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం నెలకొన్న నేపథ్యంలో ఫిబ్రవరి జీఎస్టీ ఆదాయంలో దేశీయ లావాదేవీల నుంచి వచ్చినది 12 శాతం పెరుగడం గమనార్హం. వస్తూత్పత్తుల దిగుమతి నుంచి వచ్చే ఆదాయం కూడా 8 శాతం పెరిగింది. 'ఈ గణాంకాలు జీఎస్టీ వసూళ్ల స్థిరత్వాన్ని సంతరించుకున్నాయన్న సంకేతాలను ఇస్తున్నాయి. ఈ-ఇన్వాయిసింగ్, కొత్త రిటర్నుల కోసం చేపట్టే నిర్ణయాలు భవిష్యత్తులో మరింత సుస్థిరతకు దోహదం చేస్తాయనిపిస్తున్నది' అని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణి అన్నారు. మరోవైపు ఏప్రిల్ 1 నుంచి అన్ని బిజినెస్ టు కస్టమర్ (బీ2సీ) లావాదేవీల ఇన్వాయిస్‌ల కోసం ప్రతి నెలా లక్కీ డ్రాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఇందుకోసం జీఎస్టీ కింద లాటరీ ఆఫర్‌ను ప్రారంభించాలని చూస్తున్నది. ప్రతీ కొనుగోలుకు కస్టమర్లు బిల్లులను తీసుకునేలా ఇది ప్రోత్సహించగలదని కేంద్రం ఆశిస్తున్నది.

## ఎయిర్ ఏషియా నష్టం రూ.123 కోట్లు



**ముంబై, మార్చి 1:** చౌక విమానయాన సంస్థ ఎయిర్ ఏషియా నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.123.35 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో రూ.166.15 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఇంధనం, ఉద్యోగులకోసం అధికంగా చెల్లింపులు జరుపడంతోపాటు యూజర్ చార్జీలు, నిర్వహణ ఖర్చులు అధికమవడం వల్లనే లాభాల్లో గండిపడిందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. టాటా సన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్ గ్రూపు ఎయిర్ ఏషియా సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ విమానయాన సంస్థ జనవరి-డిసెంబర్ మధ్యకాలాన్ని ఆర్థిక సంవత్సరంగా వ్యవహరిస్తున్నది. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 65 శాతం ఎగబాకి రూ.1,057.55 కోట్లకు చేరుకున్నది. అంతక్రితం ఏడాది రూ.641.17 కోట్లుగా ఉన్నది. గతేడాది మొత్తానికి రూ.597 కోట్ల నష్టం వచ్చింది.

# కరోనానే కీలకం!

### స్టాక్ మార్కెట్లపై విశ్లేషకుల అంచనా

**న్యూఢిల్లీ, మార్చి 1:** కరోనా వైరస్ దెబ్బకు గత వారంలో కుదేలైన ప్రపంచ మార్కెట్లు ఈ వారంలోనూ మరింత పడిపోయి ప్రమాదం ఉన్నదని మార్కెట్ వర్గాలు హెచ్చరిస్తున్నారు. 2008 సంభవించిన ఆర్థిక సంక్షోభం తర్వాత ఒక వారంలో భారీగా నష్టపోయిన సూచీలు మళ్లీ గతవారంలో మూడు వేల పాయింట్ల వరకు పతనమయ్యాయి. ఈ వారంలోనూ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనుకావచ్చునని, కరోనా వైరస్ మరిన్ని దేశాలకు పాకుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన మరింత తీవ్రతరంకానున్నదని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో దేశ వృద్ధిరేటు ఏడేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడం కూడా మార్కెట్లను ప్రభావితం చేసే అంశాల్లో ఇది కూడా ఒకటని ఆయన పేర్కొన్నారు. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను 4.7 శాతంగా నమోదైంది. బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)కి చెందిన అనుబంధ సంస్థయైన కార్డు సంస్థ ఐపీవోకి రానుండటం, ఆఫర్ ఫర్ రూట్‌లో రిట్స్‌లో కేంద్ర ప్రభుత్వం వాటాను విక్రయించనుండటంపై కూడా దలాల్ స్ట్రీట్ వర్గాలు ప్రత్యేకంగా దృష్టిసారించే అవకాశాలున్నాయి. గతవారంలో సెన్సెక్స్ 2,872.83 పాయింట్లు లేదా 6.97 శాతం, నిఫ్టీ 879.10 పాయింట్లు లేదా 7.27 శాతం పతనం చెందాయి.

**గతవారంలో బ్లూచిప్ కంపెనీలు కోల్పోయిన మార్కెట్ విలువ (రూ. కోట్లలో)**

| కంపెనీ | నష్టపోయిన విలువ | మొత్తం విలువ |
|---|---|---|
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 99,430.93 | 8,42,262.64 |
| టీసీఎస్ | 58,293.29 | 7,50,833.42 |
| హెచ్‌డీఎఫ్‌సీ | 33,222.99 | 3,76,839.90 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 32,736.06 | 3,21,030.90 |
| ఇన్ఫోసిస్ | 27,830.35 | 3,11,457.26 |
| ఎస్బీఐ | 22,088.41 | 2,70326.48 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 21,369.47 | 6,45,544.93 |
| హెచ్‌యూఎల్ | 15,792.31 | 4,70,824.97 |
| కొటక్ మహీంద్రా బ్యాంక్ | 12,821.78 | 3,09,721.16 |
| భారతీ ఎయిర్‌టెల్ | 11,702.17 | 2,85,898.48 |

# 30వేల ఉద్యోగాలు




### ఈ ఏడాదే నియామకాలు: క్యాప్‌జెమినీ ఇండియా సీఈవో యార్డీ

**ముంబై, మార్చి 1:** ఐటీ ఉద్యోగులకు శుభవార్త. ఫ్రాన్స్ టెక్నాలజీ దిగ్గజం క్యాప్‌జెమినీ భారత్‌లో మరో 30వేల మందిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలని చూస్తున్నది. క్యాప్‌జెమినీ దేశీయ ఉద్యోగుల సంఖ్య దాదాపు 1.15 లక్షలు. ప్రపంచవ్యాప్తంగా సంస్థకున్న ఉద్యోగుల్లో ఇది సగానికిపైనే. ఈ క్రమంలో ఈ ఏడాది మరో 25,000 నుంచి 30,000 మందిని నియమించుకునే వీలున్నట్లు క్యాప్‌జెమినీ ఇండియా సీఈవో అశ్విన్ యార్డీ పీటీఐకి తెలిపారు. కొత్తవారికి, అనుభవజ్ఞులైన నిపుణులకు అవకాశాలుంటాయని చెప్పారు. 'మా వ్యాపారంలో భారత్ చాలా ముఖ్యమైనదిగా ఉన్నది. కాబట్టి ఈ ఏడాది మరో 25వేల నుంచి 30వేల మందిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలని భావిస్తున్నాం' అని యార్డీ అన్నారు. భవిష్యత్తు టెక్నాలజీ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచడంపై ప్రస్తుతం తాము దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఇందులోభాగంగానే 30 ఏండ్లలోపు యువతకు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటున్నట్లు చెప్పారు. అలాగే ప్రాజెక్ట్ మేనేజర్లు లేదా ఆర్కిటెక్టులుగా 10-15 ఏండ్ల అనుభవం ఉన్నవారిని తీసుకుంటామని వివరించారు. ముంబై సమీపంలోని తమ భారీ డెవలప్‌మెంట్ సెంటర్‌లో, మరికొన్ని ఇతర ప్రాంతాల్లో పనిచేయడానికి ఉద్యోగులు కావాలన్నారు.

### నైపుణ్యం కోసం అన్వేషణ

**భారతీయ** సంస్థలు నైపుణ్యానికి పెద్దపీట వేస్తున్నాయి. తమ ఉద్యోగుల్లో ప్రతిభకు కొదవే ఉండరాదని భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే మెరికల్లాంటి యువతను ఒడిసిపట్టుకోవడానికి ప్రొఫెషనల్ ఆర్గనైజేషన్స్‌ను ఆశ్రయిస్తున్నాయి. చివరకు సోషల్ మీడియా వేదికలు, జాబ్ పోర్టల్స్‌నూ విడిచిపెట్టడం లేదు. భారతీయ టాలెంట్ మార్కెట్‌లో కొత్త ట్రెండ్స్‌పై దృష్టి పెట్టే సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ ఈ ఏడాదికిగాను ఓ అధ్యయనాన్ని చేపట్టింది. దీని ప్రకారం జూనియర్, మిడ్, సీనియర్ స్థాయిల్లో పనిచేసేందుకు ప్రతిభావంతుల కోసం ఆయా సంస్థలు ప్రత్యేకంగా కంపెనీలను నియమించుకుంటున్నాయి. దీనివల్ల ఉద్యోగార్థుల పరిశీలన, ఎంపిక, వారిలో నాణ్యమైన ప్రతిభను గుర్తించడం వంటి వాటి కోసం కంపెనీల సమయం ఆదా అవుతున్నదని సీఐఈఎల్ తెలిపింది. ఈ పని మొత్తం అద్దెకు తీసుకున్న సంస్థలే చూసుకుంటున్నాయని సీఐఈఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ ఆదిత్య నారాయణ్ మిశ్రా స్పష్టం చేశారు. ప్రారంభ స్థాయిల్లో 30 రోజుల్లోగా, మధ్య స్థాయిలో 60 రోజుల్లోగా, సీనియర్ స్థాయిల్లో 180 రోజుల్లోగా నియామకాలు పూర్తవుతున్నట్లు వెల్లడించారు. జూనియర్ ఉద్యోగులు జీతాలకు, మధ్య స్థాయి ఉద్యోగులు హోదాలకు , సీనియర్ ఉద్యోగులు సంస్థలో కీలక పదవులకు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు.

# వాహన అమ్మకాలు డీలా

### మారుతి, మహీంద్రా, హ్యుందాయ్, టాటా విక్రయాల్లో క్షీణత



**న్యూఢిల్లీ, మార్చి 1:** వాహన అమ్మకాలు మళ్లీ డీలా పడ్డాయి. ఆర్థిక మాంద్యం ఒకవైపు బుసలు కొడుతుంటే మరోవైపు కరోనా వైరస్‌తో సామాన్యుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ సమయంలో కార్లను కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. దీంతో వరుసగా ఎనిమిది నెలలుగా అమ్మకాలు పడిపోయి ఇబ్బందులను ఎదుర్కొంటున్న వాహన తయారీ సంస్థలకు ఫిబ్రవరి కూడా నిరాశనే మిగిల్చింది. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ ఇండియా గత నెలలో తన అమ్మకాలు 1.1 శాతం పడిపోయి 1,47,110 యూనిట్లను మాత్రమే విక్రయించినట్లు ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 1,48,682ల వాహన అమ్మకాలు జరిపింది. వీటిలో 1,36,949 వాహనాలను దేశీయంగా విక్రయించింది. ఫిబ్రవరి 2019లో విక్రయించిన 1,39,100లతో పోలిస్తే 1.6 శాతం తగ్గాయి. కంపెనీకి చెందని మినీ కార్లైన ఆల్టో, వ్యాగన్ ఆర్‌లు 27 వేల యూనిట్లు అమ్ముడవగా, కాంప్యాక్ట్ సెగ్మెంట్‌కు చెందిన స్విఫ్ట్, సెలేరియో, ఇగ్నిస్, బాలెనో, డిజైర్ విక్రయాలు 3.9 శాతం తగ్గుముఖం పట్టగా, మధ్యస్థాయి సెడాన్ సియాజ్ 2,544 యూనిట్లు అమ్ముడయ్యాయి. అలాగే యుటిలిటీ వాహనాలైన విటారా బ్రెజ్జా, ఎస్-క్రాస్, ఎర్టిగా అమ్మకాలు మాత్రం 3.5 శాతం పెరుగగా, ఎగుమతులు 7.1 శాతం ఎగబాకి 10,261లకు చేరుకున్నాయి.

### మహీంద్రా విక్రయాల్లో 42 శాతం డౌన్

మరో దేశీయ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రాకు అమ్మకాల్లో భారీ ఎదురు దెబ్బ తగిలింది. గత నెలలో కంపెనీ మొత్తంగా 32,476 యూనిట్ల వాహనాలను విక్రయించింది. 2019 ఫిబ్రవరిలో అమ్ముడైన 56,005లతో పోలిస్తే 42 శాతం పడిపోయాయి. వీటిలో దేశీయ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 42 శాతం తగ్గి 30,637లకు పడిపోగా, ఎగుమతులు 40 శాతం తగ్గి 1,839లకు పరిమితమయ్యాయి.

### హ్యుందాయ్ విక్రయాలు కూడా..

దేశంలో రెండో అతిపెద్ద వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ విక్రయాలు కూడా 10.3 శాతం తగ్గి 48,910లకు పడిపోయాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 54,518 యూనిట్లను విక్రయించినట్లు ప్రకటించింది. వీటిలో దేశీయ విక్రయాలు 7.2 శాతం తగ్గి 40 వేలకు జారుకోగా, ఎగుమతులు 22 శాతం క్షీణించి 8,900లకు పరిమితమయ్యాయి.

### హోండా కార్స్‌కు నిరాశే..

వాహన విక్రయాల్లో హోండా కార్స్ నిరాశ తప్పలేదు. గత నెలలో సంస్థ 7,269ల వాహన విక్రయాలు జరిపింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో విక్రయించిన 13,527లతో పోలిస్తే 46.27 శాతం పడిపోయాయి.

## విడిభాగాల సరఫరాపై కరోనా దెబ్బ

**చైనాలో** కరోనా వైరస్ కారణంగా విడిభాగాల సరఫరా సమస్యను ఎదుర్కొంటున్నట్లు టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎంజీ మోటర్ ఇండియా తెలిపాయి. తమ బీఎస్-6 శ్రేణి వాహనాల తయారీ ప్రభావితమైందని మహీంద్రా ఆటోమోటివ్ డివిజన్ మార్కెటింగ్, సేల్స్ చీఫ్ విజయ్ రామ్ నక్రా ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలు అందుబాటులో లేక డీలర్లు అసంతృప్తిలో ఉన్నారన్నారు. మరి కొన్ని వారాలు ఈ ఇబ్బందులు తప్పేలా లేవంటూ నిరాశను వ్యక్తం చేశారు. ఫిబ్రవరి నెలలో మహీంద్రా అమ్మకాలు 42 శాతం క్షీణించి 32,476 యూనిట్లుగా నమోదైయ్యాయి. ఇక టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికిల్స్ బిజినెస్ యూనిట్ అధ్యక్షుడు మయాంక్ పరీక్ సైతం కరోనా వ్యాప్తి, సంస్థపై దాని ప్రభావంపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వాహన ఉత్పత్తి, అమ్మకాలు పడిపోయాయని చెప్పారు. ఎంజీ మోటర్ ఇండియా కూడా కరోనా దెబ్బకు చైనా నుంచి వాహన విడిభాగాల దిగుమతి ప్రభావితమైందని ప్రకటించింది. ఐరోపా, చైనాల్లోని విడిభాగాల సరఫరా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని సంస్థ ఇండియా సేల్స్ డైరెక్టర్ రాకేశ్ సిదానా ఓ ప్రకటనలో వెల్లడించారు. దీనివల్ల ఫిబ్రవరిలో తయారీ, అమ్మకాలు ప్రభావితమైయ్యాయని చెప్పారు. ఫిబ్రవరిలో సంస్థ రిటైల్ అమ్మకాలు 1,376 యూనిట్లకు క్షీణించాయి.

## ఎఫ్‌పీఐ @ 6,554 కోట్లు

**న్యూఢిల్లీ, మార్చి 1:** దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు మాత్రం తమ పెట్టుబడుల విషయంలో వెనుకంజ వేయడం లేదు. గత నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి రూ.6,554 కోట్ల నిధులు చొప్పించారు. కరోనా వైరస్‌తో ప్రపంచ మార్కెట్లు కుదేలవుతుండటం, దేశ ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు ప్రకటించిన ప్రస్తుత తరుణంలో ఎఫ్‌పీఐలు భారీగా పెట్టుబడులు పెట్టడం విశేషం. తాజాగా డిపాజిటరీ వద్ద ఉన్న సమాచారం మేరకు ఫిబ్రవరి 3 నుంచి 28 మధ్యకాలంలో ఈక్విటీల్లోకి రూ.1,820 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు..డెబిట్ మార్కెట్లో మాత్రం ఏకంగా రూ.4,734 కోట్లు చొప్పించారు. గత నెలలో నికరంగా రూ.6,500 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టినట్లు అయింది. గతేడాది సెప్టెంబర్ నుంచి వరుసగా దేశీయ మార్కెట్లలోకి ఎఫ్‌పీఐలు నిధులను చొప్పిస్తున్నారు. వైరస్‌తో ప్రపంచ, దేశీయ మార్కెట్లు కుదేలవుతున్న ప్రస్తుత తరుణంలో ఎఫ్‌పీఐల్లో ఆందోళన తీవ్ర స్థాయికి చేరుకున్నప్పటికీ, ఇతర దేశాల మార్కెట్లతో పోలిస్తే భారత ఈక్విటీ మార్కెట్లు ఆశాజనకంగా ఉండటంతో ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను ఇటు తరలించారని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజరీ ఇండియా సీనియర్ విశ్లేషకులు హిమాన్షు శ్రీవాత్సవ తెలిపారు.


**తెలంగాణ ఫుడ్స్**
IDA, నాచారం, హైదరాబాద్-500076. ఫోన్ నం. 27152207, 08 & 09

**టెండర్ ప్రకటన**

No.TF/GG/317/Tender/Wheat/WBNP/AP & TG/2020-21    తేది: 29-02-2020

FCI సనత్‌నగర్, FCI చర్లపల్లి, FCI కాజీపేట/వరంగల్, FCI నల్గొండ/ మిర్యాలగూడ డిపోల నుండి తెలంగాణ ఫుడ్స్, నాచారం, హైదరాబాద్ మరియు చెంగిచెర్ల వద్ద పూసా గోడౌన్స్‌కు '' గోదుమల రవాణా'' కొరకు ''తెలంగాణ ఫుడ్స్'' టెండర్లు కోరుతోంది. తదుపరి వివరాలకు 02-03-2020న మ. 2.00గం. నుండి వెబ్‌సైట్స్ https://tender.eprocurement.gov.in మరియు https://tfoods.telangana.gov.inను దర్శించండి. బిడ్ల దాఖలు ముగింపు తేది: 15-03-2020న సా. 5.00గం.వరకు.

DIPR RO. No. 742-PP/CL/Advt/1/2019-20, Dt: 29/02/2020    సం/- జనరల్ మేనేజర్

**తెలంగాణ ప్రభుత్వము**
మిషన్ భగీరథ శాఖ, హైదరాబాద్

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

e-proc.T.N.No.01 to 03/MB/ENC/2019-20,    తేది: 28-02-2020

**పనుల సంఖ్య:** 3, **పనుల పేరు:** 1) నాలుగు HMWS సెగ్మెంట్ల కొరకు ఇన్‌టేక్ స్ట్రక్చర్, WTP మరియు పైపులైన్ల యొక్క నిర్మాణం. (జనగామ, గజ్వేల్, ఆలేర్-భోన్‌గిర్ మరియు మేడ్చల్) శ్రీ కొమురవెల్లి మల్లన్న సాగర్ మరియు బస్వాపూర్ వనరులుగా. 2) వనపర్తి జిల్లాలో ఎల్లోర్ రిజర్వాయర్ నుండి వనపర్తి & బాలకిస్టాపూర్ సబ్ సెగ్మెంట్లకు త్రాగునీటి సరఫరా కొరకు పెంపుదల. 3) నాగర్ కర్నూల్ జిల్లాలో అంజనగిరి రిజర్వాయర్ నుండి ఎల్లోర్ సెగ్మెంట్‌కు ప్రత్యామ్నాయ వనరు ఏర్పాటు. **ECV మొత్తం : రూ.111.04 కోట్లు.** టెండర్ డాక్యుమెంట్ల లభ్యత: 10-03-2020 నుండి 26-03-2020 మ.3.00 గం. వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేది: 26-03-2020న సా.4.00 గం. ఆర్థిక బిడ్ తెరచు తేది: 30-03-2020న ఉ.11.30 గం. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం అనగా www.eprocurement.telangana.gov.in నుండి పొందవచ్చు. ఫోన్ నం.లు: 9100122264, 7995660701, 7995660208.

DIPR RO No.2559-DP/CL/Advt/1/2019-20, Dt: 29/02/2020    సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్, మిషన్ భగీరథ, హైదరాబాద్

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 2 మార్చి 2020 WWW. NTNEWS.COM /nt.zindagi

## గేగులు తింటే పేగులు శుభ్రం



- గేగుల్లోని పీచు జీర్ణక్రియకు ఎంతగానో ఉపయోగపడుతుంది. తరచూ గేగుల్ని తీసుకునేవారికి పెద్ద పేగుల్లో మలినాలు దరిచేరవు.
- గేగులు ఆరోగ్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇందులో పీచు, క్యాల్షియం, ఫాస్ఫరస్, ఒమెగా-3 పుష్కలంగా ఉంటాయి. పొటాషియం, విటమిన్ బి, బి1, బి3, సి వంటివి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.
- ఇందులోని క్యాల్షియం ఎముకలకు బలాన్నిస్తుంది. ఫాస్ఫరస్ శరీరానికి దృఢత్వాన్నిస్తుంది.
- వీటిని పాలల్లో ఉడికించి ఆ మిశ్రమాన్ని చర్మానికి పూతలా వేసుకుంటే చర్మం నిగనిగలాడుతుంది.
- రోజుకు రెండు గేగులు తీసుకుంటే శరీరంలోని కొవ్వుసైతం కరిగిపోతుందని వైద్యులు చెబుతున్నారు.
- వేసవిలో గేగులు తినడం వల్ల చెమటకాయలు రావు.
- గేగుల్ని బాగా నమలితింటే నోటి పూత తగ్గుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

## ఆకుపచ్చని ప్రయాణం

**ఆమెకు ఎనభై ఏండ్లు. చెన్నయ్ ఫేమస్ గ్రీన్ హోమ్ ను నిర్వహిస్తున్నారు. ప్రజలకు, విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయం, మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూ గుర్తింపును పొందుతున్నారు. తోటపనిలో ఆమెకు అవార్డులు కూడా వచ్చాయి. ఆమె పేరు సరోజ.**



సరోజకు పదహారేండ్ల వయస్సులో పెండ్లయింది. తమిళనాడు నుంచి చెన్నయ్ వెళ్లింది. చిన్నప్పటి నుంచే వ్యసాయంపై ఆసక్తి కారణంగా ఆమె మొక్కల పెంపకం ప్రారంభించారు. సుమారు అరవై ఏండ్లు శ్రమించారు. టెర్రస్ గార్డెనింగ్ చేస్తూ ఐదువందల రకాల మొక్కలను సంరక్షిస్తున్నారామె. తమిళనాడులోని నాగపట్నం సమీపంలోని ఓ గ్రామంలో జన్మించారు సరోజ. ఆమె కుటుంబానిది వ్యవసాయ నేపథ్యం. దీంతో మట్టిపై ఆమెకు అనుబంధం ఏర్పడింది. వ్యవసాయం మీద ప్రేమ, చెట్ల మీద అప్యాయత కలిగింది. దీంతో పాటు ఆమెకు చిన్నప్పుడు ఒక ట్యూషన్ టీచర్ ఉండేవారు. ఆయన పాఠాలతో పాటు పర్యావరణ విద్య నేర్పించేవారు. దీని కోసం విద్యార్థులను తోటలోకి తీసుకెళ్లేవారు. ఇలా చిన్న వయస్సులోనే చెట్లపెంపకంపై సరోజకు ఆసక్తి కలిగింది. అది రాను రాను అభిరుచిగా మారింది. మరిన్ని మెళకువలు నేర్చుకొని టెర్రస్ గార్డెనింగ్ ప్రారంభించింది. ప్రస్తుతం ఆమె గార్డెన్‌లో పది రకాల కూరగాయలు, గులాబీలు, ఇరవై రకాల మందార మొక్కలు ఉన్నాయని చెప్తున్నది. సరోజ నిర్వహిస్తున్న టెర్రస్ గార్డెనింగ్‌ను సందర్శించడానికి చాలామంది వస్తుంటారు. చుట్టుపక్కల విద్యార్థులు కూడా గ్రీన్‌హోం పర్యటనకు వస్తారు. వాడిపోయిన మందార పువ్వులను సేకరించి ప్రయోగాలకు ఉపయోగిస్తారు. దీంతో పాటు కంపోస్టింగ్, సేంద్రియ ఎరువుల వాడకం గురించి సరోజా నుంచి తెలుసుకుంటారు. 'మొక్కల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తుంది' అని సరోజ అంటారు. తోటపనిలో ఆమె చేస్తున్న కృషికి 2015లో తమిళనాడు హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ నుంచి అవార్డు అందుకున్నారు. తర్వాత 2019లో అన్నా విశ్వవిద్యాలయం నుంచి కూడా మరో అవార్డు అందుకున్నారు. 2012లో సరోజ భర్త చనిపోయారు. పిల్లలు వేరే ప్రాంతంలో స్థిరపడ్డారు. కానీ పెరుగుతున్న మొక్కల కారణంగా ఆమె ఎప్పుడూ ఒంటరిగా ఉన్నట్టు భావించలేదని చెప్తున్నది. 'ఈ మొక్కలు ఎప్పుడూ నా కోసం ఉంటాయి' అని చిరునవ్వుతో చెప్తున్నది.

సక్సెస్ మంత్ర



భారతదేశంలో అతిపెద్ద పానీయాల ఉత్పత్తి సంస్థ పార్లే ఆగ్రో. ఫ్రూటీ, ఆపీ, ఫ్రూటీ ఫిజ్, ఆఫీ ఫిజ్, బెయిలే, ఫ్రియో, ఢిషూమ్, కేఫే క్యూబా వంటివెన్నో ఈ సంస్థ నుంచి మార్కెట్‌కి వచ్చాయి. నాలుగువేల కోట్ల సంస్థ అయిన పార్లే 5 వేలకు పైగా పార్టనర్స్ నెట్‌వర్క్‌తో, దేశవ్యాప్తంగా 14 లక్షల ఔట్‌లెట్స్‌తో దూసుకుపోతున్నది. భారతీయ వినియోగ దారుడి అవసరాలకు అనుగుణంగా పరిశ్రమ దృక్పథాన్ని, ఆలోచన విధానాన్ని సమూలంగా మార్చేసిన పార్లే విజయం వెనుక ఒక మహిళ ఉంది. ఆమె సోనాచౌహాన్. 'పార్లే ఆగ్రో' సీఈఓ అయిన చౌహాన్ విజయగాథనే ఈ వారం సక్సెస్‌మంత్ర.




# పానీయాల ఉత్పత్తి రంగంలో విజేత సోనాచౌహాన్

**సోనా చౌహాన్** ఇండియాలో మోస్ట్ పవర్‌ఫుల్ బిజినెస్ వుమెన్‌లో ఒకరు. పార్లే ఆగ్రో కంపెనీకి సీఈఓ అయిన ఆమె.. 2006లో తన తండ్రి నుంచి కంపెనీ పగ్గాలు పొందారు. ఏడాదికి రూ. 600 కోట్ల బిజినెస్ చేసే కంపెనీని.. రూ.4,200 కోట్ల బిజినెస్ చేసే కంపెనీగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం పార్లే ఆగ్రోకి 13 చోట్ల ఉత్పాదక యూనిట్లు ఉన్నాయి. ప్యాకేజ్డ్ వాటర్, యాప్పీ ఫిజ్ డ్రింక్స్, స్నాక్స్, ఫ్రూటీ ఈ ఉత్పత్తులన్నీ పార్లే సొంతం.

### చిన్నవయసులోనే..

43 ఏండ్ల సోనా చౌహాన్ తన 22వ ఏట అంటే 1999లో తొలిసారి కంపెనీ బోర్డులో డైరెక్టర్‌గా చేరారు. 2006లో ఆమె సీఈఓ అయ్యాక వారి గ్రూపు విభిన్న రంగాల్లో వృద్ధిచెంది 50 కంటే ఎక్కువ దేశాలకు విస్తరించింది. 'బిజినెస్ స్కూల్ లుసానే' నుంచి బ్యాచిలర్ డిగ్రీ పొందిన సోనా తన తండ్రి ప్రకాశ్ చౌహాన్‌తో ఫ్యామిలీ బిజినెస్‌లో చేరింది.

### ఉద్యోగులను గౌరవిస్తూ..

2006లో పార్లే సీఈఓ కాగానే... ఆల్రెడీ తెలిసిన కంపెనీయే కావడంతో చౌహాన్



ఈజీగానే నిలదొక్కుకున్నారు. ఐతే... కంపెనీలో ఎక్కడెక్కడ లోటుపాట్లు ఉన్నాయో గుర్తించారు. అప్పటికే ఉన్న టీమ్‌లో ఉత్సాహం నింపడంతో పాటు కొత్తవాళ్లకు ఉద్యోగాలు ఇచ్చారు. ఉద్యోగులను అమితంగా గౌరవిస్తూ... వాళ్ల సలహాలు, సూచనలూ తెలుసుకునేవాళ్లు. కుటుంబ భ్యులతో కంటే.. కంపెనీ ఉద్యోగులతోనే ఆమె ఎక్కువ సేపు ఉండసాగారు. అందువల్ల కంపెనీలో ఉద్యోగులు కూడా ఆమె పట్ల అంతే గౌరవంతో మెలగసాగారు. సరైన వ్యక్తులను నియమించుకోవడం, ప్రతిభావంతులను కంపెనీలో నిలుపుకోవడం, కొత్త మార్పులకు తగినట్లు కంపెనీని నడపడం లో అనేక సవాళ్లను అధికమించి ముందుకు నడిపించడంలో విజయం సాధించారు.

### కుటుంబమంతా ఒక్కటిగా..

నిజానికి చౌహాన్ తండ్రికి ముగ్గురు కూతుళ్లు. పెద్ద కూతురైన చౌహాన్‌కే కంపెనీ బాధ్యతలు అప్పగించాలని ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడాక నిర్ణయం తీసుకున్నారు. ఐతే.. ఈ విషయంలో ఆయన రెండో మాట లేకుండా ఒకటే మాటకు కట్టుబడ్డారు. ఫలితంగా చౌహాన్‌పై పెద్ద బాధ్యత పడింది. చౌహాన్ మొదటి చెల్లి అలిషా చౌహాన్.. కంపెనీ కోసం ఫిలాంత్రోపీ చేశారు. చిన్న చెల్లి నదియా చౌహాన్... రీసెర్చ్, డెవలప్‌మెంట్, సేల్స్, మార్కెటింగ్ స్ట్రాటజీ, కొత్త మార్కెట్ల అభివృద్ధి వంటివి చూసుకుంటున్నారు. ఇలా ముగ్గురికీ వేర్వేరు బాధ్యతలు అప్పగించిన చౌహాన్ తండ్రి... ఇక వాళ్ల పనుల్లో జోక్యం చేసుకోలేదు. ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. ఫలితంగా చౌహాన్ తనను తాను తీర్చిదిద్దుకుంటూ వచ్చారు. 'నేను మా నాన్ననే మార్గదర్శకుడిగా భావిస్తాను. చాలా చిన్న వయసులో నేను ఆయనతో పనిచేసే అవకాశం పొందాను. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అంటారామె.

### విజయ తీరాలకు

చౌహాన్ లీడర్‌షిప్‌లో ఫ్రూటీ.. మ్యాంగో డ్రింక్స్ సెగ్మెంట్‌లో దూసుకెళ్లింది. పెప్సీ, కోకోకోలా లాంటి మల్టీ నేషనల్ కంపెనీ బ్రాండ్లు, ఇతరత్రా గట్టి పోటీ ఇచ్చినా.. ఆమె ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. మనం ఏం చేస్తున్నాం.. ఏం చెయ్యాలి అని ఆలోచించారు. వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ కంపెనీని విస్తరిస్తూ పోయారు. ప్రధానంగా వినియోగదారుల రుచులు, అభిప్రాయాలకు అనుగుణంగా.. తమ ప్రాడక్ట్స్‌లో మార్పులు చెయ్యడంతో.. ఆమె విజయం వైపు నడవగలిగారు. 'సవాళ్లతో పాఠం నేర్చుకోవాలి. కలల్ని సాకారం చేసుకునే క్రమంలో ఎదురయ్యే పరిస్థితుల నుంచి ఏదో ఒకటి కొత్తగా తెలుస్తుంది.దారిలో ఆటంకాలు వచ్చినప్పుడు వాటిని దాటుకు పోయేందుకు మరింత గట్టిగా కృషి చేయాలి. ముందుకు సాగాలంటే తెలివిని, భావోద్వేగాల్ని బ్యాలెన్స్ చేయాలి' అని అంటారు చౌహాన్.

### అవార్డులు, రివార్డులు

చౌహాన్ వ్యాపారంలో సాధించిన విజయాలకు గాను అనేక అవార్డులు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. బిజినెస్ సూపర్ అచీవర్ అవార్డ్, 4 జీ బిజినెస్ మార్కెటింగ్ అవార్డ్, బెస్ట్ యంగ్ కార్పొరేట్ లీడర్, ఎఫ్ఐసీసీఐ ఎఫ్ఎల్ఓ యంగ్ ఉమెన్ అచీవర్ అవార్డ్, జీఆర్8 ఎఫ్ఎల్ఓ ఉమెన్ అచీవర్‌తో పాటు అనేక పురస్కారాలు ఆమెకు లభించాయి.

**నాకు మా అమ్మ నుంచి చాలా సహాయం లభిస్తుంది. ప్రతి విషయంలో నేను అమ్మపై పూర్తిగా నమ్మకం పెట్టుకున్నాను. ఆమె ఒక తల్లి, స్నేహితురాలు, ఒక మార్గదర్శకురాలుగా ఉంటుంది. బిజినెస్ ప్లానింగ్‌లో కంపెనీ అభివృద్ధినే దృష్టిలో పెట్టుకుంటాను. ఒక మహిళగా అభద్రతకు ఎపుడూ లోనవలేదు. బిజినెస్‌లో సాధారణ సవాళ్లు వచ్చాయి. వాటన్నింటినీ ఎదుర్కొంటూనే ఉంటాం. ఇతరులతో కాకుండా నాతో నేనే పోటీ పడుతూ ముందుకెళ్లడం నా జీవిత సూత్రం.**

**-సోనా చౌహాన్**

### తరువాతి లక్ష్యం ఇదీ

2022 నాటికి టర్నోవర్‌ను డబుల్ చెయ్యాలని చౌహాన్ టార్గెట్‌గా పెట్టుకున్నారు. అదే సమయంలో తన కొడుకు తనతో రోజూ ఎంతో కొంత సేపు గడిపేలా కూడా ప్లాన్ వేసుకున్నారు. రోజూ చేసే పనుల్లో ప్రతీ దానికీ టైమ్ ఫ్రేమ్ సెట్ చేసుకున్నారు. చౌహాన్ కొడుకుకు కార్ల బొమ్మలంటే చాలా ఇష్టం. ఇది గమనించిన ఆమె.. ఆ పిల్లాణ్ని.. వీలైనన్ని కార్ల షోరూంలకు తీసుకెళ్తున్నారు. మనకు ఏది ఇష్టమో దాన్నే తల్లిదండ్రులు మనకు దగ్గర చేస్తే.. అందులో విజయం సాధిస్తామన్న నమ్మకం ఆమెకు ఉంది.

## ఆ బాధే గెలిపించింది..

**సంతోషంగా ఉన్నప్పుడు బాధ్యతలు గుర్తుకురావు. అదే కష్టాలొస్తే! ప్రతి విషయంలో ఆచితూచి అడుగులేస్తాం. ఆ కష్టం, బాధకు కారణం ఏంటో, తెలుసుకొని చాలెంజింగ్‌గా తీసుకుంటాం. అదే రేపటి విజయంగా మారుతుంది. ఈమె విషయంలోనూ అలానే జరిగింది.**




ప్రతి మహిళ విజయం వెనుక ఒక పురుషుడుంటాడు. కానీ ఈమె జీవితంలో అలా జరుగలేదు. ప్రేమించిన అతను దూరమవ్వడం వల్లనే 'మిస్ గ్రేట్ బ్రిటన్ 2020' కిరీటం అందుకున్నానంటున్నది. ఆమె పేరు జెన్ అట్కిన్. 26 ఏండ్లు. లింకన్‌షోర్‌కు చెందిన ఆమె చూడ్డానికి స్లిమ్‌గా అందంగా ఉంటుంది. ఇలా ఒకప్పుడు ఉండుంటే.. కథ ఇంత దూరం వచ్చేది కాదు. ఒకప్పుడు జెన్ బరువు సుమారు 90 కిలోల పైమాటే. 2011లో జెన్, ఆమె బాయ్‌ఫ్రెండ్‌తో సంతోషంగా ఉండేది. 2015 వచ్చేసరికి జెన్ బరువు సెంచరీ దాటేసింది. తీరా పెండ్లి విషయానికి వచ్చేసరికి బరువు ఎక్కువ ఉన్నందున ఆమెను తిరస్కరించాడు. దీంతో జెన్ భరించలేకపోయింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నది. ఎలా అయినా బరువు తగ్గాలని లోకల్ జీమ్‌లో చేరింది. మెల్లమెల్లగా బరువు తగ్గడం ప్రారంభమైంది. ఆత్మవిశ్వాసం బలపడింది. మిస్ గ్రేట్ బ్రిటన్ పోటీల్లో పాల్గొన్నది. 2017లో సెమీ-ఫైనల్స్, 2018లో ఫైనల్‌కు వెళ్ళి, చివరి ప్రయత్నంలో '75వ మిస్ గ్రేట్ బ్రిటన్ 2020' కిరీటం అందుకున్నది. ఆ తర్వాత 'టీమ్ జిబి'కి పోటీ పడుతున్న వారికి మనదేశం తరుపున జెన్, ఆమె సోదరుడు కలిసి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెండేండ్లలో 59 కిలోలు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ కిరీటం రావడం అంతా కలలా ఉందంటున్నది. ఆత్మవిశ్వాసమే ఆమెను నడిపిస్తున్నది.


## ఎక్కువ పూల కోసం..



- మల్లెచెట్టుకు ఎక్కువ పూలు పూయాలంటే.. ఎండినంత వరకు కొమ్మల్ని కత్తెరించాలి. ఆకులు కట్ చేయాలి.
- మొక్క ఆరోగ్యంగా ఉండాలంటే దాని మొదట్లో ఎండిన ఆకులు పడి ఉంటాయి. ఇవి ఎప్పటికప్పుడు తీసెయ్యాలి.
- కనీసం నెలకోసారి మొక్క మొదట్లోని మట్టి తీసేసి కొత్త మట్టిని చేర్చాలి.
- పప్పులు, బియ్యం కడిగిన నీటిని, మిగిలిన మజ్జిగను వారానికి రెండు మూడుసార్లు కరివేపాకు మొక్కకు పోస్తే అది ఆరోగ్యంగా పెరుగుతుంది.
- మొక్క నాటేముందు మట్టిలో కొబ్బరి పీచు కలిపి మొక్క నాటితే మొక్క బాగా పెరుగుతుంది.

# పాదాలతో శరీరానికి మసాజ్

**శరీరంలోని భాగాలన్నీ పాదానికి అనుసంధానమై ఉంటాయని అందరూ అంటుంటే వింటూ ఉంటాం. అయితే పాదంలో ఎక్కడ ఏ భాగం ఉంటుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఎందుకంటే ఎవరికీ దీనిపై అవగాహన లేకపోవడమే. అందుకే పాదంలో ఎక్కడ మసాజ్ చేస్తే ఏ అవయవం రిలాక్స్ అవుతుందో తెలుసుకోండి.**



**తల :** పాదంలోని బొటనవేలు తలకు కనెక్ట్ చేసి ఉంటుంది. బొటనవేలుకి మసాజ్ చేయడం వల్ల తలనొప్పి, అలసట, చిరాకు నుంచి బయటపడవచ్చు. అంతేకాకుండా బ్రైన్ షార్ప్‌గా ఉండేలా చేస్తుంది. ఎప్పుడూ పాజిటివ్ మైండ్‌తో ఉండేలా చూస్తుంది.

**కళ్లు :** దృష్టి సమస్య, కళ్ళలో పుండ్లు ఏర్పడడం, ఎరుపు రంగు, నొప్పితో సహా అనేక రకాల సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. రెండవ, మూడవ కాలివేళ్లకి దిగువన ఉన్న పాదాల ప్రాంతానికి మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల కంటి సమస్యలతో బాధపడేవారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

**చిన్నప్రేగు :** ఫుట్ మసాజ్ వల్ల ప్రయోజనం పొందే తర్వాతి అవయవం పేగు. మడమ పైన పాదం మధ్యలో ఉన్న భాగాన్ని మసాజ్ చేయడం వల్ల మెరుగైన జీర్ణక్రియకు తోడ్పడుతుంది. అజీర్ణంతో బాధపడేవారికి ఇది బాగా ఉపయోగపడుతుంది.

**ఊపిరితిత్తులు :** పాదంలోని అడుగున బంతుల మధ్య ప్రాంతానికి ఇవి అనుసంధానించబడినట్లు చెబుతున్నారు. అస్తమాతో బాధపడుతున్న వారికిఇక్కడ మసాజ్ చేస్తే గొప్పరిలీఫ్‌గా ఉంటుంది. ఇది ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి ప్రయత్నిస్తుంది. ఎప్పుడైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

**మడమ :** పాద మడమ బాగంలో మసాజ్ చేస్తే రిఫ్లెక్సాలజీ ప్రకారం తొడ వెనుక భాగపు నరాలు, వెనుక వీపు మధ్య పరస్పర సంబంధం ఉంది. వెన్నునొప్పితో బాధపడేవారికి మడమలను మసాజ్ చేయడం వల్ల ఉపశమనం లభిస్తుంది.

**మెడ :** ఈ కాలంలో మెడ నొప్పులు సర్వసాధారణం. పాదం బొటనవేలు కింద ఉన్న ప్రాంతాన్ని మసాజ్ చేయడం వల్ల మెడభాగంలోని నొప్పులు దూరమవుతాయి. ఆరోగ్య ప్రయోజనాలను పొందడానికి ఈ ప్రాంతాన్ని వేళ్ళతో మసాజ్ చేయాలి.

**గుండె :** అన్ని అవయవాలకన్నా గుండె ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. గుండె దడ లేదా ఛాతి నొప్పిని ఎదుర్కొంటున్న ఎవరైనా వెంటనే వైద్యుడిని కలవాలి. ఈలోపు కుడిపాదంలోని చిటికిన వేలు కింది భాగంలో మసాజ్ చేయాలి. ఇది గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. అంతేకాకుండా ప్రసరణ వ్యవస్థకు దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి.


**మోకాళ్లు :** ప్రతి మడమ వెలుపలి భాగం మోకాళ్ళకు ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటుంది. మోకాలి నొప్పి లేదా దీర్ఘకాలిక మోకాలి నొప్పితో బాధపడుతున్న వారు ఈ ప్రాంతంలో మసాజ్ చేయాలి.

**కడుపు :** ఈ ప్రాంతంలో మసాజ్ చేయడం వల్ల జీర్ణ శక్తి మెరుగుపడుతుంది. అంతేకాకుండా అజీర్ణం, ఉబ్బరం లేదా వాయువుకు మంచిది.

**థైరాయిడ్ :** ఈ జెనరేషన్‌లో చిన్నా, పెద్దా తేడాలేకుండా అందరికీ థైరాయిడ్ సమస్య ఉంటుంది. కానీ థైరాయిడ్ గ్రంథి మొత్తం ఆరోగ్యాన్ని పెంచడానికి ఫుట్‌మసాజ్‌ను ఉపయోగించవచ్చు. థైరాయిడ్ ప్రయోజనం కోసం పాదంలోని లోపలి భాగాన్ని మసాజ్ చేయాలి.

**లివర్ :** కుడిపాదంలో ఫొటోలో చూపించిన విధంగా ఈ ప్రాంతానికి మసాజ్ చేయడం వల్ల కాలేయం పనితీరు మెరుగవుతుంది. ఆ అవయవాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

## చిరుతిండ్లు మానాలంటే..



- పిల్లలు ఎలాంటి పదార్థాలు ఇష్టపడుతున్నారనేది గమనించాలి. దాన్ని బట్టి వాళ్లు తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేయాలి. ముఖ్యంగా నోరూరించేవి, ఆకట్టుకునేలా కనిపించే పదార్థాలను ఇంట్లోనే చేసి పెట్టాలి.
- పిల్లల చేతికి డబ్బులిచ్చి కొనుక్కోమని చెప్పకుండా వాటిని మీరే కొని బాక్సుల్లో సర్దితే బెపెించవద్దు. ఒక వేళ కొనివ్వాల్సి వచ్చినా ఆ పదార్థాలు వారికి కనబడకుండా చూడాలి.
- కూల్‌డ్రింక్స్‌ను పిల్లలకు దూరంగా ఉంచాలి. ఒకవేళ పిల్లలు జంక్ ఫుడ్ తింటామని మారాం చేసినా ఇంట్లోనే నూడుల్స్, స్నాక్స్ వంటివి చేసివ్వాలి. పానీయాలు, పండ్లరసాలు పూర్తిగా చక్కెర లేని రకాలను ఎంచుకోవాలి.
- పోషకాహారాన్ని ఒకేసారి తినమన్నా పిల్లలు ఇష్టపడరు. ముందు కొద్దిగానే అలవాటు చేయాలి. తర్వాత వాళ్లంతట వాళ్లేవడ్డించుకొని తినేలా ప్రోత్సహించాలి.
- పిల్లలకు ఎక్కువగా పండ్లు తినిపించడం అలవాటు చేయాలి. జంక్‌ఫుడ్‌ను క్రమంగా దూరం చేయాలి.

## పొదుపు ఇలా..



- ప్రతి నెలా అవే అవసరాలు అంతే ఖర్చు అనుకుంటాం. కానీ తీరా దుకాణానికి వెళ్లాక మనం అంచనా వేసిన ఖర్చు దాటిపోతుంది.
- అటువంటప్పుడు ముందే స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకుంటే చాలు. దాని ప్రకారం ఖర్చును తగ్గించుకోవచ్చు.
- ఆదాయానికి మించిన ఖర్చును తగ్గించుకోవాలి. అనవసరమైన వస్తువులను కొనుగోలు చేయడం మానేయాలి.
- కరంటు బిల్లు, ఫోన్ బిల్లు మనకు తెలియకుండానే పెరిగిపోతుంటాయి. అటువంటి వాటిని తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి.
- డబ్బు చేతిలో కనిపించగానే ఏదైనా వస్తువు కొంటే బాగుండు అనే ఆలోచన వస్తుంది. అటువంటి సమయంలో ఆ వస్తువు ఎంతవరకు ఉపయోగపడుతుందనే విషయాన్ని గమనించి కొనాలి.


నాగవంశీ, వరుణ్‌తేజ్, వెంకీ కుడుముల, నితిన్, రష్మిక మందన్న

# నితిన్ సక్సెస్ చూస్తే సంతోషంగా ఉంది

'ఈ వేడుకకు ఓ అతిథిలా కాకుండా నా మిత్రుడు నితిన్ విజయాన్ని ఆస్వాదించాలని వచ్చాను. సాధారణంగా ఇండస్ట్రీలో రెండో విజయాన్ని అందుకోవడం కొంచెం కష్టం. కానీ దర్శకుడు వెంకీ కుడుముల ఆ పరీక్ష పాసయ్యాడు' అని అన్నారు వరుణ్‌తేజ్. శనివారం సాయంత్రం ఏపీలోని విశాఖపట్నంలో నితిన్ కథానాయకుడిగా నటించిన 'భీష్మ' థాంక్ యూ మీట్ జరిగింది. దీనికి వరుణ్‌తేజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నితిన్ విజయాన్ని చూసి ఆనందపడుతున్నా. గత కొంతకాలంగా మేమిద్దరం సన్నిహితులమయ్యాం. అతనితో స్నేహం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా. ఈ సినిమాకు అన్నీ అద్భుతంగా కుదిరాయి. అందుకే భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే నితిన్ ఈ సినిమా విషయంలో ఒక మోసం చేశాడు. 'భీష్మ..సింగిల్ ఫరెవర్' అంటూ విడుదలకు ముందే పెళ్లి కుదుర్చుకున్నాడు. ఏదిఏమైనా అతని పెళ్లి విషయంలో నేను హ్యాపీగా ఉన్నా. నితిన్ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టబోతున్నందుకు అభినందనలు' అన్నారు. 'నాలుగేళ్ల తర్వాత మళ్లీ నాకు హిట్ వచ్చింది. ఈ సినిమాలో రష్మిక చక్కటి నటన కనబరిచింది. ముఖ్యంగా డ్యాన్సులు బాగా చేసింది. ఈ మధ్యే పవన్ కల్యాణ్‌ను కలిశాను. సినిమా సక్సెస్ అయినందుకు చాలా హ్యాపీగా ఫీలయ్యారాయన. త్వరలో సినిమా చూస్తానని చెప్పారు. ఈ సినిమాకు పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులందరికి కృతజ్ఞతలు' అని నితిన్ చెప్పారు. చిత్ర కథానాయిక రష్మిక మందన్న మాట్లాడుతూ 'నితిన్, వెంకీ నాకు మంచి మిత్రులయ్యారు. సినిమా విజయం ఎంతో సంతోషాన్నిస్తోంది. హిట్ చేసినందకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పింది. ఈ సినిమాను డైరెక్ట్ చేసే అవకాశమిచ్చిన నిర్మాత నాగవంశీ, హీరో నితిన్‌కు దర్శకుడు వెంకీ కుడుముల కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలో అజయ్, సంపత్‌రాజ్, కాసర్ల శ్యామ్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# ప్రతి నెలా యుద్ధం చేస్తున్నా!


శృతిహాసన్

తాము ఎదుర్కొంటున్న శారీరక, మానసిక సమస్యల గురించి బయటకు చెప్పుకోవడానికి చాలా మంది సెలబ్రిటీలు అయిష్టతను కనబరుస్తారు. తమ కెరీర్‌పై అవి ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయని భయపడుతుంటారు. అయితే సీనియర్ నాయిక శృతిహాసన్ మాత్రం నిర్మొహమాటంగా తన మనసులోని అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తుంటుంది. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నానని ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ వేదికగా శృతిహాసన్ పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తాజాగా నెలసరి సమస్య వల్ల తాను ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఓ ఇంటర్వ్యూలో చెప్పింది శృతిహాసన్. ఆమె మాట్లాడుతూ 'రుతుక్రమాన్ని ప్రభావితంచేసే పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్), డిస్మెనోరియా సమస్యలతో నేను పోరాటం చేస్తున్నా. వీటివల్ల నెలసరి విషయంలో నాకు తీవ్రమైన నొప్పి కలుగుతోంది. సాంఘికపరమైన కట్టుబాట్ల వల్ల మహిళలు ఇలాంటి సమస్యల్ని చెప్పుకోవడానికి ఇష్టపడరు. కానీ నేను ధైర్యంగా చెబుతాను. ఆ సమస్యల వల్ల మానసిక ప్రవర్తనలో ఒక్కసారిగా మార్పులొస్తాయి. అధిక బరువుతో బాధపడుతుంటాం. వెంట్రుకలు ఊడిపోవడం...మొటిమలు రావడం..ఇలా ఎన్నో సమస్యల్ని ఫేస్ చేయాల్సి ఉంటుంది. మొత్తంగా ప్రతి నెల ఒక యుద్ధంలా అనిపిస్తుంది. అయితే చాలా మంది మహిళలకు వీటిపై అవగాహన ఉండటం లేదు' అంటూ శృతిహాసన్ భావోద్వేగంగా స్పందించింది.


ప్రముఖ నటి జయసుధ కుమారుడు నిహార్ కపూర్ వివాహం అమృత్ జబల్‌తో గత నెల 26న ఢిల్లీలో జరిగింది. పెళ్లి విందు వేడుకను శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. దీనికి తెలుగు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై నూతన వధూవరుల్ని దీవించారు. సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కొత్త దంపతులకు శుభాకాంక్షలందజేశారు. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, మోహన్‌బాబు, కృష్ణంరాజు, రాఘవేంద్రరావు తదితర సినీ ప్రముఖులు హాజరయ్యారు.

# ఆటాడుకుందాం రా!

**నాయకానాయికలు క్రీడాకారులుగా మారిపోతున్నారు. రియల్‌లైఫ్‌లో కాదు రీల్‌లైఫ్ ఫోర్లు సిక్సర్లతో పాటు గోల్స్ కొట్టబోతున్నారు. భాషాభేదాలకు అతీతంగా క్రీడా నేపథ్య కథాంశాలతో సినిమాల్ని తెరకెక్కించే ట్రెండ్ ప్రస్తుతం పెరిగింది. ఈ స్పోర్ట్స్‌డ్రామా చిత్రాలు యువతరాన్ని ఆకట్టుకునే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో స్టార్ హీరోహీరోయిన్లు ఈ సినిమాల్లో నటించేందుకు ఆసక్తిని చూపుతున్నారు. నటులుగా తమను తాము సరికొత్త పంథాలో ఆవిష్కరించుకునే ఆస్కారమున్న కథలు కావడంతో క్రీడాకారుల పాత్రల్లో ఒదిగిపోయేందుకు తపిస్తున్నారు.**



విజయ్ దేవరకొండ
లావణ్య త్రిపాఠి
తాప్సీ

క్రికెటర్‌గా మైదానంలో ఫోర్లు, సిక్సర్లు కొట్టడానికి రెడీ అవుతోంది తాప్సీ. భారత మహిళా క్రికెటర్ మిథాలీరాజ్ జీవితం ఆధారంగా 'శభాష్ మిథు' పేరుతో ఓ సినిమా తెరకెక్కుతున్నది. మిథాలీరాజ్ పాత్రలో తాప్సీ నటిస్తున్నది. రాహుల్ ఢోలాకియా దర్శకత్వం వహిస్తున్నారు. వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్‌గా రికార్డ్‌ను సృష్టించింది మిథాలీరాజ్. ఇరవై ఏళ్ల కెరీర్‌లో భారత జట్టుకు ఎన్నో మరపురాని విజయాల్ని తెచ్చిపెట్టింది.ఆమె జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరిస్తూ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం తాప్సీ క్రికెట్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకోనుంది. వెండితెరపై ఈ క్రికెటర్ పాత్రకు ప్రాణప్రతిష్ట చేయడానికి మిథాలీరాజ్‌తో తాప్సీ ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న ఈ సినిమాను విడుదల కానుంది.

**షూటర్‌గా కీర్తిసురేష్**

నగేష్ కుకునూర్ దర్శకత్వంలో కీర్తి సురేష్ కథానాయికగా షూటింగ్ క్రీడా నేపథ్యంలో తెలుగులో ఓ సినిమా తెరకెక్కుతున్నది. ఈ చిత్రంలో కీర్తిసురేష్ షార్ప్ షూటర్ పాత్రలో కనిపించబోతున్నది. పల్లెటూరి నుంచి తన ప్రస్థానాన్ని మొదలుపెట్టిన ఓ క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయిలో ఎలా విజేతగా నిలిచిందనే కథాంశంతో స్ఫూర్తిదాయకంగా ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం. ఇందులో కీర్తిసురేష్ డీగ్లామర్ లుక్‌లో కనిపించబోతున్నదని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి 'గుడ్ లక్ సఖి' అనే పేరును ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆది పినిశెట్టి, జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు.


'సీటీమార్'లో తమన్నా

**హాకీ ప్లేయర్ లావణ్య**

లావణ్య త్రిపాఠి హాకీ క్రీడలో మెళకువలను నేర్చుకున్నది. నిజమైన ప్లేయర్స్‌తో కలిసి సాధన చేసింది. 'ఏ1 ఎక్స్‌ప్రెస్' సినిమా కోసం ఆమె ఈ కష్టమంతా పడింది. సందీప్‌కిషన్ కథానాయకుడిగా రూపొందుతున్న ఈ చిత్రానికి డెన్నిస్ జీవన్ కనుకొలను దర్శకుడు. హాకీ క్రీడా నేపథ్యంలో తెలుగులో రూపొందుతున్న తొలి చిత్రమిది. ఇందులో లావణ్యా రావు అనే మహిళా హాకీ ప్లేయర్‌గా లావణ్య త్రిపాఠి కనిపిస్తున్నది. పాత్రలో పర్‌ఫెక్షన్ కోసం ఇటీవలే వారం రోజులు ప్రత్యేక శిక్షణ తీసుకున్నది లావణ్య త్రిపాఠి. ఇతర సినిమాల షూటింగ్‌లతో బిజీగా ఉండి కూడా ప్రాక్టీస్ కోసం హాజరై అంకితభావాన్ని చాటుకున్నట్లు చిత్రబృందం చెబుతున్నారు. నిజమైన హాకీ ప్లేయర్స్‌ను తలపిస్తూ ఛాలెంజింగ్‌గా ఆమె పాత్ర సాగుతుందని అంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది.

**కబడ్డీ కోచ్ తమన్నా**

యువ కబడ్డీ ప్లేయర్స్‌లో ప్రతిభను వెలికితీసే బాధ్యతల్ని చేపట్టింది తమన్నా. కోచ్‌గా అవతారం ఎత్తింది. ఆమె కథానాయికగా సంపత్‌నంది దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సీటీమార్'. గోపీచంద్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో జ్వాలా రెడ్డి అనే తెలంగాణ మహిళా కబడ్డీ టీమ్ కోచ్‌గా తమన్నా నటిస్తున్నది. ఈ సినిమా షూటింగ్‌లో అడుగుపెట్టే ముందు తమన్నా కబడ్డీ క్రీడకు సంబంధించిన పదాలు, రూల్స్‌ను తెలుసుకున్నట్లు సమాచారం.

**వెయిట్ లిఫ్టర్ అంజలి**


వెయిట్‌లిఫ్టింగ్‌లో దేశానికి కాంస్య పతాకాన్ని అందించిన తెలుగు క్రీడాకారిణి కరణం మల్లీశ్వరి జీవిత కథతో ఓ సినిమా తెరకెక్కనున్నట్లు తెలిసింది. కోన వెంకట్ ఈ చిత్రానికి కథను అందించడంతో పాటు స్వీయ నిర్మాణ సంస్థ కోన ఫిల్మ్స్ పతాకంపై ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. పాన్ ఇండియన్ స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో కరణం మల్లీశ్వరి పాత్రలో అంజలి నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

**బాక్సర్‌గా విజయ్ దేవరకొండ**

విజయ్‌దేవరకొండ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియన్ చిత్రం రూపొందుతున్నది. ఇందులో విజయ్ దేవరకొండ బాక్సర్‌గా నటిస్తున్నారు. చిత్రీకరణ ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్నది. ఈ సినిమా కోసం విజయ్ మార్షల్ ఆర్ట్స్‌లో విదేశాల్లో ట్రైనింగ్ తీసుకున్నారు. విజయ్‌దేవరకొండ బాటలోనే వరుణ్‌తేజ్ అడుగులు వేయబోతున్నారు. తాజా చిత్రంలో బాక్సర్‌గా నటిస్తున్నారు. క్రీడానేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కిరణ్ కొర్రపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం వైజాగ్‌లో ఈ సినిమారెగ్యులర్ షూటింగ్ జరుగుతున్నది. ఆది పినిశెట్టి హీరోగా తెలుగు, తమిళ భాషల్లో ఓ స్పోర్ట్స్ డ్రామా చిత్రం రూపొందుతున్నది. పృథ్వీ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో తన కలను సాకారం చేసుకోవడానికి ప్రయత్నించే యువ అథ్లెట్‌గా ఆది పినిశెట్టి కనిపిస్తున్నారు.


కీర్తి సురేష్

**బాలీవుడ్ స్పోర్ట్స్ మేనియా**

దేశానికి తొలి క్రికెట్ ప్రపంచకప్‌ను అందించి కోట్లాది మంది క్రీడాభిమానుల హృదయాల్ని గెలుచుకున్న కపిల్‌దేవ్ టీమ్ ప్రయాణాన్ని ఆవిష్కరిస్తూ తెరకెక్కుతున్న చిత్రం '83'. కబీర్‌ఖాన్ దర్శకుడు. కపిల్‌దేవ్ పాత్రలో రణ్‌వీర్‌సింగ్ నటిస్తున్నారు. సునీల్ గవాస్కర్ పాత్రలో తాహిర్ రాజ్ బాసిన్, కృష్ణమాచారి శ్రీకాంత్‌గా జీవా, రోమీ దేవ్‌గా దీపికాపదుకునే.. భిన్న భాషలకు చెందిన నటీనటులు ఈసినిమాలో నటిస్తున్నారు. పుట్‌బాల్ క్రీడలో దేశానికి అద్భుతమైన విజయాల్ని అందించిన హైదరాబాదీ కోచ్ అబ్దుల్ రహీమ్ జీవిత కథ ఆధారంగా రుపొందుతున్న చిత్రం 'మైదాన్'. అబ్దుల్ రహీం పాత్రలో అజయ్‌దేవ్‌గన్ నటిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్నది. ప్రియమణి కథానాయికగా నటిస్తున్నది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ బయోపిక్‌లో ఆమె పాత్రను పరిణితీ చోప్రా పోషించనున్నది. మరో స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు బయోపిక్‌ను నటుడు సోనూసూద్ తెరకెక్కించబోతున్నారు. వీరితో పాటు టెన్నిస్‌స్టార్ సానియా మీర్జా జీవిత కథతో దర్శకనిర్మాత రోనీ స్క్రూవాలా సినిమాను చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ముక్కుపుడక అమ్మవారు

విభిన్నమైన కథాంశాలతో సినిమాలు చేస్తూ నవతరం తారలకు స్ఫూర్తిగా నిలుస్తున్నది నయనతార. ఆమె కథానాయికగా భక్తి ప్రధాన కథాంశంతో తమిళంలో 'మూక్కుత్తి అమ్మన్'(ముక్కుపుడక ఉన్న అమ్మవారు అని అర్థం) పేరుతో ఓ చిత్రం రూపొందుతున్నది. ఆర్.జె.బాలాజీ, ఎన్.జె. శరవణన్ దర్శకత్వం వహిస్తున్నారు. నయనతార ఫస్ట్‌లుక్‌ను శనివారం చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో చేతిలో త్రిశూలం ధరించి తలపై కిరీటంతో ప్రశాంత వదనంతో నయనతార కనిపిస్తున్నది. ఆమె పాత్ర భిన్న పార్శ్వాలతో వైవిధ్యంగా ఉంటుందని చిత్ర బృందం చెబుతున్నారు. సమకాలీన అంశాలతో తెరకెక్కిస్తున్న పూర్తిస్థాయి భక్తిప్రధాన చిత్రమిదని సమాచారం.


నయనతార

**'గడచిన కొన్నేళ్లుగా గ్రామీణ కళలు, కుల వృత్తులు క్షీణదశకు చేరుకున్నాయి. ఏవో కొన్ని మిగిలి ఉన్నా అభివృద్ధి పేరుతో వాటిని సైతం కాలరాసే ప్రయత్నం జరుగుతోంది. 'పలాస 1978' చిత్రంలో ఎనభైదశకం నాటి అలాంటి పరిస్థితుల్ని వాస్తవిక కోణంలో ఆవిష్కరించాను' అని అన్నారు కరుణకుమార్. ఆయన దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'పలాస'. రక్షిత్ అట్లూరి, నక్షత్ర జంటగా నటించారు. ఈ నెల 6న ప్రేక్షకులముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు కరుణకుమార్ ఆదివారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు.**


కరుణకుమార్

# సార్వజనీన కథ ఇది

నాకు కథలు రాయడం అలవాటుగా ఉండేది. స్వచ్ఛభారత్ కోసం చేసిన 'చెంబుకు మూడింది' లఘు చిత్రానికి జాతీయస్థాయిలో అవార్డు వచ్చింది. ఆ తర్వాత కేటీఆర్‌గారి ప్రోత్సాహంతో ప్రభుత్వ యాడ్స్ రూపొందించాను. నేను పుట్టిపెరిగిందంతా శ్రీకాకుళం జిల్లా పలాసలోనే. దాంతో అక్కడి ప్రజల జీవన స్థితిగతులపై సంపూర్ణమైన అవగాహన ఉంది. 1978లో పలాసలో జరిగిన వాస్తవ సంఘటనల స్ఫూర్తితో కథ రాసుకున్నా. నాటి భూస్వామ్య, ఆధిపత్య శక్తుల ప్రభావం ఎలా ఉండేదో ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాను. సార్వజనీన కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. ఒకప్పుడు గ్రామాలు స్వయం సమృద్ధితో ఉండేవి. అక్కడి ప్రజలు సంతృప్తిగా జీవితం సాగించేవారు. కానీ నేడు పరిస్థితులు మారిపోయాయి. వాటి గురించి ఈ సినిమాలో చర్చించాం. ఒక వ్యక్తి, కుటుంబ కథ కాదిది. సమూహానికి చెందినది.

**అందుకే కొత్త వాళ్లతో..**


ఈ సినిమా కాన్సెప్ట్‌లో బలమైన ఉద్వేగాలున్నాయి. విస్తృత పరిధి వున్న కథాంశమిది. అందుకే కొత్తవాళ్లైతేనే ఇమేజ్‌లకు దూరంగా న్యాయం చేయగలరనిపించింది. గత 25ఏళ్లలో తెలుగు చిత్రసీమలో ఈ తరహా ఇతివృత్తంతో సినిమా రాలేదని నమ్మకంగా చెబుతున్నా. ఇండస్ట్రీలోని చాలా మంది ప్రముఖులు సినిమా చూసి బాగుందని మెచ్చుకోవడం సంతృప్తినిచ్చింది.



నమస్తే తెలంగాణ
# నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 2 మార్చి 2020


## సమయం తక్కువ

- పరీక్షలో మొత్తం 100 ప్రశ్నలు, సమయం 1 గంట. అంటే వేగంగా సమాధానాలను గుర్తించాలి.
- జనరల్ అవేర్‌నెస్‌పై బాగా దృష్టి సారించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ స్కోర్ సాధించవచ్చు.
- పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పరీక్షల వారికి సిలబస్‌లో వ్యత్యాసాలు ఉన్నాయి. మీరు రాయాలనుకున్న పరీక్ష సిలబస్‌ను స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో 13, 14 పేజీల్లో ఇచ్చారు.
- రీజనింగ్‌కు సంబంధించి బేసిక్స్ అంటూ సిద్ధం కావాల్సిన అవసరం లేదు, నేరుగా ప్రాక్టీస్ పరీక్షలు రాయాలి.
- నెగెటివ్ మార్కులు ఉన్నందున ఊహించి సమాధానాలు పెట్టే పద్ధతికి స్వస్తి పలకాలి.
- తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నంలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి.
- పరీక్ష జూన్‌లో ఉంది. ఇంకా నాలుగు నెలల సమయం ఉంది. కాబట్టి అభ్యర్థులు క్వాంట్, రీజనింగ్, ఇంగ్లిష్‌కు సంబంధించి మాక్ టెస్టులను మార్చి 10 లేదా 15 నుంచి రాసేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి జూన్ 4 లేదా 5వ తేదీ వరకు జరిగిన ఘటనలకు సంబంధించి పూర్తి స్థాయి బ్యాగ్రౌండ్‌లను సిద్ధం చేసుకోవాలి. అంతకు ముందే పూర్తి స్థాయి మాక్‌టెస్టులను కూడా సాధ్యమైనన్ని ఎక్కువ రాయాలి.



**కేంద్ర ప్రభుత్వంలోని వేర్వేరు విభాగాల్లో ఉన్న ఖాళీల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇందులో కొన్ని పోస్టులకు పదో తరగతి, కొన్నింటికి ఇంటర్మీడియట్, మరికొన్నింటికి డిగ్రీ అర్హతలు ఉన్నాయి. అన్ని రకాల ఉద్యోగాల పరీక్షలకు జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (బేసిక్ అర్థమెటిక్ స్కిల్స్), ఇంగ్లిష్ లాంగ్వేజ్ (బేసిక్ నాలెడ్జ్) కామన్‌గా వస్తాయి. కాబట్టి ఆయా సబ్జెక్టుల్లో ప్రిపరేషన్ మెలకువలు నిపుణ పాఠకుల కోసం అందిస్తున్నాం..**

# ఎస్సెస్సీ కొలువు సాధనతో సులువు



- **జనరల్ అవేర్‌నెస్:** జనరల్ స్టడీస్‌కు జనరల్ అవేర్‌నెస్ భిన్నమైనది, విస్తృతమైనది. జనరల్ స్టడీస్‌లో హిస్టరీ, ఎకానమీ, పాలిటీ, సైన్స్, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కరెంట్ అఫైర్స్ అంటే.. తాజా సంఘటనలకు సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అయితే జనరల్ అవేర్‌నెస్ అంటే జనరల్ స్టడీస్ + కరెంట్ అఫైర్స్ అనుకోవచ్చు. ఇందులో తాజా సంఘటనలను చదివి, వాటి పూర్వాపరాలు తెలుసుకోవాలి. ఇందులో కూడా ఎకానమీ, పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, జాగ్రఫీ అంశాలు కీలకపాత్ర పోషిస్తాయి. కరెంట్ అఫైర్స్‌కు పూర్వ రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించడం కీలకం.

కొన్ని ఉదాహరణలు.

1. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను సందర్శించారు. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. అలాగే ట్రంప్ రాక సందర్భంగా 'నమస్తే ట్రంప్' అనే కార్యాక్రమాన్ని నిర్వహించారు. నేరుగా ఇరుదేశాల మధ్యకుదిరిన ఒప్పందాలపై ప్రశ్నలు అడగవచ్చు. ఈ అంశానికి సంబంధించి జాగ్రఫీ, హిస్టరీ, ఎకానమీ అంశాల నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. వీటిని గుర్తించడమే జనరల్ అవేర్‌నెస్, ఎలాగంటే..

ఎ. నమస్తే ట్రంప్ ఏ నగరంలో జరిగింది? (అహ్మదాబాద్)
బి. అహ్మదాబాద్ ఏ నది ఒడ్డున ఉంది? (సబర్మతి, ఇది జాగ్రఫీకి సంబంధించింది)
సి. సబర్మతి నది ఎక్కడ జన్మిస్తుంది? (ఆరావళి పర్వత శ్రేణిలోని ఉదయ్‌పూర్ జిల్లాలో, రాజస్థాన్, ఇది జాగ్రఫీకి సంబంధించిందే)

ఇదే అంశానికి సంబంధించి చరిత్ర పరంగా ఏం చదువుకోవాలంటే..
ఎ. అహ్మదాబాద్ నగరాన్ని ఎవరు నిర్మించారు? (కర్ణా అనే రాజు, సోలంకి వంశస్థుడు)
బి. అహ్మదాబాద్ నగరం అసలు పేరు? (కర్ణావతి)
సి. జాతీయ ఉద్యమంలో భాగంగా అహ్మదాబాద్ నగరంలో ఆశ్రమాలను స్థాపించిన జాతీయ నాయకుడు ఎవరు? (మహాత్మాగాంధీ)
డి. అహ్మదాబాద్ మున్సిపాలిటీలో పనిచేసి, తర్వాత భారత ఉప ప్రధాని అయిన నేత ఎవరు? (వల్లభాయ్ పటేల్)

**ఆర్థిక అంశాలకు సంబంధించిన ప్రశ్నలు**
ఎ. ఆర్థికపరంగా ప్రధానంగా అమెరికా డిమాండ్-భారత వ్యాపారంతో అమెరికాకు ఉన్న వాణిజ్య లోటును తగ్గించడం
బి. అమెరికాకు చెందిన ఏ ఉత్పత్తులను అనుమతించాలని ట్రంప్ పట్టుబడుతున్నారు? (చికెన్, చీజ్)

- ఇలా ఒక తాజా సంఘటనకు సంబంధించి అన్ని అంశాలను సమగ్రంగా చదవాలి. అప్పుడు అది జనరల్ అవేర్‌నెస్ అవుతుంది. ఇలా చదువుతున్నప్పుడు, ప్రాథమిక అంశాలను కూడా అధ్యయనం చేయాలి. అంటే ఇక్కడ వాణిజ్య లోటు అనే పదం వచ్చింది. ఈ నేపథ్యంలో దాని అర్థం తెలుసుకోవాలి. అలాగే కరెంట్ అకౌంట్ లోటు అంటే ఏంటి? ఆ రెండింటికి మధ్య ఉన్న సంబంధం తెలుసుకోవాలి. అప్పుడు ప్రిపరేషన్‌లో సమగ్రత వస్తుంది.

## స్టాక్ జీకే నుంచి వచ్చే అంశాలు..
ఎ. ట్రంప్‌కు ముందు భారతదేశాన్ని ఎంత మంది అమెరికా అధ్యక్షులు సందర్శించారు? (ఆరు మంది)
బి. అమెరికా అధ్యక్ష హోదాలో భారత్‌ను సందర్శించిన ఒకే ఒక అధ్యక్షుడు ఎవరు? (ఒబామా)
సి. భారత గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏకైక అమెరికా అధ్యక్షుడు ఎవరు? (ఒబామా)
డి. భారత్‌ను సందర్శించిన తొలి అమెరికా అధ్యక్షుడు? (డ్వైట్ ఐసన్ హోవర్).

- దేశ వ్యాప్తంగా ప్రస్తుతం పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా, అనుకూలంగా ధర్నాలు జరుగుతున్నాయి. ఈ అంశానికి సంబంధించి పాలిటీ నుంచి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. వాటిని చర్చిద్దాం.

ఎ. భారత రాజ్యాంగంలో పౌరసత్వం ఏ భాగంలో ఉంది? (రెండు)
బి. పౌరసత్వాన్ని పొందే విధానాలు ఎన్ని? (ఐదు, జన్మతహా, రక్త సంబంధం ద్వారా, రిజిస్ట్రేషన్, సహజీకృతం, భారత భూభాగంలోకి వచ్చే కొత్త ప్రాంతాలు)
సి. పౌరసత్వాన్ని కోల్పోయే పద్ధతులు? (పరిత్యాగం, సమాపణం, విహీనత)
డి. కేవలం పౌరులకు మాత్రమే ఉండే ప్రాథమిక హక్కులు? (15, 16, 19, 29, 30).

- **అభ్యర్థి ఏం చేయాలి:** పరీక్షకు సంవత్సరం ముందు వరకు జరిగిన పరిణామాలను లోతుగా అధ్యయనం చేయాలి. ఆ అంశానికి సంబంధించి పైన పేర్కొన్నట్లు చరిత్ర, ఎకానమీ, పాలిటీ, జాగ్రఫీ కోణాల్లో చదవాలి. కొన్ని కరెంట్ అఫైర్స్‌కు ఇతర అంశాలతో సంబంధం ఉండక పోవచ్చు. పైన చెప్పిన ఉదాహరణల్లో పౌరసత్వానికి సంబంధించి కేవలం పాలిటీనే చదివాం, దానికి జాగ్రఫీ, ఎకానమీ, హిస్టరీ తదితర అంశాలతో సంబంధం లేదు. ఇలా ప్రతి అంశాన్ని వదిలిపెట్టకుండా క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి

## కరోనా వైరస్
- ఇది ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ అంశం నుంచి సైన్స్, జీకే అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అవి ఒకసారి పరిశీలిద్దాం..

ఎ. వైరస్, బ్యాక్టీరియాలకు తేడాలు
బి. కరోనా ఏ కుటుంబానికి చెందినది

## జీకేకు సంబంధించి
ఎ. కరోనా వైరస్‌ను మొదటగా ఎక్కడ గుర్తించారు? (చైనాలో, 2019 డిసెంబర్)
బి. కరోనా వైరస్ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. తొలిసారి ఇలా ఎమర్జెన్సీని ఎప్పుడు ప్రకటించింది? (2009లో, స్వైన్‌ఫ్లూ విజృంభణతో)
సి. ఇప్పటి వరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీని ఎప్పుడెప్పుడు ప్రకటించింది? (2009-స్వైన్‌ఫ్లూ, 2014-పోలియో, ఎబోలా, 2016-జికా, 2019-ఎబోలా, 2020-కరోనా)

## జాగ్రఫీకి సంబంధించిన ప్రశ్నలు
ఎ. జికా వైరస్‌ను మొదటగా ఏ ప్రాంతంలో గుర్తించారు? (వుహాన్)
బి. వుహాన్ చైనాలోని ఏ ప్రావిన్సులో ఉంది? (హుబే)
సి. వుహాన్ ఏ నది ఒడ్డున ఉంది? (యాంగ్జీ నది)

| భాగం | సబ్జెక్ట్ | ప్రశ్నల సంఖ్య | గరిష్ట మార్కులు |
|---|---|---|---|
| ఎ | జనరల్ ఇంటెలిజెన్స్ | 25 | 50 |
| బి | జనరల్ అవేర్‌నెస్ | 25 | 50 |
| సి | క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 25 | 50 |
| డి. | ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 25 | 50 |

- పరీక్ష సమయం 60 నిమిషాలు. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.50 మార్కుల కోత ఉంటుంది.

- **మెటీరియల్:** జాతీయ స్థాయి పత్రికలతో పాటు తెలుగు పత్రికలను కూడా చదవాలి. అలాగే ప్రాథమిక అంశాలకు సంబంధించి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదివితే సరిపోతుంది. పైన ఇచ్చిన ఉదాహరణల్లో పౌరసత్వానికి సంబంధించి, అలాగే వాణిజ్య లోటుకు సంబంధించి ఆ పుస్తకాల్లో మంచి సమాచారం ఉంది. 6 నుంచి 12వ తరగతి వరకు ఉన్న ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను ఒక పద్ధతి ప్రకారం చదవాలి. ఉదాహరణకు ఎకానమీలో పదో తరగతిలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ) ఉంది. దీనికి కొనసాగింపుగా పదకొండో తరగతిలో ఆర్థిక సంస్కరణలు (ఎకానమిక్ రీఫామ్స్) అన్న అంశాన్ని చదవాలి. అలా అంశాలవారీగా చదవడంతో పాటు కరెంట్ అఫైర్స్‌ను కూడా జోడించాలి. ఇటీవల బొగ్గు తవ్వకాల్లో కూడా ప్రభుత్వం ఎఫ్‌డీఐలను ఆహ్వానించింది. ఇది పుస్తకాల్లో లేదు. ఇలాంటి వాటిని అప్‌డేట్ చేసుకొని చదివితే మంచిస్కోర్ సాధించవచ్చు.

### ముఖ్య తేదీలు
- **దరఖాస్తు (ఆన్‌లైన్):** ఫిబ్రవరి 21 నుంచి మార్చి 20 వరకు
- **ఫీజు చెల్లింపునకు చివరితేదీ:** మార్చి 23
- **చలాన్ జనరేషన్‌కు చివరితేదీ:** మార్చి 23
- **చలాన్ ద్వారా ఫీజు చెల్లింపునకు చివరితేదీ:** మార్చి 25
- **కంప్యూటర్ ఆధారిత పరీక్షల తేదీ:** జూన్ 10 నుంచి 12 వరకు

- **జనరల్ ఇంటెలిజెన్స్:** పదో తరగతి అర్హత ఉన్న పరీక్షలకు కేవలం నాన్-వెర్బల్ రీజనింగ్ మాత్రమే ఉంటుంది. అయితే ఇంటర్, డిగ్రీ అర్హతలు ఉన్న పరీక్షలకు మాత్రం వెర్బల్, నాన్ వెర్బల్ అంశాల నుంచి కూడా ప్రశ్నలు అడుగుతారు. మూడు స్థాయిల పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్‌లో అనాలజీ, సింబాలిక్ ఆపరేషన్స్, నంబర్ అనాలజీ తదితర అంశాలు ఉంటాయి. పరీక్ష అర్హత స్థాయి పెరిగినకొద్దీ అంశాలు పెరుగుతాయి. ముఖ్యంగా, కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, ప్రాబ్లం సాల్వింగ్, క్రిటికల్ థింకింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, సోషల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- రీజనింగ్ విభాగానికి సంబంధించి ఈసారి సోషల్ ఇంటెలిజెన్స్ నుంచి ప్రశ్నలు కూడా ఉంటాయి. సోషల్ ఇంటెలిజెన్స్ అంటే భావోద్వేగ ఘటనలు, ఆ సమయంలో అభ్యర్థి తీసుకునే నిర్ణయాలకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. అలాగే క్రిటికల్ థింకింగ్ అనే అంశాన్ని కూడా పేర్కొన్నారు. పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సిలాజిసం తదితర అంశాలను క్రిటికల్ థింకింగ్ అంశాలుగా చెప్పవచ్చు.

## ఎలా సిద్ధం కావాలి?
- ఈ విభాగానికి సంబంధించి ఎలాంటి బేసిక్స్ అక్కరలేదు. నేరుగా పరీక్షలు రాయాలి. అలాగే సమాధానాలకు సంబంధించి వివరణలను చదవాలి. కనీసం 3 నుంచి అయిదు ప్రశ్నపత్రాలు చేస్తే పట్టు వస్తుంది. ఆ తర్వాత సాధ్యమైనన్ని మాక్ టెస్టులు రాయాలి. 10+2 అర్హత ఉన్న పరీక్షల్లో ఇన్ఫరెన్సెస్‌పై కూడా ప్రశ్నలు ఉంటాయని సిలబస్‌లో స్పష్టంగా ఇచ్చారు. ఒక అంశాన్ని చదివి, అందులో ఇమిడి ఉన్న నిగూఢ అంశాలను అర్థం చేసుకోవడమే దీని లక్ష్యం. కాబట్టి ఆంగ్ల పత్రిక సంపాదకీయాలను చదివి వాటిలో చెప్పని నిగూఢ అంశాలను పరిశీలించుకుంటూ వెళ్లాలి. గ్రాడ్యుయేషన్ స్థాయి పరీక్షల్లో ఇంటెలిజెన్స్ అంశానికి సంబంధించి సిలబస్ విస్తృతంగా ఉంది. అయితే వాటికి ప్రాథమిక అంశాలు ఏం అవసరం లేనందున నేరుగా ప్రాక్టీస్ చేస్తూ వెళితే సరిపోతుంది. పేపర్‌కటింగ్, ఎంబెడెడ్ ఫిగర్స్ తదితర అంశాల నుంచి కూడా ప్రశ్నలు ఉంటాయి.

## చదవాల్సిన పుస్తకాలు
- పోటీ పరీక్షలకు సంబంధించి రీజనింగ్ అన్న పేరుతో అగర్వాల్, ప్రతియోగితా కిరణ్, బ్యాంకింగ్ సర్వీస్ క్రానికల్ తదితర ప్రచురణలు అందుబాటులో ఉన్నాయి. క్రిటికల్ రీజనింగ్‌కు సంబంధించి బ్యాంకింగ్ సర్వీస్ క్రానికల్ ప్రచురించిన రీజనింగ్ పుస్తకం ఉపయుక్తం. నాన్ వెర్బల్ రీజనింగ్‌కు ప్రాక్టీస్ చేయాలి.
- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** పదో తరగతి ఆధారిత పరీక్షల్లో నంబర్ సిస్టమ్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, అర్థమెటిక్ అంశాలు ఉన్నాయి. ముందు బేసిక్స్ సిద్ధం కావాలి. 6 నుంచి 10 తరగతి వరకు ఉన్నపుస్తకాలు లేదా క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగానికి సంబంధించి పోటీ పరీక్షలకు రాసిన ఏ పుస్తకాన్నయినా ఎంచుకోవచ్చు.
- ఇంటర్ ఆధారిత పరీక్షలకు సిలబస్ కొంచెం ఎక్కువగా ఉంది. త్రికోణమితి, క్షేత్ర గణితం నుంచి కూడా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అధ్యయనం చేయాలి.
- డిగ్రీ ఆధారిత పరీక్షలకు డాటా ఇంటర్‌ప్రిటేషన్ కూడా సిలబస్‌లో ఉంది. అయితే వీటికి కూడా అర్థమెటిక్ అంశాలకు సిద్ధమైనవే బేసిక్స్‌గా ఉపయోగపడుతాయి. కేవలం వారం నుంచి 10 రోజుల వ్యవధిలో బేసిక్స్ ప్రిపేరై సాధ్యమైనన్ని ఎక్కువ పరీక్షలు రాయాలి. ఇక్కడ అభ్యర్థులు కీలకంగా గుర్తుంచుకోవాల్సిన అంశం ఏంటంటే, ముందుగా కాన్సెప్ట్స్ సిద్ధమై, ఆ తర్వాతే షార్ట్‌కట్స్‌కు ప్రయత్నించాలి. అంతేకాని మొదలే షార్ట్ కట్స్‌కు ప్రయత్నిస్తే అన్ని రకాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం సాధ్యపడదు.
- **ఇంగ్లిష్:** పదో తరగతి స్థాయి పరీక్షలో ప్రాథమిక ఇంగ్లిష్ పరిజ్ఞానం, గ్రామర్, వాక్య నిర్మాణం, సమాన, వ్యతిరేక అర్థాలు వాటిని ఉపయోగించే విధానాలపై ప్రశ్నలు ఉంటాయి. పదో తరగతి వరకు ఎలాగూ వీటిని చదివి ఉంటారు. కాబట్టి నేరుగా ప్రాక్టీస్ చేయాలి. రెన్ అండ్ మార్టిన్ లేదా ఏదైనా గ్రామర్ పుస్తకం సరిపోతుంది. నిత్య జీవితంలో ఉపయోగపడే పదాల సమాన, వ్యతిరేక అర్థాలు తెలుసుకోవాలి.
- ఇంటర్ ఆధారిత పోస్టులకు సంబంధించి యాక్టివ్, పాసివ్ వాయిస్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, జంబుల్డ్ సెంటెన్సెస్, క్లోజ్ టెస్ట్, కాంప్రహెన్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పోటీ పరీక్షలకు ఉద్దేశించి రాసిన ఏ పుస్తకాన్నయినా ఎంచుకోవచ్చు. నిత్యం 50 కొత్త పదాలు నేర్చుకోవడం లక్ష్యంగా ఎంచుకుంటే మంచిది. గ్రాడ్యుయేషన్ స్థాయి పరీక్షల్లో ప్రశ్నపత్రం ఎ, బి, సి, డి అనే నాలుగు భాగాలుగా ఉంటుంది. ఇందులో సి భాగం ప్రశ్నపత్రం పదో తరగతి స్థాయి ఇంగ్లిష్‌లా ఉంటుంది. మిగతా మూడింటిలో క్లిష్టమైన అంశాలు ఉంటాయి. కాంప్రహెన్షన్, స్పాటింగ్ ఎర్రర్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.



వి.రాజేంద్రశర్మ
ఫ్యాకల్టీ
9849212411

### నోటిఫికేషన్ వివరాలు
- **పదోతరగతి అర్హత పోస్టులు:** టెక్నికల్ ఆపరేటర్ (డ్రిల్లింగ్), లైబ్రరీ క్లర్క్ (జనరల్), లైబ్రరీ క్లర్క్ (బైండింగ్), ఆఫీస్ అటెండెంట్ (ఎంటీఎస్), ఫీల్డ్ అటెండెంట్ (మల్టీ టాస్కింగ్), ఫొటోగ్రాఫర్ మైక్రో, కాంపోసిటర్, క్యాంటీన్ తదితర పోస్టులు ఉన్నాయి
- **10+2 అర్హతతో పోస్టులు:** ల్యాబ్ అసిస్టెంట్ (జియాలజీ), ల్యాబ్ అసిస్టెంట్ (కెమికల్), ల్యాబ్ అసిస్టెంట్ (జియో ఫిజిక్స్), ఫుమిగేషన్ అసిస్టెంట్, ల్యాబొరేటరీ అటెండెంట్, ల్యాబొరేటరీ అసిస్టెంట్ గ్రేడ్-3 (జియాలజీ), జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (డ్రిల్లింగ్) తదితర పోస్టులు ఉన్నాయి.
- **డిగ్రీ అర్హత పోస్టులు:** జూనియర్ ఇంజినీర్ (వేర్వేరు విభాగాలు), ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ ఆఫీసర్, డైటీషియన్, టెక్నికల్ సూపరింటెండెంట్ (వీవింగ్), టెక్స్‌టైల్ డిజైనర్ తదితర పోస్టులు ఉన్నాయి.
- ఇతర వివరాలు, ఖాళీల కోసం ssc.nic.in వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

# నిమ్‌సెట్-2020

## ఎన్ఐటీలలో ఎంసీఏ

**డిగ్రీ లేదా ఇంజినీరింగ్ పూర్తయి కంప్యూటర్‌సైన్స్‌లో ప్రొఫెషనల్ కోర్సు చేద్దామనుకునే వారికి, జాతీయ ప్రాముఖ్యం కలిగిన విద్యా సంస్థల్లో కంప్యూటర్‌కోర్సు చేయాలనుకునే వారికి సువర్ణావకాశం నిమ్‌సెట్. ఈ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన పది ఎన్ఐటీలలో ఎంసీఏ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. ఆ వివరాలు సంక్షిప్తంగా నిపుణ పాఠకుల కోసం...**

- **నిమ్‌సెట్:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్. ఈ టెస్టును ప్రతి ఏటా నిర్వహిస్తారు. ఈ ప్రవేశపరీక్ష ద్వారా మాస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్ అప్లికేషన్స్ (ఎంసీఏ) మూడేండ్ల కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. ఈసారి నిమ్‌సెట్‌ను రాయపూర్ నిట్ నిర్వహిస్తుంది.
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో కింది ఏదైనా ఒక కోర్సు ఉత్తీర్ణత.
- మూడేండ్ల ఫుల్‌టైం బీఎస్సీ/బీఎస్సీ (ఆనర్స్), బీసీఏ, బీఐటీ/బీవొకేషనల్ (కంప్యూటర్‌సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్) ఉత్తీర్ణత.
- గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఈ/బీటెక్

నోట్: ఓపెన్ యూనివర్సిటీ ద్వారా పై మూడేండ్ల డిగ్రీ కోర్సులు ఉత్తీర్ణులైనవారు కూడా అర్హులే. అయితే ఆ కోర్సు యూజీసీ/ఏఐసీటీఈ అనుమతి గుర్తింపు పొందినదై ఉండాలి.



### నిమ్‌సెట్ ద్వారా ప్రవేశాలు కల్పించే ఎన్ఐటీలు
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- అగర్తలా, అలహాబాద్, భోపాల్, కాలికట్, జంషెడ్‌పూర్, కురుక్షేత్ర, రాయ్‌పూర్, సూరత్‌కల్, తిరుచిరాపల్లి, వరంగల్. వీటితోపాటు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ కూడా నిమ్‌సెట్ ద్వారా ఎంసీఏలో ప్రవేశాలు కల్పిస్తారు.
- మొత్తం సీట్ల సంఖ్య -871 (కురుక్షేత్రలోని సెల్ఫ్‌ఫైనాన్సింగ్ సీట్లతో కలిపి)

### పరీక్ష విధానం
- 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్ మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.
- దీనిలో మ్యాథ్స్-50, అనలిటికల్ ఎబిలిటీ&లాజికల్ రీజనింగ్-40, కంప్యూటర్ అవేర్‌నెస్-10, జనరల్ ఇంగ్లిష్-20 ప్రశ్నలు ఇస్తారు.
- ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు ఒకమార్కు కోతవిధిస్తారు.

## ఎంసీఏ చేసినవారికి వందశాతం ప్లేస్‌మెంట్స్
- ఎన్ఐటీలలో ఎంసీఏ చేస్తే మంచి భవిష్యత్ ఉంటుంది. దేశంలోని 31 ఎన్ఐటీలలో పది ఎన్ఐటీలు ఎంసీఏను ఆఫర్ చేస్తున్నాయి. సౌత్ ఇండియాలో నాలుగు ఎన్ఐటీలు ఎంసీఏను అందిస్తున్నాయి. వరంగల్‌లో 54 సీట్లు ఉన్నాయి. వరంగల్ నిట్‌లో సుమారు మూడుదశాబ్దాలుగా ఈ కోర్సును అందిస్తున్నాం. ఇక్కడ చదివిన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యార్థులతో సమానంగా, కొన్ని సందర్భాల్లో మరికొంత ఎక్కువగానే ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సీటీసీ చూస్తే 8 నుంచి 20 లక్షల వరకు ప్యాకేజీ వస్తుంది. ఏటేటా ఈ ప్లేస్‌మెంట్స్, సీటీసీలు పెరుగుతున్నాయి. ఎంసీఏ సిలబస్‌లో సాంకేతికతలో వస్తున్న కొత్త అంశాలను కూడా అందిస్తున్నాం.
- ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులు దీన్ని పట్టించుకోకపోవడం విచారించాల్సిన అంశం. ఉత్తరభారతప్రాంత విద్యార్థులు నిమ్‌సెట్ ద్వారా ఎంసీఏ చేసి మంచి ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. భోపాల్, అలహాబాద్ పరీక్ష కేంద్రాల్లో 1200 నుంచి 1500 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుంటే తిరుచ్చిలో 80, వరంగల్‌లో 150 మంది మాత్రమే పరీక్షకు హాజరువుతున్నారు. డిగ్రీచేసినవారు జాతీయప్రాముఖ్యం కలిగిన ఎన్ఐటీలలో ఎంసీఏ చేస్తే మంచి భవిష్యత్ ఉంటుంది. దీనికోసం నిమ్‌సెట్ రాయడం ఒక్కటే మార్గం. ఇటీవల యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంసీఏ చేసిన విద్యార్థికి రూ.40 లక్షలకు పైగా ప్యాకేజీతో క్యాంపస్‌ప్లేస్‌మెంట్‌కు ఎంపిక కావడం గమనించాల్సిన అంశం. కోర్సుకు సంబంధించిన ఏవైనా సందేహాలు ఉంటే వరంగల్ ఎన్ఐటీలో సంబంధిత డిపార్ట్‌మెంట్‌ను సంప్రదిస్తే మీ సందేహాలు తీరుస్తారు.
- **హెల్ప్‌డెస్క్ నంబర్:** 7303520035.



- వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్
ప్రొ. ఎన్వీ రమణారావు

- **పరీక్ష కేంద్రాలు:** దేశవ్యాప్తంగా 22 పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. మన రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్‌లో సెంటర్లు ఉన్నాయి.

### ముఖ్యతేదీలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మార్చి 6 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** మార్చి 31 (సాయంత్రం 5 వరకు)
- **దరఖాస్తు ఫీజు:** రూ.2,500/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.1,250/-
- **అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్:** మే 11 నుంచి 22 వరకు
- **పరీక్షతేదీ:** మే 24 (ఉదయం 10 నుంచి 12 వరకు)
- **ఫలితాల వెల్లడి:** జూన్ 8 లోపు చేస్తారు
- **వెబ్‌సైట్:** https://nimcet.in

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ





స్నేహిత్

# మహేశ్వరికి రజతం

**స్టిపుల్ చేజ్‌లో సత్తాచాటిన పాలమూరు విద్యార్థి**

**ఓయూ టీటీ జట్టుకు రజతం • ముగిసిన తొలి ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్**

**భువనేశ్వర్:** ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాలమూరు విశ్వవిద్యాలయ అథ్లెట్ జి.మహేశ్వరి సత్తాచాటింది. పోటీల చివరి రోజైన ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల 3 వేల మీటర్ల స్టిపుల్ చేజ్‌లో 10 నిమిషాల 40.90 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని రజత పతకాన్ని కైవసం చేసుకుంది. సావిత్రిబాయ్ పూలే యూనివర్సిటీకి చెందిన కోమల్ (10:26.63) అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. షాలినీ (పంజాబ్ యూనివర్సిటీ) కాంస్యం గెలుచుకుంది. విజేతలను సాట్స్ చైర్మన్ ఏ.వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు. ఈ క్రీడల్లో ఉస్మానియా యూనివర్సిటీకి ఓ స్వర్ణం, ఓ రజతం దక్కగా.. పాలమూరు విశ్వవిద్యాయం రజతంతో టోర్నీని ముగించింది. 17 స్వర్ణాలు సహా మొత్తం 46 పతకాలు సాధించిన పంజాబ్ విశ్వవిద్యాలయం తొలి ఖేలో ఇండియా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది.

**స్నేహిత్ సేనకు సిల్వర్**

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) పురుషుల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్టు రజత పతకం సొంతం చేసుకుంది. టేబుల్ టెన్నిస్ ఫైనల్లో ఓయూ జట్టు 1-3తో చిత్కర యూనివర్సిటీ టీమ్ చేతిలో ఓడింది. ఓయూ ఆటగాడు ఫిడేల్ రఫీక్ స్నేహిత్ 11-7, 11-6, 11-7తో అర్జున్ ఘోష్‌పై గెలిచి శుభారంభం చేశాడు. అయితే, ఆ తర్వాత మరో సింగిల్స్‌లో మహ్మద్ అలీ 11-5, 11-5, 7-11, 8-11, 13-15తో పరాజయం చెందాడు. అనంతరం ఎం.రఘురామ్ సహా ఆ తర్వాతి మ్యాచ్‌లో స్నేహిత్ సైతం పరాజయం చెందడంతో ఓయూ జట్టు రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.


కోచ్ నాగపురి రమేశ్‌తో మహేశ్వరి

## ద్యుతీకి రెండో స్వర్ణం



భారత అగ్రశ్రేణి స్ప్రింటర్ ద్యుతీ చంద్ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో రెండో స్వర్ణంతో మెరిసింది. కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ విశ్వవిద్యాలయం తరఫున బరిలోకి దిగిన ద్యుతీ.. 200 మీటర్ల పరుగులో 23.66 సెకన్లలోనే గమ్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచింది. కీర్తి విజయ్ భోటి, దీపాలి మహాపాత్ర వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు.





## హంపి@2

**చెన్నై:** ఇటీవల అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న భారత గ్రాండ్‌మాస్టర్, తెలుగు క్రీడాకారిణి కోనేరు హంపి ప్రపంచ చెస్ ర్యాంకింగ్‌లో రెండో స్థానానికి చేరింది. గతేడాది డిసెంబర్‌లో ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించిన హంపి.. ఇటీవల ప్రతిష్ఠాత్మక కెయిన్స్ కప్‌ను కైవసం చేసుకొని సత్తాచాటింది. దీంతో హంపి 2589 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించి ఆదివారం వెల్లడైన తాజా ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న ప్రపంచ చాంపియన్ జు వెంజున్ (2583)ను వెనక్కి నెట్టింది. చైనా ప్లేయర్ ఇఫాన్ హౌయు (2658) అగ్రస్థానంలో ఉంది. మరో తెలుగు ప్లేయర్ ద్రోణవల్లి హారిక (2517) తొమ్మిదో ర్యాంకులో నిలిచింది. కాగా, పురుషుల విభాగం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్లు ఎవరూ టాప్-10లో చోటు దక్కించుకోలేకపోయారు. ప్రపంచ మాజీ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ 16వ స్థానంలో కొనసాగగా.. నాలుగు స్థానాలు మెరుగుపరుచుకున్న విదిత్ సంతోష్ 22వ ర్యాంకులో ఉన్నాడు.

## బల్బీర్ సింగ్ కన్నుమూత



**న్యూఢిల్లీ:** భారత హాకీ మాజీ ఆటగాడు బల్బీర్ సింగ్ కుల్లర్ గుండెపోటుతో మృతి చెందారు. 1968 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టులో సభ్యుడైన కుల్లర్.. గతంలో జాతీయ జట్టు సెలెక్టర్‌గానూ పనిచేశారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 'నాతో పాటు మా నాన్న అమెరికాకు రావాల్సి ఉంది. అయితే శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా జలంధర్ జిల్లాలోని మా స్వగృహంలోనే ఆయనకు గుండెపోటు రావడంతో మృతి చెందారు' అని బల్బీర్ కుమారుడు కమల్బీర్ సింగ్ ఆదివారం వెల్లడించాడు. కాగా, బల్బీర్ అంత్యక్రియలు సోమవారం జరుగనున్నాయి. హాకీ ఇండియా (హెచ్ఐ) ఆయన మృతిపై సంతాపం వ్యక్తం చేసింది.




## ఏసీసీ సమావేశం వాయిదా

**కోల్‌కతా:** ఈ ఏడాది జరగాల్సిన ఆసియా కప్ వేదికను ఖరారు చేసేందుకు దుబాయ్‌లో మంగళవారం జరగాల్సిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సమావేశం వాయిదా పడింది. కరోనా వైరస్ ప్రభావం కారణంగా బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ సహా మరికొందరు సభ్యులు సమావేశానికి హాజరయ్యేందుకు నిరాకరించడమే ఇందుకు కారణం. దీంతో ఆసియా కప్ వేదిక ఖరారు మరింత ఆలస్యం కానుంది. కొన్ని రోజులుగా దుబాయ్‌లో దాదాపు 700 కరోనా కేసులు నమోదవడంతో ఆందోళన పెరిగింది. 'ఆదివారం రాత్రే గంగూలీ బయల్దేరాల్సి ఉంది. అయితే దుబాయ్‌లో కరోనా వైరస్ ఆందోళన.. సమావేశం వాయిదాకు దారితీసింది' అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి వెల్లడించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆసియా కప్ షెడ్యూల్ ప్రకారం పాకిస్థాన్‌లో జరగాల్సి ఉన్నా.. భారత్ అభ్యంతరాల నేపథ్యంలో వేదిక మారనుంది.

# పేస్‌కు దాసోహం



**మరోసారి భారత బ్యాట్స్‌మెన్ విఫలం • రెండో ఇన్నింగ్స్‌లో 90 పరుగులకే 6 వికెట్లు**

**షమీ, బుమ్రా శ్రమ వృథా • న్యూజిలాండ్‌తో రెండో టెస్టు**

ఓపెనర్లు అదరగొట్టడంతో రెండో టెస్టులో న్యూజిలాండ్ ఒక దశలో 66/0తో నిలిచింది. ఇంకేముంది ఈ టెస్టు కూడా చేజారినట్లే అని భావిస్తున్న సమయంలో.. భారత బౌలర్లు సమిష్టిగా సత్తాచాటారు. దీంతో కివీస్ టాపార్డర్ బ్యాట్స్‌మెన్ క్రీజులో నిలువలేకపోయారు. షమీ, బుమ్రా విజృంభించడంతో న్యూజిలాండ్ 177 రన్స్‌కే 8 వికెట్లు కోల్పోయింది.

ఇంకేముంది మరో పది పరుగుల్లోపు మిగిలిన రెండు వికెట్లు పడగొడితే.. టీమ్‌ఇండియాకు మంచి ఆధిక్యం దక్కడం ఖాయమే అనుకుంటున్న తరుణంలో.. ఆరున్నర అడుగుల పేసర్ జెమీసన్ బ్యాట్‌తో కోహ్లీ సేనను దెబ్బకొట్టాడు. వాగ్నర్‌తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 51 పరుగులు జోడించి టీమ్‌ఇండియా ఆధిక్యాన్ని ఏడు పరుగులకు పరిమితం చేశాడు.

కివీస్ ఇన్నింగ్స్ ముగిసేసరికి ఇరు జట్ల పరిస్థితి దాదాపు సమానంగానే ఉంది. సిరీస్ మొత్తంలో ఇప్పటి వరకు పెద్దగా రాణించలేకపోయిన భారత బ్యాట్స్‌మెన్ కనీసం ఈ చివరి ఇన్నింగ్స్‌లోనైనా ఆకట్టుకొని ప్రత్యర్థికి టఫ్ టార్గెట్ ఇస్తారనుకుంటే.. మనవాళ్లు పాతపాటే అందుకున్నారు. కనీస పోరాటం కనబర్చకుండా.. ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఫలితంగా 90 పరుగులకే భారత్ ఆరు వికెట్లు కోల్పోయింది.

ప్రస్తుతం టీమ్‌ఇండియా ఆధిక్యం 97 పరుగులు. హనుమ విహారి, రిషబ్ పంత్ క్రీజులో ఉన్నారు. ఇంకా జడేజా బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది. మరి మూడో రోజు తొలి సెషన్‌లో మనవాళ్లు ఎలా ఆడతారో చూడాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అద్భుతాలు జరుగుతాయని ఆశించడం కల్లే అయినా.. పోరాడే లక్ష్యాన్ని కివీస్ ముందుంచితే.. బుమ్రా బ్యాచ్ ఏమైనా మ్యాజిక్ చేస్తుందేమోనని ఆశ..!

**క్రైస్ట్‌చర్చ్:** మ్యాచ్‌పై పట్టుబిగించేందుకు బౌలర్లు సృష్టించిన అద్భుత అవకాశాన్ని బ్యాట్స్‌మెన్ చేజార్చడంతో టీమ్‌ఇండియా మళ్లీ కష్టాల్లో పడింది. న్యూజిలాండ్‌తో రెండో టెస్టులోనూ పరాజయానికి చేరువై వైట్‌వాష్ ప్రమాదం ముంగిట నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఫర్వాలేదనిపించిన కోహ్లీసేన.. ఆదివారం పూర్తిగా తడబడింది. ఏడు పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్‌ఇండియా కివీస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ (3/12) రెచ్చిపోవడంతో 90 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 63/0తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్.. 235 పరుగులకు ఆలౌటైంది. షమీ (4/81), బుమ్రా (3/62) నిప్పులు చెరిగారు. ఓపెనర్ టామ్ లాథమ్ (52), జెమీసన్ (49) రాణించారు. ప్రస్తుతం నాలుగు వికెట్లు చేతిలో ఉన్న భారత్ ఓవరాల్‌గా 97 పరుగుల ఆధిక్యంలో ఉంది. హనుమ విహారి (5), రిషబ్ పంత్ (1) క్రీజులో ఉన్నారు. వీరిద్దరితో పాటు బ్యాటింగ్‌కు రావాల్సి ఉన్న జడేజాపైనే టీమ్‌ఇండియా ఆశలు పెట్టుకుంది. మొత్తానికి మ్యాచ్ మూడో రోజే.. కథ క్లైమాక్స్‌కు చేరింది.

**షమీ, బుమ్రా వహ్వా..**

టీమ్‌ఇండియా పేసర్లు మహమ్మద్ షమీ, జస్ప్రీత్ బుమ్రా రెండో రోజు ఆరంభం నుంచి పేస్, స్వింగ్‌తో అదరగొట్టారు. తొలి రోజు 23 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసినా.. ఒక్క వికెట్ కోల్పోని కివీస్‌ను వరుస వికెట్లతో ఉక్కిరిబిక్కిరి చేశారు. తొలుత బ్లండెల్ (30)ను ఔట్ చేసి ఉమేశ్ యాదవ్ (1/46) కివీస్ పతనానికి తెరతీయగా.. ఆ తర్వాత షమీ, బుమ్రా ద్వయం రెచ్చిపోయింది. అద్భుతమైన సీమ్ బంతితో కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (3)ను బుమ్రా పెవిలియన్‌కు పంపాడు. రాస్ టేలర్ (15)ను జడేజా ఔట్ చేస్తే.. షమీ వేసిన ఔట్ స్వింగర్‌కు నికోల్స్ (14) వెనుదిరిగాడు. లంచ్ విరామం తర్వాత వాట్లింగ్ (0), సౌథీ (0)లను ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపిన బుమ్రా భారత శిబిరంలో ఆనందం నింపాడు.

**జెమీసన్ విజృంభణ**

153/7 వద్ద క్రీజులోకి వచ్చిన పేసర్ జెమీసన్ టాపార్డర్ బ్యాట్స్‌మెన్‌ను తలపించాడు. స్టార్ ప్లేయర్లు తడబడిన చోట స్వేచ్ఛగా షాట్లు ఆడుతూ ముందుకు సాగాడు. అంత వరకు వికెట్ల పండగ చేసుకున్న భారత బౌలర్లు తోకను తెంచలేక ఇబ్బంది పడ్డారు. గ్రాండ్‌హోమ్ (26) ఔటైనా.. వాగ్నర్ (21) జతగా జెమీసన్ రెచ్చిపోయాడు. వరుసగా బౌండరీలు బాదుతూ తొమ్మిదో వికెట్‌కు వాగ్నర్‌తో కలిసి 51 పరుగులు జత చేశాడు. దీంతో ఓ దశలో 177కే ఎనిమిది వికెట్లు కోల్పోయిన కివీస్ చివరికి 235 పరుగులు చేసి భారత్‌కు 7 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని మిగిల్చింది. ఈ క్రమంలో షమీ బౌలింగ్‌లో జడేజ పట్టిన అద్భుతమైన క్యాచ్‌కు వాగ్నర్ ఔట్‌కాగా.. జెమీసన్ చివరి వికెట్ రూపంలో వెనుదిరిగాడు.

**టపటపా..**

7పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత బ్యాట్స్‌మెన్ ఏ దశలోనూ కివీస్ బౌలర్లను ప్రతిఘటించలేకపోయారు. న్యూజిలాండ్ పేసర్లు బౌల్ట్, సౌథీ స్వింగ్‌కు మరోసారి దాసోహమయ్యారు. మయాంక్ (3)ను బౌల్ట్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా.. పృథ్వీ షాను సౌథీ ఔట్ చేశాడు. కెప్టెన్ కోహ్లీ (14) తొలి ఇన్నింగ్స్ తరహాలోనే మరోసారి వికెట్ల ముందు దొరకడంతో భారత్ 51 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత రహానే సైతం వాగ్నర్ బౌలింగ్‌లో ఔట్‌కాగా.. రెండున్నర గంటల పాటు క్రీజులో నిలిచి పోరాడిన పుజార (88 బంతుల్లో 24) తక్కువ స్కోరుకే బౌల్ట్ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు.


బౌల్ట్ (3/12)

## క్యా హువా.. కోహ్లీ..!

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ఆరేండ్ల క్రితం ఆస్ట్రేలియా వేదికగా టెస్టు కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న విరాట్ కోహ్లీ.. తన దూకుడైన ఆటతీరుతో జట్టుకు ఎన్నో అద్భుత విజయాలు అందించాడు. ఈ క్రమంలో తొలి సిరీస్ విజయం సాధించిన అనంతరం విరాట్ మాట్లాడుతూ.. 'విదేశీ గడ్డపై వికెట్ల పతనాన్ని అడ్డుకునేందుకు నైట్‌వాచ్‌మెన్‌ను బ్యాటింగ్‌కు పంపడం హాస్యాస్పద నిర్ణయం. మేటి ఆటగాడు తడబడుతున్న చోట టెయిలెండర్లు ఎలా నిలబడగలరు' అని ప్రశ్నించాడు. పరిస్థితి ఎలా ఉన్నా.. సత్తాచాటాల్సింది బ్యాట్స్‌మెనే అని బల్లగుద్ది చెప్పాడు. ఇన్నాళ్లు అదే మాటమీద నిలబడ్డ భారత కెప్టెన్.. న్యూజిలాండ్‌తో రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో వరుసబెట్టి వికెట్లు పడుతుంటే.. ఏం చేయాలో తోచక బ్యాట్స్‌మెన్ బాకీ ఉన్నా.. నైట్‌వాచ్‌మన్‌గా ఉమేశ్ యాదవ్‌ను క్రీజులోకి పంపాడు. ఈ రెండు ఉదాహరణలు కోహ్లీ వైఖరిని స్పష్టం చేస్తున్నాయి. ఒకప్పుడు గెలుపు తప్ప 'డ్రా' కూడా సమ్మతం కాదనేలా దూసుకెళ్లిన విరాట్.. ప్రస్తుతం ఆత్మరక్షణలో పడ్డట్లు కనిపిస్తున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసేందుకు క్రీజులోకి వస్తున్న సమయంలోనే కాస్త అసహనంగా కనిపించిన కోహ్లీ.. న్యూజిలాండ్ బ్యాటింగ్ సందర్భంగా మరింత చికాకు కనబర్చాడు.

అప్పుడెప్పుడో కెరీర్ ఆరంభంలో అభిమానులకు అసభ్యకర సంజ్ఞలు చేసి అవమానాల పాలైన కోహ్లీ.. ఇన్నేండ్ల తర్వాత ఆదివారం ఆటలో అసభ్య పదజాలం వాడి మరోసారి విమర్శకులకు పనికల్పించాడు. ఈ సిరీస్‌లో నాలుగు ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ 9.50 సగటుతో 38 పరుగులు మాత్రమే చేశాడు. ఇరు జట్లలో చివరి వరుస ఆటగాళ్లు బౌల్ట్, షమీ కూడా ఇంతకన్నా ఎక్కువ పరుగుల చేయడం గమనార్హం. టీమ్‌ఇండియా విజయాల్లో మూల విరాట్‌గా నిలిచే.. విరాట్ వైఫల్యం జట్టుపై చాలా ప్రభావం చూపుతున్నది. ముందుండి నడిపించాల్సిన నాయకుడే నడిసంద్రంలో నావను వదిలేస్తుండటం భారత జట్టును కలవరపెడుతున్నది.

## జడ్డూ జాదూ..



**భారత** అత్యుత్తమ ఫీల్డర్ రవీంద్ర జడేజ మరోసారి అద్భుతమైన క్యాచ్‌తో ఆశ్చర్యపరిచాడు. షమీ వేసిన బౌన్సర్‌ను కివీస్ టెయిలెండర్ వాగ్నర్ పుల్ షాట్ ఆడగా.. స్క్వేర్‌లెగ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న జడేజ గాల్లోకి ఎగిరి ఒంటి చేత్తో బంతిని ఒడిసిపట్టాడు. దాదాపు ఒక మీటర్ ఎత్తు నుంచి వెళ్తున్న బాల్‌ను జడ్డూ సూపర్ మ్యాన్‌లా అందుకోవడాన్ని చూసిన వాగ్నర్ నోరెళ్లబెడుతూ పెవిలియన్ బాట పట్టాడు. వండర్ క్యాచ్ పట్టిన జడేజాపై క్రికెట్ ప్రపంచం ప్రశంసల వర్షం కురిపించింది. క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ క్యాచ్‌ల్లో ఇది ఒకటంటూ మాజీ క్రికెటర్లు, అభిమానులు ట్విట్టర్‌లో కామెంట్లు చేశారు.

## స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 242, **న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** లాథమ్ (బి) షమీ 52, బ్లండెల్ (ఎల్బీ) ఉమేశ్ 30, విలియమ్సన్ (సి) పంత్ (బి) బుమ్రా 3, టేలర్ (సి) ఉమేశ్ (బి) జడేజా 15, నికోల్స్ (సి) కోహ్లీ (బి) షమీ 14, వాట్లింగ్ (సి) జడేజా (బి) బుమ్రా 0, గ్రాండ్‌హోమ్ (బి) జడేజా 26, సౌథీ (సి) పంత్ (బి) బుమ్రా 0, జెమీసన్ (సి) పంత్ (బి) షమీ 49, వాగ్నర్ (సి) జడేజా (బి) షమీ 21, బౌల్ట్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 24, **మొత్తం:** 235 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-66, 2-69, 3-109, 4-130, 5-133, 6-153, 7-153, 8-177, 9-228, 10-235, **బౌలింగ్:** బుమ్రా 22-5-62-3, ఉమేశ్ 18-2-46-1, షమీ 23.1-3-81-4, జడేజా 10-2-22-2.

**భారత్ రెండో ఇన్నింగ్స్:** పృథ్వీ షా (సి) లాథమ్ (బి) సౌథీ 14, మయాంక్ (ఎల్బీ) బౌల్ట్ 3, పుజారా (బి) బౌల్ట్ 24, కోహ్లీ (ఎల్బీ) గ్రాండ్‌హోమ్ 14, రహానే (బి) వాగ్నర్ 1, ఉమేశ్ (బి) బౌల్ట్ 1, విహారి (నాటౌట్) 5, పంత్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 19, **మొత్తం:** 90/6. **వికెట్ల పతనం:** 1-8, 2-26, 3-51, 4-72, 5-84, 6-89, **బౌలింగ్:** సౌథీ 6-2-20-1, బౌల్ట్ 9-3-12-3, జెమీసన్ 8-4-18-0, గ్రాండ్‌హోమ్ 5-3-3-1, వాగ్నర్ 8-1-18-1.

## కర్ణాటక 122 ఆలౌట్

■ **బెంగాల్‌తో రంజీ సెమీఫైనల్**


రాహుల్‌ను ఔట్ చేసిన ఆనందంలో బెంగాల్ ఆటగాళ్లు

**కోల్‌కతా:** బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న కర్ణాటక జట్టు రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో అనూహ్యంగా తడబడింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుతున్న సెమీస్‌లో బెంగాల్ యువ పేసర్ ఇషాన్ పొరెల్ (5/39) విజృంభించడంతో.. కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 122 పరుగులకు ఆలౌటైంది. లోకేశ్ రాహుల్ (26), కరుణ్ నాయర్ (3), మనీశ్ పాండే (12), పడిక్కల్ (4), సమర్థ్ (0), సిద్ధార్థ్ (14) శరత్ (1) ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. బెంగాల్ బౌలర్లలో ఇషాన్ పొరెల్ (5/39) చెలరేగిపోయాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన బెంగాల్ ఆదివారం ఆట ముగిసే సమయానికి 72/4తో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 190 పరుగుల ఆధిక్యాన్ని కలుపుకొని బెంగాల్ ప్రస్తుతం 262 పరుగుల ముందంజలో ఉంది. సౌరాష్ట్రతో జరుగుతున్న మరో సెమీఫైనల్లో గుజరాత్ 119/6తో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 304 రన్స్ చేసిన సౌరాష్ట్ర 185 పరుగుల ఆధిక్యంలో ఉంది.

## లిటన్ సెంచరీ

■ **జింబాబ్వేపై బంగ్లా గెలుపు**


లిటన్ దాస్ (126)

**సిలెట్:** బ్యాట్స్‌మెన్ విజృంభణకు.. బౌలర్ల జోరు తోడవడంతో జింబాబ్వేతో జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ జట్టు 169 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన తొలి వన్డేలో ఓపెనర్ లిటన్ దాస్ (126; 13 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో కదం తొక్కడంతో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 321 పరుగులు చేసింది. మిథున్ (50) అర్ధశతకం చేశాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన జింబాబ్వే ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. బంగ్లా బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన జింబాబ్వే చివరకు 39.1 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. మంగళవారం ఇరు జట్ల మధ్య రెండో వన్డే జరుగనుంది.

## విండీస్ వైట్‌వాష్

■ **మూడో వన్డేలోనూ లంకదే విజయం**

**పల్లెకెల:** ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శ్రీలంక ఉత్కంఠ పోరులో వెస్టిండీస్‌ను చిత్తుచేసి మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం ఇక్కడ జరిగిన చివరి వన్డేలో ఆతిథ్య లంక జట్టు ఆరు పరుగుల తేడాతో విండీస్‌పై విజయం సాధించింది. కుశాల్ మెండిస్ (55), ధనుంజయ్ డిసిల్వ (51) అర్ధశతకాలతో రాణించడం సహా కరుణరత్నే (44), కుశాల్ పెరీరా(44) ఆకట్టుకోవడంతో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 307 పరుగులు చేసింది. విండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్ నాలుగు, హోల్డర్ రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో షాయ్ హోప్ (72), సునీల్ అంబ్రిస్ (60), పూరన్ (50), కెప్టెన్ పొలార్డ్ (46) అదరగొట్టినా విండీస్‌కు ఓటమి తప్పలేదు. చివరి ఓవర్‌లో విజయం కోసం వెస్టిండీస్‌కు 13 పరుగులు అవసరం కాగా లంక బౌలర్ మాథ్యూస్ కట్టడి చేశాడు. అంత వరకు అద్భుతంగా పోరాడిన ఫాబియన్ అలెన్ (15 బంతుల్లో 37; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) ఓ ఫోర్ కొట్టి ఔటవడంతో విండీస్ కథ ముగిసింది. నాలుగు వికెట్లు తీసి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించిన లంక సీనియర్ ఏంజెలో మాథ్యూస్‌కి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', హసరంగకు 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'అవార్డులు దక్కాయి.



## బెంగళూరు గెలుపు

**బెంగళూరు:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) తొలి అంచె సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు ఎఫ్‌సీ విజయం సాధించింది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య బెంగళూరు 1-0తో ఏటీకేపై గెలిచింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఆథిత్య జట్టు తరఫున దేషోర్న్ బ్రౌన్ 31వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. మ్యాచ్ రెండో అర్ధభాగంలో ఇరుజట్లు ఎన్నిసార్లు ప్రయత్నించినా గోల్ చేయడంలో విఫలమయ్యాయి. ఆసాంతం ఏటీకేపై ఆధిపత్యం ప్రదర్శించిన ఛెత్రీసేన చివరికి గెలుపు సొంతం చేసుకుంది.